


www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి



శనివారం | 12-8-2017 | పేజీలు: 16 + 20 | వెల: రూ.5.00 | సంపుటి: 14 సంచిక: 34 | శ్రీహేవళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం; తిథి: పంచమి రా. 10.07 తదుపరి షష్ఠి; నక్షత్రం: ఉత్తరాభాద్ర ఉ. 6.14, రేవతి తె. 5.50 వరకు; వర్జ్యం: సా.6.02-7.36; దుర్ముహూర్తం: ఉ.6.02-6.52; అమృతఘడియలు: తె.3.29-5.03; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.02; సూర్యాస్తమయం: 6.39 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tanuku | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai



ఉపరాష్ట్రపతిగా వెంకయ్యతో ప్రమాణం చేయిస్తున్న రాష్ట్రపతి కోవింద్

వాదించండి.. విభేదించండి.. కానీ..

• రాజ్యాంగ పీఠంపై తెలుగునేత

బహిష్కరించకండి!

వెంకయ్య తొలి సందేశం.. ఉప రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం

చర్చల ద్వారానే ప్రజా సమస్యలకు పరిష్కారం

భారత్ బలోపేతానికి పటిష్ఠ చట్టాలు అవసరం

సమయాన్ని వృథా చేయకుండా చర్చలు జరపండి

ప్రతి ఎంపీ ఆత్మ విమర్శ చేసుకోవాలి: ఉప రాష్ట్రపతి

తొలిసారి 4 అగ్ర పీఠాల్లో కమలనాథులు

16

పీవీ నరసింహారావు తర్వాత మరో తెలుగువాడు రాజ్యాంగ పీఠాన్ని అలంకరించాడు. ఉప రాష్ట్రపతిగా ముప్పవరపు వెంకయ్య నాయుడు శుక్రవారం ఉదయం ప్రమాణ స్వీకారం చేశారు. ఆ వెంటనే రాజ్యసభ చైర్మన్‌గానూ బాధ్యతలు చేపట్టారు. తొలిసారిగా సభను నిర్వహించారు. వాదించినా, విభేదించినా, అంతరాయాల్లేకుండా సభను సాగనివ్వాలని ఎంపీలకు పిలుపునిచ్చారు.

అతిరథుల సమక్షంలో బాధ్యతలు

రాజ్యాంగ పదవుల్లో అంతా సామాన్యులే

ఇది మన ప్రజాస్వామ్య గొప్పదనం

వెంకయ్య అనుభవం వరం: మోదీ

నేనెళ్తున్నా.. ఆయన వచ్చారు: ఏచూరి



బాసరలో భక్తుల కానుకలు

పక్కదారి

హుండీలు నామమాత్రం

కాగితాలపైనే నిబంధనలు

ఆలయ ఆదాయానికి ఏటా రూ.కోట్లలో గండి

3

ఎల్లుండి నుంచి మళ్లీ వానలు!

2

ఏప్రిల్ 12నే బడులు బంద్..

జూన్ 1న ప్రారంభం

వారంలో టీఎస్‌పీఎస్సీకి ఉపాధ్యాయ పోస్టులు

టీచర్ల నియామకాలపై విద్యా శాఖ కసరత్తు

భర్తీలో జిల్లాల ప్రాతిపదికపై వీడని సందిగ్ధం

17న మరోసారి భేటీ.. అప్పుడే తుది నిర్ణయం

ఇంటర్ అనుబంధ గుర్తింపులో అవినీతి లేదు

పారదర్శకంగా అనుమతులు: కడియం



హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, పంచాయతీరాజ్ స్కూళ్లలో టీచర్ పోస్టుల భర్తీపై విద్యా శాఖ దృష్టి సారించింది. ఇప్పటికే వివిధ కేటగిరీల్లో 8,792 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నట్లు గుర్తించిన విద్యాశాఖ, పోస్టుల వివరాలు, రోస్టర్ పాయింట్లను సిద్ధం చేస్తోంది. వారం రోజుల్లోగా టీఎస్‌పీఎస్సీకి పోస్టుల వివరాలు పంపించాలని విద్యాశాఖ నిర్ణయించింది. శుక్రవారం సచివాలయంలో విద్యాశాఖ మంత్రి, డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, విద్యాశాఖ స్పెషల్ సీఎస్ రంజీవ్ ఆర్ ఆచార్య, పాఠశాల విద్యా కమిషనర్‌తో టీచర్ పోస్టుల భర్తీపై సమీక్ష నిర్వహించారు. అయితే నోటిఫికేషన్‌పై సందిగ్ధత ఏర్పడింది. పాత పది జిల్లాల ప్రకారం నోటిఫికేషన్ జారీ చేయాలా? 31 జిల్లాల ప్రకారం నోటిఫికేషన్ జారీ చేయాలా? అనే అంశంపై ఇంకా తుది నిర్ణయం తీసకోలేదు. కొత్తగా ఏర్పడిన 31 జిల్లాల ప్రకారం ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. కానీ 31 జిల్లాల ప్రకారం నోటిఫికేషన్ జారీ చేస్తే అర్బన్ జిల్లాల్లో తక్కువ పోస్టులు, రూరల్ జిల్లాల్లో ఎక్కువ టీచర్ ఖాళీలు ఉండే అవకాశం ఉంది. దీనిపై నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ అంశంపై 17న మరోసారి సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఎన్‌సీటీఈ నిబంధనల ప్రకారం ఉపాధ్యాయ అర్హతలను నిర్ణయించి అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు కడియం శ్రీహరి సూచించినట్లు తెలిసింది. ఇక, అకడమిక్ క్యాలెండర్‌పైనా సమావేశంలో చర్చించారు. ఏప్రిల్ 12నే స్కూళ్లకు సెలవులు ప్రకటించేసి జూన్ 1వ తేదీన పునః ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలిసింది. జూన్ 2వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవం

మిగతా 5వ పేజీలో...



రైతన్న జీవన గంగ 'నల్లవాగు'

- ప్రాజెక్టును ప్రారంభించి నేటికి 50 ఏళ్లు
- చెక్కు చెదరని ఎర్త్ డ్యాం

కల్హేర్, ఆగస్టు 11: ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏకైక మధ్య తరహా ప్రాజెక్టు.. నల్లవాగు శనివారానికి 50 వసంతాలు పూర్తి చేసుకోనుంది. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలంలో ఉన్న నల్లవాగు ప్రాజెక్టును 1967 ఆగస్టు 12న అప్పటి సీఎం కాసు బ్రహ్మానందరెడ్డి ప్రారంభించి జాతికి అంకితం చేశారు. 5,100 ఎకరాలకు సాగునీరందిస్తున్న ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,493 అడుగులు. సిర్గాపూర్, కల్హేర్ మండలాల్లోని 12 గ్రామాలతోపాటు కామారెడ్డి జిల్లాలోని రెండు గ్రామాలకు ఈ ప్రాజెక్టు ద్వారా సాగునీరందుతోంది. 1964లో ప్రాజెక్టు పనులు మొదలుకాగా.. 1967లో సాగునీటి సరఫరా ప్రారంభమైంది.



లోకం తీరు



మీరు కూడా విదేశాల్లోకన్నా స్వదేశంలో ఎక్కువ రోజులు ఉంటే బాగుందు అనుకుంటున్నారట సార్!

ఎల్లుండి నుంచి భారీ వర్షాలు!

- కొన్ని చోట్ల భారీ, చాలా చోట్ల తేలికపాటి వానలు

హైదరాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మరో రెండు రోజుల్లో రాష్ట్రంలో కొన్ని చోట్ల భారీ వర్షాలు పడే సూచనలున్నాయని వాతావరణశాఖ తెలిపింది. సోమవారం నుంచి అక్కడక్కడా భారీ వర్షాలు, చాలా చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. శని, ఆదివారాల్లోనూ రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని చోట్ల మాత్రమే తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు గురువారం నుంచి కాస్త తగ్గుముఖం పట్టాయి. బుధవారం నాటి వరకు కొన్ని చోట్ల మాత్రమే తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడ్డాయి. కాగా, శుక్రవారం కొన్ని చోట్ల మాత్రమే వర్షాలు కురిశాయి. పలు వాతావరణ కేంద్రాల్లో సాధారణం కంటే ఎక్కువగా పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏదేమైనా ఈ వారం రోజుల్లో కురిసిన వర్షాలు ఎండిపోతున్న పంటలకు ఊపిరి పోశాయని వ్యవసాయశాఖ వర్గాలు చెబుతున్నాయి.

బట్టతలపై జుట్టు మొలిపించే సూది మందు

భారతీయ వైద్యుల ఔషధానికి అమెరికా పేటెంట్

- 'ఆంధ్రజ్యోతి'కి డాక్టర్ దేవ్‌రాజ్ సోమ్ ఇంటర్వ్యూ

"ఇసుకను పిండి నూనె తీయొచ్చు.. ఎండమావిలో నీళ్లు తాగొచ్చేమోగానీ.. బట్టతల మీద జుట్టు మొలిపించడం మాత్రం కష్టమబ్బా" ..చాలా మంది బట్టతల బాధితుల మనసులో మాట ఇది! ఏదో వీవింగ్‌తోనో.. హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌తోనో సరిపెట్టుకోవాల్సిందేగానీ దీనికి సరైన మందు లేదని వారు తెగ బాధపడిపోతుంటారు. అలాంటి వారికి ఒక శుభవార్త. అపోలో స్పెక్ట్రా ఆస్పత్రికి చెందిన డాక్టర్ దేవ్‌రాజ్ సోమ్, డాక్టర్ రింకీకపూర్ పరిశోధనల ఫలితంగా ఆ కొరత కూడా తీరిపోయింది. వారు తయారుచేసిన క్యూఆర్ 678 అనే మందు (ఇంజెక్షన్)కు అమెరికా పేటెంట్ లభించింది. ఈ తరహా మందుకు పేటెంట్ లభించడం ప్రపంచంలో ఇదే తొలిసారి. దీనిపై డాక్టర్ దేవ్‌రాజ్ 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ విశేషాలు..

క్యూఆర్ 678.. బట్టతల బాధితుల ఆశాదీపం.. ఈ మందును తయారుచేయటానికి మీకు ఎంతకాలం పట్టింది?

ఈ మందును 2008లో తయారుచేశాం. 2010లో క్లినికల్ ట్రయల్స్ ప్రారంభించాం. 2013లో యునైటెడ్ స్టేట్స్ పేటెంట్ అండ్ ట్రేడ్‌మార్క్ ఆఫీసులో పేటెంట్ కోసం దరఖాస్తు చేశాం. అంటే ఈ మందును బయటకు తీసుకురావడానికి దాదాపు పదేళ్లపాటు శ్రమించాల్సివచ్చింది. క్యూఆర్ 678 అనే ఈ ఇంజెక్షన్‌ను మన దేశంలో ప్రవేశపెట్టడం కోసం డ్రగ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా అనుమతి అడిగాం. ఇది రావడానికి మరో తొమ్మిది నెలలు పట్టవచ్చు. అప్పుడు ఈ మందు దేశమంతా దొరుకుతుంది. ఇప్పుడు మాత్రం ముంబైలోని అపోలో ఆస్పత్రి స్టడీ క్లినిక్‌లో లభిస్తుంది.



దీనిని ఎలా ప్రయోగిస్తారు?

మన జుట్టు కింద సూక్ష్మమైన రక్తనాళాలు ఉంటాయి. ఈ రక్తనాళాలలో సమస్య ఏర్పడితే జుట్టు ఊడిపోతుంది. ఈ సమస్యకు జన్యుపరమైన పరిస్థితులు (అంటే పూర్వీకులకు ఉంటే మనకు కూడా వచ్చే అవకాశం ఎక్కువ), వాతావరణ పరిస్థితులు, జీవన శైలి, హార్మోన్ల సమతౌల్యం లోపించడం ఇలా రకరకాల కారణాలుంటాయి. క్యూఆర్ 678ను మీసోథెరపి అనే టెక్నిక్ ద్వారా కుదుళ్లలోకి ఎక్కిస్తాం. అది కుదుళ్లపై పనిచేసి మళ్లీ జుట్టు మొలిచేలా చేస్తుంది. ఈ చికిత్స కూడా చాలా సింపుల్‌గా ఉంటుంది.

బట్టతల వారందరికీ జుట్టు వస్తుందా? పరిమితులున్నాయా?

బట్టతల వచ్చి ఎంత కాలమయిందనే విషయంపై ఇది ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు 30 ఏళ్ల వ్యక్తికి బట్టతల వచ్చిందనుకుందాం. రాగానే ఈ ఇంజెక్షన్ చేయించుకుంటే పూర్వం ఎలా ఉందో అదేరీతిలో జుట్టు వస్తుంది. బట్టతల వచ్చి 15ఏళ్లు అయిపోయిన వ్యక్తికి అంత జుట్టు రాకపోవచ్చు. స్త్రీ, పురుషులందరిపైనా ఒకేలా పనిచేస్తుంది. ఎలాంటి దుష్పరిణామాలూ ఉండవు.

ఎన్ని ఇంజెక్షన్లు తీసుకోవాలి? ఎంత ఖర్చు అవుతుంది?

ఈ ఇంజెక్షన్ ఖరీదు రూ.6 వేలు. జుట్టు పూర్తిగా మొలవడానికి ఎనిమిది నుంచి పది ఇంజెక్షన్లు తీసుకోవాలి. దాదాపు రూ.60 వేలు ఖర్చవుతుంది. ఇది ప్రస్తుతం మార్కెట్లో ఉన్న మందులు, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ల ఖర్చు కన్నా తక్కువ. అంతే కాకుండా చాలా కచ్చితమైన ఫలితాలు వస్తాయి.

అలా వచ్చిన జుట్టు ఎంత కాలం ఉంటుంది?

ఈ చికిత్సతో ఒకసారి వెంట్రుక వచ్చిన తర్వాత అది పెరుగుతూ ఉంటుంది. ఏవైనా తీవ్రమైన కారణాలుంటేనే అది ఊడిపోతుంది. మేము చేసిన క్లినికల్ ట్రయల్స్‌లో అలాంటి సమస్యలేమీ ఏర్పడలేదు. ఒకవేళ ఊడినా మళ్లీ ఇంజెక్షన్ చేయించుకుంటే తిరిగి మొలుస్తుంది.

ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
అదిలాబాద్	22.4	33.6
హైదరాబాద్	22.8	32.4
సంగారెడ్డి	23.0	29.0
మహబూబ్‌నగర్	23.0	32.2
వరంగల్	24.0	33.0
నిజామాబాద్	24.2	32.5



శరద్ యాదవ్‌ను బుజ్జగించే పనిలేదు

శరద్ యాదవ్‌ను బుజ్జగించే ప్రసక్తే లేదు. ఆయన నిర్ణయం ఆయన తీసుకోవచ్చు. పార్టీకి సంబంధించి ఇప్పటికే ఒక నిర్ణయం జరిగింది. బీజేపీతో పొత్తు నిర్ణయం నా ఒక్కడిదే కాదు. పార్టీ ఆమోదంతో తీసుకున్నది. శరద్ యాదవ్‌కు భిన్నమైన అభిప్రాయం ఉంటే.. స్వేచ్ఛగా ఎటువంటి నిర్ణయమైనా తీసుకోవచ్చు.

- బిహార్ సీఎం నితీశ్ కుమార్



ప్రతి మొక్కకు పేరు పెట్టండి

పట్టణ ప్రాంతాల్లోనూ ప్రతీ ఇంటికి మొక్కలను అందించే కార్యక్రమాన్ని చేపట్టనున్నాం. ప్రతీ ఇంటికీ ఆరు మొక్కల చొప్పున నాటండి. ఇంటి ఆవరణ సహా వెనుక భాగంలోనూ మొక్కలు నాటండి. ఇంట్లో పిల్లల్లాగా మొక్కలకు కూడా పేర్లు పెట్టి పెంచండి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్



చిన్నారి ఊపిరిని అడ్డగించిన బెలూన్

- ఆడుకుంటూ బెలూన్‌ను నోట్లో పెట్టుకున్న 8 నెలల బాలుడు
- గొంతులోకి జారి శ్వాస ఆడక ప్రాణాలు విడిచిన పసిగుడ్డు

నాశిక్, ఆగస్టు 11: పుట్టిన రోజు వేడుకలు.. రిటైర్మెంట్ ఫంక్షన్లు.. ఇతర శుభకార్యాల్లో స్టేజీ అందంగా ఆకర్షణీయంగా కనిపించేందుకు బెలూన్లను అలంకరిస్తుంటారు. ఇక, అక్కడికి వచ్చే చిన్నారులు ఆ కార్యక్రమం పూర్తయ్యాక ఆ బెలూన్లను తీసుకుని చేసే హంగామా అంతాఇంతా కాదు. కానీ, చిన్నారులు ఆటలాడుకునే ఆ బెలూనే ప్రాణం మీదకు తెస్తే.. ఊపిరిని గొంతు మధ్యలోనే ఆపేస్తే.. ముక్కుపచ్చలారని ఓ 8 నెలల చిన్నారి ఊపిరి అలాగే ఆగిపోయింది. గొంతులో అడ్డుపడిన బెలూన్ చిన్నారి ఊపిరిని గొంతు దాటనీయకుండా చేసింది. నేలమీద ముద్దుముద్దుగా పాకుతూ ఆడుకుంటూ కంటికి కనిపించిన బెలూన్‌ను తీసుకుని నోట్లో పెట్టేసుకున్నాడు ఆ పసిగుడ్డు. అది గొంతులోకి జారిపోయి చిన్నారి ఊపిరిని తీసేసింది. ఈ విషాద ఘటన మహారాష్ట్రలోని నాశిక్ హనుమాన్ నగర్ ప్రాంతంలో గురువారం సంభవించింది. ఘటనకు సంబంధించిన వివరాలను అంబద్ పోలీసులు వెల్లడించారు. చిన్నారి ఆడుకుంటూ కిందపడిపోయిన బెలూన్‌ను తీసుకుని నోట్లో పెట్టుకోవడంతో గొంతులోకి జారిపోయిందని, వెంటనే ఆ చిన్నారిని తండ్రి స్థానికంగాగల ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లాడని తెలిపారు. అక్కడి వైద్యులు పెద్దాసుపత్రికి రిఫర్ చేయడంతో, అక్కడ బాలుడిని పరీక్షించిన వైద్యులు చనిపోయాడని నిర్ధరించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, బాలుడి తండ్రి ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలహాబాద్ నుంచి నాశిక్‌కు వలస వచ్చి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.

మరో ఐఏఎస్ ఆత్మహత్య..!

ఘజియాబాద్, ఆగస్టు 11: మరో ఐఏఎస్ అధికారి ఆత్మహత్యకు పాల్పడ్డారు. బిహార్‌లోని బక్సర్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ముకేశ్ కుమార్ పాండే మృతదేహం గురువారం రాత్రి ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ రైల్వే జంక్షన్‌లో రైలు పట్టాలపై లభించింది. ఆయన జేబులో ఓ లేఖ లభించిందని, తన స్యూసైడ్ నోట్‌ను ఢిల్లీలోని ఓ ఫైవ్‌స్టార్ హోటల్ రూం నెం.742లో గల తన బ్యాగులో ఉంచానని అందులో రాసినట్లు ఎస్పీ హెచ్‌ఎన్ సింగ్ తెలిపారు. బ్యాగులో పరిశీలించగా 'మనుషులపై నమ్మకం పోయింది. జీవితంపై విరక్తి చెందాను. హోటల్ 10వ అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటున్నాను. నన్ను క్షమించండి. అందరినీ ప్రేమిస్తున్నాను' అని సూసైడ్ నోట్‌లో ఉంది. అస్సాంలోని గువహటికి చెందిన ముకేశ్ 2012 బ్యాచ్‌కు చెందిన యువ ఐఏఎస్ అధికారి.



కండక్టర్‌కు ఎంత కష్టం!

సంగారెడ్డి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బస్ కండక్టర్‌గా విధులు నిర్వహించడమే సవాలు. అలాంటిది.. ఈ మహిళా కండక్టర్ తన 9నెలల బిడ్డను చంకనెత్తుకొని ఎలా విధులు నిర్వహిస్తున్నారో చూడండి. శుక్రవారం సంగారెడ్డి నుంచి నారాయణఖేడ్ వెళుతున్న బస్సులో కనిపించిందీ దృశ్యం. బీకాం కంప్యూటర్స్ చదువుకున్న అలియా జహాన్ సంగారెడ్డి ఆర్టీసీ డిపోలో కాంట్రాక్టు పద్ధతిలో 2013 నుంచి కండక్టర్‌గా పనిచేస్తున్నారు. 2012లో మతాంతర వివాహం చేసుకున్నారు. ఆఫీస్‌లోనే పనిచేసే అవకాశం కల్పించాలని కోరితే.. అధికారులు స్పందించలేదు. ప్రేమ వివాహం చేసుకుందని పెద్దలు దగ్గరకు రానివ్వకపోవడంతో ఆమెకు ఇలా విధుల్లోనూ బిడ్డ బాధ్యత తప్పట్లేదు. కాగా కనీసం యాభై మంది సిబ్బంది ఉన్నచోట క్రెచ్ (పిల్లల బాధ్యతలను చూసుకునే ఏర్పాట్లు) ఉండాలని కేంద్రం స్పష్టమైన నిబంధన తెచ్చిన నేపథ్యంలో ఈ దృశ్యం ఆలోచింపజేసేదే!!

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.70.89	పాత ధర 61.72
కొత్త ధర రూ.71.22	కొత్త ధర 61.90
పెరుగుదల 33 పైసలు	పెరుగుదల 18 పైసలు

రక్తం లేదని గర్భిణిని తిప్పి పంపారు

- వికారాబాద్ ఏరియా ఆస్పత్రి వైద్యులు తీరు
- చేసేది లేక ప్రైవేటు ఆస్పత్రిలో చేరిక



గర్భిణి లక్ష్మి

వికారాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఓవైపు చర్యలు తీసుకుంటుంటే.. ప్రసవం కోసం ప్రభుత్వాస్పత్రికి వచ్చిన ఓ నిండు గర్భిణిని రక్తం తక్కువగా ఉందని చేర్చుకునేందుకు నిరాకరించారు వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రి వైద్యులు. కుటుంబ సభ్యులు కాళ్లావేళ్లాపడినా కనికరించలేదు. "ఆమెలో రక్తం తక్కువగా ఉంది. మా దగ్గర రక్తం అందుబాటులో లేదు. బయట నుంచి రక్తం తెస్తే తప్ప చేర్చుకోం" అని కరాఖండీగా చెప్పేశారు. ధారూరు మండలం, గడ్డమీది గంగారం గ్రామానికి చెందిన లక్ష్మి రెండోసారి గర్భం దాల్చింది. ప్రతినెలా ఇదే ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకుంటోంది. ఈ నెల 9న ఆమెకు కాన్పుచేస్తామని వైద్యులు చెప్పారు. తారీఖు గడిచినా.. పురిటినొప్పులు రాకపోవడంతో లక్ష్మిని ఆమె కుటుంబ సభ్యులు శుక్రవారం ఆస్పత్రికి తీసుకొచ్చారు. అయితే ఆమెలో రక్తం తక్కువగా ఉందని, ఆమెకు సంబంధించిన బీ పాజిటివ్ గ్రూప్‌బ్లడ్ ఆస్పత్రి బ్లడ్‌బ్యాంకులో లేదని వైద్యులు చెప్పారు. దీంతో చేసేదేమీలేక కుటుంబసభ్యులు లక్ష్మిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళతామంటూ వెళ్లారు.



ఆక్సిజన్ కొరత.. 30మంది పిల్లలు మృతి

- యూపీ ఆస్పత్రిలో ఘోరం
- సీఎం యోగీ వచ్చివెళ్లిన రెండ్రోజులకే ఘటన

గోరఖ్‌పూర్ (యూపీ), ఆగస్టు 11: ఓ ఆస్పత్రి యాజమాన్యం నిర్లక్ష్యం 30మంది చిన్నారుల నిండు ప్రాణాలను బలితీసుకుంది. వారి తల్లిదండ్రుల్లో తీరని గర్భశోకాన్ని మిగిల్చింది. యూపీలోని గోరఖ్‌పూర్‌లో జరిగిందీ ఘోరం! ఆక్సిజన్ అందక పట్టణంలోని బాబా భార్గవ్ దాస్ ఆస్పత్రి (బీఆర్డీ)లో కేవలం 48 గంటల వ్యవధిలో 30మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. బీఆర్డీ ఆస్పత్రిలో వైద్యసేవలపై పలు ఫిర్యాదులు రావడం, అక్కడ పెద్ద ఎత్తున చిన్నారుల మరణాలు సంభవిస్తుండటంతో సోమవారం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ ఆస్పత్రిని సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఆయన వచ్చివెళ్లిన రెండు రోజులకే ఆస్పత్రిలో ఈ దారుణం చోటుచేసుకోవడం గమనార్హం. ఎన్‌సిఫలిటిస్‌తో బాధపడుతున్న పిల్లల వార్డు సహా మూడు వార్డుల్లో గురువారం 20మంది చనిపోగా.. శుక్రవారం సాయంత్రానికి మరో 10మంది ప్రాణాలు కోల్పోయారు. కాగా ఈ ఘటనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆక్సిజన్ సరఫరాను కాంట్రాక్టరు నిలిపివేయడంతోనే చిన్నారుల ప్రాణాలు పోయాయని ఆస్పత్రిలోని ఓ వర్గం పేర్కొంది. వైద్యులేమో చిన్నారుల మరణానికి ఆక్సిజన్ లేమి కారణం కాదని.. ఎన్‌సిఫలిటిస్‌తోనే వారు చనిపోయారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆక్సిజన్ సరఫరా చేసే కంపెనీకి ఈ ఆస్పత్రి యాజమాన్యం రూ.66 లక్షల దాకా బకాయి ఉన్నట్టు బయటపడటం గమనార్హం. మొండిబకాయిలు చెల్లించని కారణంగానే గురువారం ఆక్సిజన్ సరఫరాను కంపెనీవారు నిలిపివేయడంతో 20మంది ప్రాణాలు కోల్పోయారు. తేరుకున్న యాజమాన్యం కంపెనీతో మాట్లాడి ఆక్సిజన్ సరఫరా చేయించేందుకు ఒప్పించినా.. మళ్లీ వారు సప్లయ్‌నినిలిపివేయడంతో మరిన్ని మరణాలు సంభవించాయి. బీఆర్డీ ఆస్పత్రిలో ఈ ఏడాదిలో ఇప్పటి దాకా 114మంది చిన్నారులు ఎన్‌సిఫలిటిస్ కారణంగా ప్రాణాలు కోల్పోయారు.



బి3 విటమిన్‌తో చర్మ క్యాన్సర్‌కు చెక్!

న్యూయార్క్: ప్రమాదకరమైన చర్మ క్యాన్సర్ 'మెలనోమా' చికిత్సకు విటమిన్ థెరపీ సమర్థంగా పనిచేస్తుందని ఓ పరిశోధనలో తేలింది. 'విటమన్ బి3' ఉపయోగించి 'మెలనోమాను' అరికట్టవచ్చని యూనివర్సిటీ ఆఫ్ సిడ్నీ పరిశోధకులు కనుగొన్నారు. యూవీ కిరణాల వల్ల చర్మం ఇన్ఫెక్షన్‌కు గురి కాకుండా, డీఎన్ఏ దెబ్బతినకుండా విటమిన్ బి3లోని 'నికోటినమైడ్' అడ్డుకుంటుందని వారి పరిశోధనలో తేలింది. రోజుకు ఒక గ్రాము చొప్పున నికోటినమైడ్‌ను తీసుకోవాలని సూచిస్తున్నారు.

కృత్రిమ తీపి పదార్థాలతో అధిక బరువు, మధుమేహం!

వాషింగ్టన్: బరువు తగ్గడం కోసం ఉపయోగించే నియతాహారం (డైట్ ఫుడ్), కృత్రిమ తీపిపదార్థాల వల్ల ఊబకాయంతోపాటు మధుమేహం కూడా వచ్చే ప్రమాదముందని తాజా పరిశోధనలో తేలింది. ఈ కృత్రిమ తీపి పదార్థాలు మెదడుకు తప్పుడు సంకేతాలు పంపించి మెటబాలిజమ్‌ను దెబ్బతీస్తాయని యేల్ యూనివర్సిటీ శాస్త్రవేత్తల పరిశోధనలో బయటపడింది. కృత్రిమ తీపి పదార్థం తీసుకున్నప్పుడు రుచికి, దాని వల్ల లభించిన క్యాలరీలకు మధ్య ఉన్న అంతరాన్ని గుర్తించడంలో మెదడు విఫలమవుతుంది. దాంతో మెటబాలిజమ్ దెబ్బతింటుంది. అది అధిక బరువు, మధుమేహానికి దారి తీస్తుందని తేలింది.

వరుస సెలవులతో సొంతూళ్లకు..



- రద్దీగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు

హైదరాబాద్ సిటీ, అమరావతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వరుసగా నాలుగు రోజులు సెలవులు వచ్చేశాయ్. ఇంకేం.. నిత్యం బిజీబిజీగా గడిపే భాగ్యనగర ప్రజలు బ్యాగులు సర్దుకుని సొంతూళ్ల బాట పడుతున్నారు. మరి కొందరు సేద తీరేందుకు విహారయాత్రలకు పయనమవుతున్నారు. 12న రెండో శనివారం, 13న ఆదివారం, 14న కృష్ణాష్టమి, 15న స్వాతంత్ర్య దినోత్సవం.. ఇలా వరుస సెలవులొచ్చాయి. దీంతో శుక్రవారం సాయంత్రం నుంచే ఎంజీబీఎస్, జేబీఎస్ బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. మరోవైపు బ్యాంకులకు సోమవారం ప్రభుత్వం సెలవు ప్రకటించడం, దాంతో నాలుగు రోజులు మూతపడనుండటంతో నగదు కోసం ఏటీఎంల ముందు నగర వాసులు క్యూ కడుతున్నారు.

బాసరలో భక్తుల కానుకలు పక్కదారి



హుండీలు నామమాత్రం, కాగితాలపైనే నిబంధనలు

- వేలల్లో వేతనాలు తీసుకుంటున్నా కానుకలు స్వాహా
- ఆలయ ఆదాయానికి ఏటా రూ.కోట్లలో గండి
- భక్తులకు కనీస సౌకర్యాల్లో వెలితి, అభివృద్ధీ అంతంతే

బాసర, ఆగస్టు 11: చదువుల తల్లి బాసర సరస్వతి ఆలయం వివాదాలకు కేంద్ర బిందువుతోంది. మొన్నటికి మొన్న అమ్మవారి మూల విరాట్‌ను గర్భగుడిని దాటించిన వివాదం మరువక ముందే, ఇప్పుడు భక్తులు సమర్పించే కానుకలపై మరో వివాదం ముసురుకుంటోంది. చిన్నారుల అక్షరానికి శ్రీకారం చుట్టేందుకు ఎక్కడెక్కడినుంచో బాసర సరస్వతి అమ్మవారి సన్నిధానానికి భక్తులు వస్తుంటారు. అక్షర శ్రీకారం తర్వాత అమ్మవారికి తమకు తోచినంతలో కానుకలు ఇస్తుంటారు. కానీ, ఆ కానుకలు అమ్మవారి హుండీకి చేరట్లేదు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించే పండితుల జేబుల్లోకే ఆ కానుకలు వెళ్లిపోతున్నాయి. ప్లేట్ కలెక్షన్ల ద్వారా పండితులే వాటిని తీసేసుకుంటున్నారు. తద్వారా ఏటా రూ.కోట్ల విలులైన కానుకలు పక్కదారి పడుతున్నాయి. ఆలయంలో హుండీలు ఉన్నా అవి నామమాత్రమే. ఈ తతంగాన్ని అదుపు చేయాల్సిన అధికారులూ తమ వంతు చేయి వేస్తున్నారు. కానుకల్లో వాటా పొందుతున్నారు. ఫలితంగా అమ్మవారి ఆలయంలో మెరుగైన వసతులు కరువవుతున్నాయి. వాస్తవానికి ఆలయ పండితులకు ప్రభుత్వం నెలనెలా వేలల్లో వేతనం చెల్లిస్తోంది. నిబంధనల ప్రకారం భక్తులు సమర్పించే కానుకలను వారు తీసుకోకూడదు.

వంశపారంపర్య విధానాన్ని రద్దుచేయాలి



ప్రభుత్వం రద్దు చేసిన వంశపారంపర్య విధానం ఇంకా బాసరలో కొనసాగుతోంది. దీనిపై ఆలయ అధికారులకు ఇప్పటికే పలుమార్లు విన్నవించాం.చర్యలు శూన్యం. ఆ విధానాన్ని వెంటనే రద్దుచేసి అర్చకులకు విధులను నిర్ణయించాలి.

- ప్రసాద్, బాసర గ్రామస్థుడు

కానుకలు పక్కదారి పడుతున్నాయి



సరస్వతీఅమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలు దేవస్థానానికి చెందడంలేదు. ప్లేట్ కలెక్షన్, ఇతర రూపాల్లో అవి ప్రతిరోజు వేలల్లో పక్కదారి పడుతున్నాయి. ఆ కానుకలన్నీ దేవస్థానానికి చెందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- రమేశ్, బాసర గ్రామస్థుడు



బాసరలో కిటకిటలాడుతున్న భక్తులు (ఫైల్)

సరస్వతీ మాత దీక్షలో ఉండే భక్తులకు దీక్షా ప్రసాదం అందించే పండిత కుటుంబాలు మాత్రం భక్తులు సమర్పించే ఒడి బియ్యంలో కొంత మొత్తాన్ని మాత్రం తీసుకునే వెసులుబాటు ఉంది. కానీ, ఆ బియ్యంతో పాటు అమ్మవారికి భక్తులు సమర్పించిన విలువైన కానుకలు, చీరలు తదితర కానుకలను తీసుకెళుతున్నారు ఆలయ పండితులు. అలా తీసుకెళుతూ గ్రామస్థులకు పండితులు పట్టుబడిన ఘటనలూ గతంలో ఉన్నాయి. ఇక, భక్తులు కానుకలు సమర్పించేలా అక్షర శ్రీకార సమయంలో ఉత్సవ విగ్రహం ఎదుట ఒకట్రెండు రూ.100, రూ.500 నోట్లను పెడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చివరకు భక్తులు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన పండ్లు, ఫలాలు, మిఠాయిలను కూడా వదలకుండా పండితులు పట్టుకెళ్తున్నారు. ఇక, ఆలయంలో 22 మంది అర్చకులు వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. అందులో ముఖ్యంగా 12 మంది ఆరుగురు చొప్పున షిఫ్టుల వారీగా అక్షర శ్రీకార మండపాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉంది గానీ, అదంతా కూడా ఇప్పటికీ వంశపారంపర్యంగానే కొనసాగుతోంది. ఆ విధానం రద్దై ఏళ్లు గడుస్తున్నా అదే అందులో మార్పు రాలేదు. దీనిపై గ్రామస్థులు పలుమార్లు ఫిర్యాదులు ఇచ్చినా పరిస్థితి మారలేదు. అమ్మవారికి చెందకుండా పక్కదారి పడుతున్న భక్తుల కానుకలు కోట్లలో ఉంటున్నాయి. ఏటా హుండీల ద్వారా ఆలయానికి మూడున్నర కోట్ల ఆదాయం సమకూరుతోంది. అంతే మొత్తంలో కానుకలను పండితులు పక్కదారి పట్టిస్తున్నారు. ఇలా కానుకలు పక్కదారి పట్టడం వల్ల ఆలయ ఆదాయానికి కోట్లలో గండిపడుతోంది. దానిని కట్టడి చేస్తే ఆదాయం రెట్టింపు అవుతుందన్నది స్థానికుల వాదన.

ప్రభుత్వాసుపత్రుల్లో ఇద్దరు శిశువుల మృతి

- బంధువుల ఆందోళన
- వైద్యాధికారిపై కేసు నమోదు
- వైద్యుల సామూహిక సెలవు

నిజామాబాద్/భైంసా, ఆగస్టు 11: నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లోని ప్రభుత్వాసుపత్రుల్లో శుక్రవారం ఇద్దరు శిశువులు మృతి చెందారు. ఇందుకు వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువులు ఆరోపిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో జన్మించిన 10 నిమిషాలకే శిశువు మృతి చెందింది. దీంతో ఆగ్రహించిన బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. బోధన్ మండలం హంగర్గకు చెందిన సనాబేగంకు సిజేరియన్ చేసి బిడ్డను తీశారు. పుట్టిన బిడ్డ 10నిమిషాలకే మృత్యువాతపడ్డాడు. విషయాన్ని గోప్యంగా ఉంచిన వైద్యులు తల్లి పరిస్థితి విషమంగా ఉండడండతో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. ఆమెను ప్రైవేటు ఆసుపత్రికి తరలించిన బంధువులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని ఆందోళన చేపట్టారు. రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ ఆసుపత్రికి చేరుకొని వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపరింటెండెంట్ రాములు సమాధానమిస్తూ సనాబేగంకు గుండెవ్యాధి సమస్య రావడంతో ఆసుపత్రిలో కార్డియాలజిస్టు లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రికి తరలించామని తెలిపారు. ఆసుపత్రిలో సిబ్బంది, వైద్యుల కొరత తీవ్రంగా ఉందని ఎమ్మెల్యేకు చెప్పారు. నిర్మల్ జిల్లా భైంసా ఏరియా ఆసుపత్రిలో అప్పుడే పుట్టిన శిశువు మృతి చెందడం ఆందోళనకు దారితీసింది. తానూర్ మండలం కోలూర్‌కు చెందిన అవదూత్ లలిత(26)కు శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో పురిటి నొప్పులు అధికమవడంతో కుటుంబీకులు వైద్య సిబ్బందిని, వైద్యాధికారిణి సంప్రదించినా సరైన రీతిలో స్పందించలేదు. ఆ తర్వాత ఉదయం 9 గంటల ప్రాంతంలో శస్త్రచికిత్స నిర్వహించగా మగ శిశువు జన్మించాడు. అప్పుడే పుట్టిన శిశువు కొద్ది సమయానికే మృతిచెందాడు. వైద్యాధికారులు, సిబ్బంది తగు రీతిలో స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం మూలంగానే శిశువు మృతిచెందాడని ఆరోపిస్తూ బాధిత కుటుంబీకులు, బంధువులు ఆందోళనలు చేపట్టారు. శిశువు మృతి చెందిన ఘటనపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు వైద్యాధికారి డా. సురేందర్‌పై సెక్షన్ 304(ఏ)పై కేసు నమోదు చేశారు. కేసు నమోదును నిరసిస్తూ వైద్యాధికారులు సాముహిక సెలవు పెట్టారు. సిబ్బంది కొరత, అరకొర సౌకర్యాలతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్న నేపథ్యంలో కేసు నమోదు కావడం పట్ల వారు అసంతృప్తి వ్యక్తం చేశారు.



భైంసాలో ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబీకులు

మందులు రాస్తున్న డాక్టర్ కలెక్టర్ ప్రీతి మీనా

- ఆస్పత్రి సిబ్బందిపై ఆగ్రహం

గూడూరు : మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ ప్రీతిమీనా శుక్రవారం డాక్టర్ అవతారమెత్తి రోగులను పరీక్షించి మందులను రాసి ఇచ్చారు. గూడూరు ప్రభుత్వ ఆస్పత్రిని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేసిన సమయంలో కేవలం ఒక్కరే వైద్యులు అందుబాటులో ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమయంలో రోగుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో కలెక్టర్ తానే స్వయంగా రోగులను పిలిచి వైద్య పరీక్షలు చేసి మందులను రాసిచ్చారు. విధుల్లో ఉండాలల్సిన డాక్టర్ ఎక్కడని నాలుగు వందల మంది రోగులు వస్తుండగా వైద్యులు అందుబాటులో ఉండకపోతే ఎలా? అని ప్రశ్నించారు.



రోగికి మందులు రాస్తున్న కలెక్టర్

నేరేళ్లపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి: గండ్ర

వరంగల్ సిటీ : సిరిసిల్ల జిల్లా నేరేళ్లలో దళితులు, బడుగు బలహీన వర్గాలపై జరిగిన దాడులపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని మాజీ చీఫ్ విప్ గండ్ర వెంకటరమణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హన్మకొండలో మాట్లాడుతూ సిరిసిల్ల ఎస్పీని సస్పెండ్ చేయాలని రమణారెడ్డి డిమాండ్ చేశారు. టీఆర్ఎస్ డౌన్ ఫాల్ అవుతోందని, కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణ చూసి సీఎం కేసీఆర్ శ్రీరాంసాగర్ పునరుజ్జీవ సభ నిర్వహించారని విమర్శించారు. పోచంపాడు సభను కేసీఆర్ రాజకీయ పునరుజ్జీవం కోసం పెట్టుకున్న సభగా అభివర్ణించారు.

డైరెక్టరేట్ నుంచే లైసెన్స్‌ల జారీ!

- కమీషన్ ఏజెంట్ల నియామకంలో పారదర్శకత

హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా అన్ని మార్కెట్ యార్డుల్లో ఉన్న కమీషన్ ఏజెంట్ల వ్యవస్థను ప్రక్షాళన చేయాలని మార్కెటింగ్‌శాఖ నిర్ణయించింది. ఇక నేరుగా డైరెక్టరేట్ నుంచే కమీషన్ ఏజెంట్లకు లైసెన్స్‌లను జారీ చేసేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం మార్కెట్ కమిటీల ద్వారానే కమీషన్ ఏజెంట్లకు లైసెన్స్‌లు జారీ చేస్తున్నారు. దీనివల్ల స్థానికంగా పెద్దయెత్తున అక్రమాలు చోటు చేసుకుంటున్నా.. వాటిని నివారించడంలో కొందరు మార్కెట్ కమిటీల కార్యదర్శులు విఫలమయ్యారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈనేపథ్యంలోనే ఇక మొత్తం లైసెన్స్‌ల జారీ ప్రక్రియను నేరుగా డైరెక్టరేట్ ద్వారానే జారీ చేస్తే ఎలా ఉంటుందన్న అంశంపై ప్రభుత్వం యోచిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 180 మార్కెట్ యార్డులు ఉన్నాయి. దాదాపు 5వేల మంది కమీషన్ ఏజెంట్లు ఉన్నారు. ఇక ఫ్రూట్ మార్కెట్, గ్రెయిన్ మార్కెట్, కూరగాయల మార్కెట్, పసుపు, మిర్చి ఇలాల రకరకాల ఉత్పత్తులకు సంబంధించిన మార్కెట్‌లను బట్టి కమీషన్ ఏజెంట్లను కూడా కేటగిరీల వారీగా విభజించనున్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

- రామన్ మెగసెసే అవార్డు గ్రహిత శాంతసిన్హా



కొత్తగూడెం: దేశం, రాష్ట్రంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనను పటిష్టంగా అమలు చేయాలని రామన్ మెగసెసే అవార్డు గ్రహీత, ప్రొఫెసర్ శాంతాసిన్హా అభిప్రాయపడ్డారు. చట్టాల్లో ఇంకా మార్పులు రావాలని పేర్కొన్నారు. శుక్రవారం కొత్తగూడెంలోని ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌ను ఆమె సందర్శించారు. అనంతరం విలేకరులతోమాట్లాడుతూ బాలకార్మికులను పాఠశాలలోచేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, అధికారులపై ఉందన్నారు. ప్రభుత్వం పాఠశాలలో ఒక్కొక్క విద్యార్థికి రూ. 40వేలు విద్యాభ్యాసానికి ఖర్చు పెడుతోందన్నారు.. 2012లో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం చట్టాలను తెచ్చినప్పటికీ ఇంకా బడిబయట ఉండి కర్మాగారాల్లో, కూలి పనుల్లోమగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో మార్పులు తీసుకొచ్చేందుకు 2011లో బాల బంధు అనే కార్యక్రమాన్ని బాల కార్మికుల కోసం చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో ప్రభుత్వం గురుకుల పాఠశాలలను ప్రవేశపెట్టిందని, అందులో చదివే విద్యార్థుల కోసం సుమారు ప్రభుత్వం రూ. 12కోట్లు కేటాయించిందన్నారు. ప్రత్యేకంగా విద్యార్థుల కోసం తాను ఎంవీ ఫౌండేషన్‌ను స్థాపించానన్నారు. దీని ద్వారా లింగ వివక్షతను రూపుమాపుతున్నామన్నారు.

హోంగార్డులను పర్మినెంట్ చేయాలి: శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్: రాష్ట్రంలోని హోంగార్డులందరినీ పర్మినెంట్ చేయాలని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం హోం శాఖ కార్యదర్శి రాజీవ్ త్రివేదిని కలిసిన ఆయన, ఈ అంశాన్ని ప్రస్తావించారు. రాష్ట్రంలో మొత్తం 23 వేల మంది హోంగార్డులు పోలీసులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నారని ఆయన తెలిపారు. కాగా, వారిని స్పెషల్ పోలీస్ అసిస్టెంట్‌లుగా గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు హోం శాఖ కార్యదర్శి వెల్లడించారని మీడియాకు తెలిపారు.



అడుగు తప్పితే అంతే!

'ఆంధ్రజ్యోతి'కి స్పందించిన మానవ హక్కుల కమిషన్

- జిల్లా కలెక్టర్, డీఈఓలకు నోటీసులు

గట్టు : ఆంధ్రజ్యోతి ఫొటో వార్తకు మానవ హక్కుల కమిషన్ స్పందించింది. ఈ కథనంపై ఈ నెల 29వ తేదీలోగా సమాధానం ఇవ్వాలని కలెక్టర్ రజత్‌కుమార్‌షైనీ, జిల్లా విద్యాధికారులకు నోటీసులు జారీ చేశారు. జూలై 27న ఆంధ్రజ్యోతి మెయిన్ ఎడిషన్‌లో "అడుగు తప్పితే అంతే" అనే శీర్షికన జోగుళాంబ గద్వాల జిల్లా గట్టులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు తాగునీటి కోసం కోనేరులో దిగి దాహార్తి తీర్చుకుంటున్న సమస్యపై ఫొటో వార్త ప్రచురితమైంది. ఈ కథనాన్ని సుమోటోగా తీసుకున్న మానవ హక్కుల కమిషన్ సరైన వివరణ ఇవ్వాలని నోటీసులు పంపింది.

రాంకీ సంస్థకు అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయండి

- తెలంగాణ రైతు సంఘం డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నల్గొండ జిల్లా చిట్యాల మండలంలోని వెలిమినేడు, గుండ్రాంపల్లి, సుంకనపల్లి గ్రామాల్లోని రైతుల భూములను బినామి పేర్లతో రాంకీ సంస్థ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఘటనపై తగు విచారణ జరిపించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సీసీఎల్ఏ కమిషనర్‌కు వారు శుక్రవారం వినతిపత్రాన్ని సమర్పించారు. అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో రాంకీ సంస్థకు సహకరించిన అధికారులపైనా చర్యలు తీసుకొని వెంటనే ఆ తప్పుడు రిజిస్ట్రేషన్లను రద్దుచేయాలని సంఘం నేతలు బొంతల చంద్రారెడ్డి, టి. సాగర్, బి. వెంకట్, బుర్రి ప్రసాద్ డిమాండ్ చేశారు. బాధిత రైతులకు సత్వరమే న్యాయం చేయాలన్నారు.

భద్రత, అభద్రత

ముప్పవరపు వెంకయ్యానాయుడు ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభ అధ్యక్షుడిగా పదవీబాధ్యతలు స్వీకరించడం అందరి అభినందనల మధ్య సందడిగా జరిగింది. క్రియాశీల రాజకీయాలలో తలమునకలుగా, నిత్యకోలాహలంగా ఉండిన వెంకయ్యకు ముందరికాళ్లకు బంధంగా నూతన పదవి పరిణమిస్తుందేమోనని శ్రేయోభిలాషులు ఆందోళన చెందారు కానీ, చొరవా చురుకుదనమూ ఉన్నవారు ఏ పదవిలో ఉన్నా రాణించగలరని ఆరంభంలోనే ఆయన నిరూపించుకున్నారు. రాజ్యసభలో అధ్యక్ష స్థానం అధిరోహించినవెంటనే, సభ్యుల ఆహ్వానాలను ప్రశంసలను అందుకుంటూనే , వెంకయ్య సభానిర్వహణలో తన ప్రాధాన్యాలను, సభ్యుల నడవడికి సంబంధించి విధినిషేధాలను తనదైన శైలిలో, సరసమైన భాషలో స్పష్టం చేశారు. బలమైన ప్రతిపక్షమున్న పెద్దల సభలో, హద్దుమీరేవారికి నియమాల ఉద్బోధ చేయగలిగిన పెద్దరికమూ, అవసరమైతే కఠినంగా వ్యవహరించగలిగిన నిర్వహణాసామర్థ్యమూ వెంకయ్యానాయుడుకు ఉన్నాయి.

ఉపరాష్ట్రపతి పదవిని ప్రజలలోకి తీసుకువెడతానని వెంకయ్యానాయుడు అన్నారు. అంటే, గంభీరంగా, సదస్సులకు, విదేశపర్యటనలకు మాత్రమే పరిమితమవుతూ అనామకంగా ఉండిపోయే ధోరణి తనది కాదని, ప్రజలల్లో నిత్యం మెలుగుతూ పదవికి కొత్త నిర్వచనం ఇస్తానని ఆయన సూచిస్తున్నారు. గతంలో ఉపరాష్ట్రపతి పదవిలో క్రియాశీలంగా మెలగినవారు లేరని కాదు. తత్వశాస్త్ర వేత్తా, విద్వాంసుడూ అయిన సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రజాజీవితం నుంచి రాకపోయినా, నవ స్వతంత్ర భారతదేశంలో ఉపరాష్ట్రపతిగానూ, తరువాత రాష్ట్రపతిగానూ కీలకమయిన సందర్భాలలో ప్రభావశాలిగా వ్యవహరించారు. పదేళ్లపాటు ఉపరాష్ట్రపతిగా ఉండి, పదవీకాలం ముగించుకున్న హమీద్ అన్సారీ కూడా అనేక పరిమితుల మధ్య క్రియాశీలంగా వ్యవహరించారు. రాధాకృష్ణన్‌కు, అన్సారీకి చాలా పోలికలున్నాయి. ఇద్దరూ విద్యావేత్తలు, మేధావులు. వృత్తిపరంగా దౌత్యవేత్త కాకపోయినా, రాధాకృష్ణన్ అన్సారీ లాగానే కీలకమైన దేశాలలో రాయబారి బాధ్యతలు నిర్వహించారు.

పదవీకాలం ముగియడానికి ఒకరోజు ముందు అన్సారీ రాజ్యసభ టీవీకి ఇంటర్వ్యూ ఇస్తూ చేసిన వ్యాఖ్యలు చర్చనీయమయ్యాయి. ముస్లిములు దేశంలో అభద్రతాభావంలో ఉంటున్నారని కరణ్ థాపర్ వేసిన ప్రశ్నకు జవాబుగా అన్సారీ అన్నారు. ఆయన ఈ మాట అనడం ఇదే మొదటి సారి కాదు. గత మూడేళ్ల కాలంలో అన్సారీ ఇటువంటి వ్యాఖ్యలు ఒకటిరెండు సార్లు చేశారు. ఉపరాష్ట్రపతి అని కూడా పరిగణన ఇవ్వకుండా అధికారపార్టీ నేతలు ఆయనను విమర్శించడం కూడా గతంలో జరిగింది. అన్సారీ పదేళ్ల కాలంలోని చివరి మూడేళ్లు, అంటే, ఎన్‌డిఎ హయాం లో ఆయనకు, ప్రభుత్వానికి మధ్య మంద్రస్థాయి చిటపటలు కొనసాగాయి. సుప్రసిద్ధమైన జాతీయవాద కుటుంబంలో జన్మించిన అన్సారీ, ఆధునిక ప్రగతిశీల భావాలు కలిగిన లౌకికవాది. ఆయన దేశంలోని మతతత్వ ధోరణులను నిరసించినప్పుడు, ఆయననే మతవాదిగా చిత్రించే ప్రయత్నం జరిగింది. కానీ, దేశంలో లౌకికవాదానికి ప్రమాదం ఏర్పడినప్పుడు, అది కాంగ్రెస్ హయాం అయినా సరే, ఆయన స్పష్టంగానే గొంతెత్తారు. జాతీయోద్యమకాలపు ఆదర్శాలను, నెహ్రూ తరహా ఆధునికతనీ ఇష్టపడే అన్సారీ సహజంగానే దేశ, విదేశాంగ వ్యవహారాలలో వస్తున్న మార్పులను హర్షించలేకపోయారు. అది అణ్వస్త్రాల విషయంలో ఇరాన్‌కు వ్యతిరేకంగా భారత్ ఓటువేయడం కావచ్చు, గోరక్షణ పేరుతో వీధుల్లో హత్యలు చేయడం కావచ్చు, ఆయన నిక్కచ్చిగానే ఉన్నారు.

ఉపరాష్ట్రపతి అట్లా వ్యాఖ్యలు చేయవచ్చా అన్న ప్రశ్న సరి అయినది కాదు. దేశహితానికి అవసరమని భావించే అంశం ఏదైనా రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి కూడా మాట్లాడవలసిందే. ప్రధానమంత్రులు నిరంకుశంగా వ్యవహరిస్తున్నప్పుడు రాష్ట్రపతిభవనం నుంచి ఏదైనా స్పందన ఉంటే బాగుండని దేశప్రజలు ఎదురుచూసిన సందర్భాలు గతంలో ఎన్ని లేవు? అన్సారీ వ్యాఖ్య పొరపాటు అయితే, దానికి బదులుగా వెంకయ్య స్పందన కూడా పొరపాటే అవుతుంది. అన్సారీ అభద్రత వ్యాఖ్య పాలనాయంత్రాంగానికి ఒక హెచ్చరిక అయితే, వెంకయ్య స్పందన భారతీయ సమాజం మౌలిక ఘనతను చాటి చెప్పేది. ఇద్దరూ అసహనాన్ని కూడదంటున్న వారే. అన్సారీ వ్యాఖ్యలు ఎట్లున్నా, కేంద్రప్రభుత్వం వెంకయ్య స్పందనను సీరియస్‌గా తీసుకుని, భారతీయ విలువ అయిన సామరస్యాన్ని నిలబెట్టే ప్రయత్నం చేయాలి.

అన్సారీకి వీడ్కోలు చెబుతూ ప్రధానమంత్రి చేసిన వ్యాఖ్యలు నర్మగర్భంగా ఉన్నాయని పత్రికలు రకరకాల కథనాలు రాశాయి. ప్రధాని స్థాయి వ్యక్తి, ఈ మీడియా అంటున్నట్టు, అంత తక్కువగా ప్రవర్తిస్తారా? సందేహమే. మేధావిగా, జాతీయవాదిగా అన్సారీ ఇక ముందు కూడా తన గొంతు విప్పుతూ ఉండాలని, ఎనిమిది పదుల వయస్సులో ఆయన ఇవ్వగలిగే సూచనలు విలువైనవని నరేంద్రమోదీ భావించి ఉంటారు. మోదీ ఆశించినట్టు, అన్సారీ స్వేచ్ఛగా భావప్రకటన చేయాలి.

ప్రథమ ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ సుప్రసిద్ధ సూక్తి– సహనమే సంస్కృతి. భారతీయ సంస్కృతి గొప్పదనాన్ని సూచించే విలువ సహనమే అని ఆయన అన్నారు. దేశాధినేతలు, ఉపనేతలు, ప్రభుత్వాధినేతలు ఆ ఉద్బోధను గౌరవించడమే కాదు, సువ్యవస్థితం చేస్తారని జాతి ఆశిస్తున్నది.

భయపెడుతున్న లాకప్ మరణాలు

'నేరం చేస్తే శిక్షించాలి కాని ఈ చంపుడేంది? ఇంత విషమిస్తే మేమూ తాగి చస్తాం' అని కడమంచి వెంకటేశ్ భార్య రేణుక గోడు వెళ్ళగక్కుతున్నది. 'నేను విధవనయ్యాను, నా పిల్లలు అనాధలయ్యారు' అంటూ ఆమె భోరుమంటున్నది. దేశంలో ఘనత వహించిన తెలంగాణ పోలీసుల ప్రతాపమంతా పేదోళ్ళు, మహిళలు, దళితులు, మైనార్టీలు గిరిజనులపైనే. కలిగినోళ్ళకు, గొప్పోళ్ళకు, పెత్తందార్లకు, అగ్రకులపోళ్ళకు పాదాక్రాంతమవుతారు.

బుడగ జంగాల కులానికి చెందిన కడమంచి వెంకటేష్ (25) కుటుంబం సిరిసిల్ల జిల్లా వేముల వాడలోని సాయినగర్‌లో ఓ ఖాళీ స్థలంలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్నది. గ్రామాలన్ని తిరుగుతూ మంచాలకు నులక అల్లడం అతడి జీవనాధారం. బండలింగంపల్లి సర్పంచ్ ఫిర్యాదు ఆధారంగా జులై 13న అతడిని అరెస్టు చేసినట్లు, అదే రోజు రిమాండుకు తరలించినట్లు ఎల్లారెడ్డి పేట పోలీసులు చెబుతున్నారు. అతడు చేసిన నేరం దొంగతనమట. తెలంగాణ పోలీసుల చరిత్రలో ఎన్నడు కూడా 24 గంటల్లోపు ఏ ముద్దాయిని కోర్టులో హాజరుపర్చిన దాఖలాలు లేవు. రేణుక మాత్రం తన భర్త జులై 3 నుంచి యింటికి రావడం లేదని అంటున్నది. వెంకటేశ్ రాకపోవడంతో అతడి కుటుంబం తిండికి కరువై ఆకలితో అలమటించారు. పోలీసులకు ఈ పట్టింపులేవీ ఉండవు, వాళ్ళు దేశానికి కోట్ల నష్టం కలిగించే వ్యక్తిని పట్టుకున్నారు కదా!



వెంకటేశ్‌ను ఎల్లారెడ్డిపేట పోలీసులు పట్టుకున్న విషయం ఎవరో చెప్పగా విన్న రేణుక స్టేషన్‌కు వెళ్ళి తన భర్త గురించి అడిగింది. పోలీసులు మేం అరెస్టు చేయలేదన్నారు, పైగా నీకెవరు చెప్పారు అని గదమాయించారు. మళ్ళీ మూడు రోజుల తర్వాత స్టేషన్‌కు వెళ్ళి బ్రతిమాలింది, కాళ్ళు మొక్కుతానన్నది. పోలీసులు మాత్రం మేం పట్టుకురాలేదని మళ్ళీ బుకాయించారు. ఓ మూల తన భర్త చెప్పులను గమనించి, నా భర్త లోపటనే వున్నాడని గట్టిగా ఏడ్చింది. చంకలో కొడుకు, చేతిలో బిడ్డ, ఆడపడుచు, అత్తమామ, అందరూ గొల్లున ఏడుపులంఘించారు. పోలీసులకు కోపం వచ్చి అందరినీ రోడ్డు మీదికి తరిమారు. కరీంనగర్ జైలులో చూసుకోపోండని అన్నారు. అరెస్టు చేయలేదన్న వాళ్ళు జైలుకు వెళ్ళమని ఎట్లా చెప్పగలరని రేణుక ప్రశ్నిస్తోంది. వెంకటేష్‌ను జైల్లో చూసిన రేణుక షాక్ తిన్నది. మనిషి మనిషిగా లేడు. బ్రతికున్న శవంలా వున్నాడు. పోలీసులు ఎన్ని హింసలు పెట్టింది వివరించాడు. రెండు బైకులు, బంగారం దొంగిలించానని ఒప్పుకోమన్నారు. చెయ్యని నేరాన్ని ఒప్పుకోనన్నాడు. దాంతో రబ్బరు లాఠీలతో, పిండిగిర్ని బెల్టుతో కొట్టారు. తలకిందులుగా వేలాడ దీశారు. అక్కడి నుండి సిరిసిల్ల సిసిఎస్‌కు తీసుకెళ్ళారట. అక్కడి పోలీసులు వెంకటేష్‌పై థర్డ్ డిగ్రీని ప్రయోగించారు. మర్మావయవాలకు, చెవులకు కరెంటు షాకులిచ్చారు. చేతుల గోళ్ళు పీకేశారు. రోకలి బండలు ఎక్కించి కొడితే కాలి మడమలు కందిపోయాయి. బీరుబాటిల్స్ ఆసనంలో పెట్టి నొక్కితే విపరీతమైన రక్తస్రావం అయింది. అన్నం తిన్న వెంటనే కక్కుతున్నాడు. ఇక చస్తాడని నిర్ధారణకు వచ్చిన పోలీసులు జులై 26న కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. రేణుక ఆసుపత్రి చేరుకుంది. తానిక బతకనని అతడు భార్యకు చెప్పాడు. ఎదలో భరించలేని నొప్పి వస్తున్నదన్నాడు. ఆసనంలోనుంచి రక్తం కారడంతో ప్యాంటు అంతా తడిచి పోయింది. పోలీసులు ఆ ప్యాంటును మాయం చేశారు. చివరికి ఆగస్టు 3న రేణుక భర్త వెంకటేశ్ చనిపోయాడు. శవాన్ని తెచ్చుకోవడానికి కూడా వారి వద్ద డబ్బులు లేవు. మీరు తీసుకెళ్ళకపోతే మున్సిపాలిటికి అప్పజెప్తామనడంతో, ఏదో చేసి చివరికి అంబులెన్స్‌లో శవాన్ని తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించింది రేణుక. ప్రజల ప్రాణాలు రక్షించాల్సిన పోలీసులు భక్షిస్తున్నారు. రాజ్యాంగ ఉల్లంఘన యధేచ్ఛగా జరుగుతున్నది. ఆర్టికల్ 21 అపహాస్యం చేయబడుతుంది. సిరిసిల్ల పోలీసు ఉన్నతాధికారి పేదలపై విశ్వరూపం ప్రదర్శిస్తున్నాడు. నేరెళ్ళ బాధితుల సమక్షంలోనే వెంకటేశ్‌ను చిత్రహింసలకు గురి చేశారు.

ప్రతి సంఘటనలోనూ పోలీసులు తమ బాధ్యత నుండి తప్పించుకోవడానికి, ప్రజాగ్రహానికి గురి కాకుండా వుండడానికి తెలివిగా కొనవూపిరితో వున్న నిందితుడిని స్టేషన్ బయటికి పంపివేస్తున్నారు. ప్రజల ప్రతిఘటన ఒక్కటే లాకప్ మరణాలను నివారించగలదు!

గత ఏప్రిల్‌లో బేగంపేట పోలీసులు రాము అలియాస్ మోహనకృష్ణ (23) కుటుంబ తగాదాల విషయంలో పట్టుకొని పోయి చనిపోయేంత వరకు కొట్టారు. చనిపోతాడని నిర్ధారించుకున్న తర్వాత కుటుంబీకులను పిలిచి ఆటోలో యింటికి పంపించారు. రాము మరుసటి రోజు చనిపోయాడు. భార్య లావణ్య, చంటి పాప అనాధలయ్యారు. ఆటో డ్రైవర్ రాము తన భార్య లావణ్య అనారోగ్యంతో వుండడంతో మరుదల్ని పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. భార్య తరపు కుటుంబీకులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రామును పట్టుకుపోయి చిత్రహింసలకు గురి చేయడంతో చనిపోయాడు. ఇటువంటి ప్రతి ఘటనలోనూ పోలీసులు తమ బాధ్యత నుండి తప్పించుకోవడానికి తెలివిగా కొనవూపిరితో వున్న నిందితుడిని బయటికి పంపి చేతులు దులిపేసుకుంటున్నారు. లాకప్ మరణాలకు ప్రజల తిరుగుబాటు మాత్రమే బుద్ధి చెప్పగలదు. సిఆర్‌పిసి సెక్షన్ 176(1ఎ) ప్రకారం పోలీసు కస్టడి ద్వారా జరిగిన మరణాలపైన తప్పనిసరిగా జ్యూడిషియల్ విచారణ జరిపించాలి. అనాధలైన పిల్లల్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలి. బాధ్యులైన పోలీసులను హత్యా నేరం కింద శిక్షించాలి.

■ లక్ష్మణ్ గడ్డం

అధ్యక్షులు, పౌర హక్కుల సంఘం

చీకట్ల నుంచి వెలుగులోకి...

పదిహేనవ శతాబ్దపు చివరలో భారతావనిలో పాదం మోపిన పోర్చుగీసుల వాణిజ్య సామ్రాజ్య వాద వ్యూహాత్మక ఆధిపత్యానికి పదహారవ శతాబ్దం ఆరంభంలోనే డచ్ వారు, ఆంగ్లేయుల నుంచి పలు సవాళ్లు ఎదురయ్యాయి. అచిర కాలంలోనే ఆంగ్లేయుల సారథ్యంలోని ఈస్ట్ ఇండియా కంపెనీ, పోర్చుగీస్ కంపెనీలపై విజయం సాధించింది. గోవా హద్దులను దాటి విస్తరించ లేకపోయిన పోర్చుగీసులు తమ వాణిజ్య అవసరాలకు మరింత లాభదాయకమైన దేశాల వేటలో పడాల్సి వచ్చింది. ఇండొనేషియా మీదుగా మనదేశంలో అడుగుపెట్టిన డచ్ ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రధానోద్దేశం మసాలా దినుసుల వ్యాపారమే తప్ప రాజకీయసైనిక ఆధిపత్యం కాదు. డచ్ కంపెనీ కార్యకలాపాలు ప్రారంభమైన రోజుల్లోనే, బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ కూడా లాభదాయకమైన మసాలా దినుసుల వ్యాపారానికి మన దేశంలో అడుగుపెట్టింది. 1600 సంవత్సరంలో, రాయల్ చార్టర్ ద్వారా బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ స్థాపన జరిగింది. మన దేశంలో ఆంగ్లేయుల పాలనకు అలా అంకురార్పణ జరిగింది. డచ్, బ్రిటీష్ కంపెనీలతో పాటు అడుగుపెట్టిన ఫ్రెంచ్ కంపెనీ అంత పురోగతి సాధించ లేకపోయింది.

మొగల్ చక్రవర్తి జహంగీర్‌తో బ్రిటీష్ ప్రభుత్వ ప్రతినిధులు సత్సంబంధాలు పెంపొందించుకోసాగారు. దరిమిలా సూరత్ లోనూ ఈస్ట్ ఇండియా కంపెనీ వెలసింది. పదహారవ శతాబ్దపు తొలి నాళ్లలో మొదలైన బ్రిటీష్ వారి వాణిజ్యం అచిర కాలంలోనే అంచెలంచెలుగా ఎదగసాగింది. బాంబే నగరం ఈస్ట్ ఇండియా కంపెనీకి దక్కడంతో, పదిహేడవ శతాబ్ది ఆరంభానికల్లా, కనీసం వాణిజ్యపరంగానైనా పటిష్ఠమైన స్థితికి చేరుకున్నారు ఆంగ్లేయులు. ఔరంగజేబు అనంతరం మొగలాయి సామ్రాజ్య వైభవం క్షీణించడంతో భారతావనిలో చోటుచేసుకున్న అనిశ్చిత స్థితి బ్రిటీష్ వారికి కలిసొచ్చింది. నాదిర్ షా లాంటి వారి దండయాత్రలు మొదలయ్యాయి. కష్టాల కడలిలో ఉన్న భారతదేశంలో బ్రిటిష్ ఆధిపత్యానికి మార్గం సుగమం అయింది. ఆంగ్లేయులకు, ఫ్రెంచ్ వారికి మధ్య సుదీర్ఘంగా జరిగిన పోరాటంలో విజయం సాధించిన బ్రిటన్ భారత దేశంలో అధికారానికి చేరువై, సిపాయిల తిరుగుబాటు నాటికి పట్టు సాధించింది.

1857 నాటి సిపాయిల తిరుగుబాటులో చిట్టచివరి మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జఫర్, తాంతియా తోపే, రాణి ఝాన్సీ లక్ష్మి బాయి లాంటి వారు పాల్గొన్నారు. బ్రిటన్ లోని పార్లమెంటరీ ప్రభుత్వం, అప్పటివరకున్న ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన స్థానంలో, నేరుగా పాలన సాగించాలని నిర్ణయం జరిగింది. వాస్తవానికి, సిపాయిల తిరుగుబాటు పూర్వ రంగంలోనే, ఒక మోస్తరు సాంస్కృతిక విప్లవం, భారతావనిలో వేళ్లూనుకోవడమే కాకుండా, రాజకీయ చైతన్యానికి కూడా బీజాలు పడ్డాయి. 1885లో లార్డ్ డఫరిన్ ఆశీస్సులతో భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావం జరిగింది. ఆదిలోని కాంగ్రెస్ మితవాద భావాల అధినాయకత్వం ఒక వైపు బ్రిటీష్ ప్రభుత్వానికి మద్దతు పలుకుతూనే, మరొక వైపు, పరోక్షంగా ప్రభుత్వ వ్యతిరేకతకు పునాదులు వేయసాగింది. బెంగాల్ విభజన నిర్ణయం, దేశ వ్యాప్త ఆందోళనకు దారితీసింది. స్వదేశీ ఉద్యమం, విదేశీ వస్తువుల బహిష్కరణ నినాదం ఊపందుకుంది. ఉద్యమకారులపై ప్రభుత్వ దమన కాండ తీవ్రతరమైంది. పంజాబ్ నుంచి లాలా లజపతి రాయ్, సర్దార్ అజిత్ సింగ్ ల బహిష్కరణ, బాల గంగాధర తిలక్, అరబిందో ఘోష్ ల నిర్బంధం, బెంగాల్ విభజన వ్యతిరేక ఆందోళన, భారత జాతీయోద్యమానికి పునాదులు బలంగా నాటాయి. .

ప్రథమ ప్రపంచ సంగ్రామంలో బ్రిటన్ కూరుకుపోయిన సమయంలోనే, స్వదేశీ ఉద్యమం బలపడ సాగింది. పూనా కేంద్ర కార్యాలయంగా, హోం రూల్ లీగ్ స్థాపించిన తిలక్ దేశ వ్యాప్తంగా పర్యటించి, దేశ ప్రజలందరూ ఐకమత్యంగా ఉద్యమించాలని చేసిన విజ్ఞప్తికి అనీబీసెంటు సహకారం లభించింది. హోం రూల్ ఉద్యమ లక్ష్యం పూర్ణ స్వరాజ్యమనేది స్పష్టమైపోయింది ఆంగ్లేయ పాలకులకు. ఇంతలో, మహాత్మా గాంధీ నాయకత్వంలో స్వాతంత్ర్యోద్యమం బలపడ సాగింది. ఆయన 'అహింస' నినాదంతో దూసుకుని పోయారు. దక్షిణాఫ్రికాలో ఆపాటికే బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమించిన మోహన్ దాస్ కరంచంద్ గాంధీ, బాంబేలో కాలుపెట్టిన వెనువెంటనే, జాతీయోద్యమానికి నాయకత్వం వహించమన్న నినాదం మొదలైంది. గాంధీ నిర్ణయం తీసుకునే లోపుగానే, రౌలట్ చట్టం తీసుకొని వచ్చిన బ్రిటీష్ ప్రభుత్వం, విచారణ జరపకుండా, రాజకీయ ఖైదీలను శిక్షించి, జైలుకు పంపించే అధికారాన్ని ప్రొవిన్షియల్ ప్రభుత్వాలకిచ్చింది. విశ్వసనీయతను కోల్పోయిన ఆంగ్లేయ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, 'ఆత్మ గౌరవం నినాదంతో. సత్యాగ్రహ ఉద్యమానికి మహాత్మా గాంధీ పిలుపిచ్చారు.

పంజాబ్ లోని జలియన్ వాలాబాగ్‌లో, ఏకైక ఇరుకైన ద్వారమున్న ఒక ప్రదేశంలో శాంతియుతంగా సమావేశమైన అమాయక ప్రజలపై జనరల్



1947 ఆగస్టు 14–15 నడిరేయి జవహర్లాల్ నెహ్రూ 'ట్రిస్ట్ విత్ డెస్టినీ' ఉపన్యాసం వినకుండా నిద్రించిన మహాత్మా గాంధీ తెల్లవారుజామున నిద్రలేచి మార్నింగ్‌వాక్‌కు బయలుదేరగానే అశేష జన వాహిని ఆయనను అనుసరించారట. నడక ముగించుకుని బసకు తిరిగి వచ్చిన వెంటనే పశ్చిమ బెంగాల్ ప్రభుత్వపు నూతన మంత్రివర్గం మహాత్ముని ఆశీస్సులకొరకు రాగా 'ముళ్ల కిరీటాన్ని' ధరించమని ఆయన వారితో అన్నారట!

డయ్యర్ దారుణమారణ కాండ జరిపించాడు. ఈ ఘటనలో వేలాది దేశభక్తులు మరణించారు. దేశ వ్యాప్తంగా విషాదం చోటు చేసుకున్న ఆ సంఘటన దరిమిలా మహాత్మా గాంధీ సహాయ నిరాకరణ ఉద్యమం ప్రారంభించారు. ఆబాల గోపాలం మద్దతు లభించిందా ఉద్యమానికి. లక్షలాది ప్రజలు, తారతమ్యాలు మరిచి, ఒక్క మాట మీద నిలబడి ఉద్యమానికి మద్దతుగా నిలిచారు. దురదృష్ట వశాత్తు చౌరీచౌరా సంఘటనలో పాతిక మంది పోలీసులు ప్రజాగ్రహానికి గురై చంప బడడంతో, గాంధీ ఉద్యమాన్ని నిలుపుదల చేశారు. ఆ నిర్ణయం వల్ల గాంధీని కొందరు విమర్శించినప్పటికీ, కాంగ్రెస్ పార్టీలో ఆయన తిరుగులేని నాయకత్వం కొనసాగింది. జవహర్లాల్ నెహ్రూ పూర్ణ స్వరాజ్ నినాదంతో త్రివర్ణ పతాకాన్ని రావి నది ఒడ్డున ఎగురవేయడం, శాసనోల్లంఘన ఉద్యమాన్ని గాంధీ మొదలెట్టేందుకు సంపూర్ణ మద్దతును భారత జాతీయ కాంగ్రెస్ ప్రకటించడం, స్వతంత్రం పొందే దిశగా కదిలేందుకు దోహదపడింది.

గాంధీజీ పిలుపు మేరకు ఆరంభం కానున్న శాసనోల్లంఘన ఉద్యమం రూపురేఖలెలా వుండబోతున్నాయో తెలుసుకోవాలన్న ఆసక్తి కేవలం భారతీయులలోనే కాకుండా, బ్రిటీష్ ప్రభుత్వంలోనూ కలిగింది. అనుకున్న రోజునే, సబర్మతీ ఆశ్రమం నుంచి, ఉప్పు సత్యాగ్రహం కొరకు 'దండి' యాత్ర గాంధీ సారథ్యంలో మొదలైంది. దాన్నంత పెద్దగా పట్టించుకోవద్దునుకున్న బ్రిటీష్ ప్రభుత్వానికి ఉద్యమం ఉధృతం అవగాహనైంది. అరెస్టుల పర్వం మొదలైంది. 'బ్రిటీష్ ప్రభుత్వం ఉద్యమాన్ని అదుపుచేసేందుకు ఆయుధాలను ఉపయోగించినప్పటికీ, అదరకుండాబెదరకుండా, ఎదురుతిరగకుండా, వెనుకంజ వేయకుండా, భారతీయులు ముందుకు సాగడంతో, ఆంగ్లేయులు శక్తిలేని వారైపోవడంభారతీయులు అజేయులు కావడం జరిగింది' అని శాసనోల్లంఘనం గురించి లూయి ఫిషర్ వర్ణించారు. లండన్ లో జరిగిన మొదటి రౌండ్ టేబుల్ సమావేశానికి కాంగ్రెస్ ప్రతినిధులెవరు హాజరు కాకపోవడంతో, నాటి గవర్నర్ జనరల్ లార్డ్ ఇర్విన్ గాంధీజీని విడుదల చేస్తున్నట్లు ప్రకటించాడు. ఇరువురి మధ్య సమావేశం జరిగింది. గాంధీ–ఇర్విన్ ఒప్పందం దరిమిలా రెండో రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరయ్యారు గాంధీ. నిరాశతో స్వదేశానికి రావడం మినహా ఒరిగిందేమీ లేదు.

గాంధీజీ నాయకత్వంపై భారత జాతీయ కాంగ్రెస్, ప్రజలు, యావత్ భారతావని, అపారమైన నమ్మకం పెట్టుకున్నారు. ఆయన పిలుపు మేరకు క్విట్ ఇండియా ఉద్యమానికి, విజయమోవీర స్వర్గమో తేల్చుకోవడానికి సిద్ధమయ్యారు. నాటినుంచి కౌంట్ డౌన్ మొదలైంది. స్వాతంత్ర్యం సిద్ధించే సూచనలు కనపడ సాగాయి. 1946 లో లార్డ్ మౌంట్ బేటన్ ఢిల్లీకి రావడంతో రాజకీయ ప్రాధాన్యత పెరిగింది. ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో నేర్చుకున్న పాఠాలతో భారత దేశాన్ని వదిలిపెట్టి పోవాలన్న నిర్ణయానికొచ్చింది బ్రిటీష్ ప్రభుత్వం. హఠాత్తుగా వదిలిపెట్టకుండా, అధికార మార్పిడికి కావాల్సిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యతను మౌంట్ బాటన్‌కు అప్పచెప్పిన బ్రిటీష్ ప్రభుత్వం, భవిష్యత్‌లో భారత దేశంతో సత్సంబంధాలు కొనసాగేట్లు చూడమని సూచించింది. విభజన తప్పని పరిస్థితి అప్పటికే చోటు చేసుకుంది.


అశేష ప్రజానీకం ఎదురు చూసిన రోజు ఆనందవిషాదాల మధ్య రానే వచ్చింది. 1947 ఆగస్టు పదిహేను అర్థ రాత్రి ఆంగ్లేయుల పాలన నుంచి విముక్తి కలిగింది భారత దేశానికి. మరో రెండు రోజులకు పాకిస్తాన్ మరో స్వతంత్ర దేశంగా ఏర్పాటవడంతో భారతావని రెండుగా చీలిపోయింది. చీలిక కోరుకున్న వారిలోను, కోరుకోని వారిలోను, ఎందరో తమకిష్టం వున్నాలేకపోయినా, తరతరాలుగా తాముంటున్న ప్రదేశాలను వదిలి, సుదూరంగా వెళ్లాల్సిన పరిస్థితులొచ్చాయి. జాతి పిత మహాత్మా గాంధీ మాత్రం, కలకత్తాలో తాను కోరుకున్న స్వతంత్రం సిద్ధించినా, కోరుకున్న రీతిలో సిద్ధించనందుకు సంబరాలకు దూరంగా, శాంతిని కాంక్షిస్తూ గడిపారు. ఢిల్లీలో వుండమని ఆయనకు చేసిన విజ్ఞప్తికి స్పందించలేదాయన. సంబరాలు జరుపుకునేందుకు ఏం మిగిలింది? దేశ విభజన తప్ప అన్నారాయన. ఆగస్టు పదిహేను అర్థ రాత్రి జవహర్లాల్ నెహ్రూ 'ట్రిస్ట్ విత్ డెస్టినీ' ఉపన్యాసం వినకుండా నిద్రించిన మహాత్మా గాంధీ తెల్లవారుజామున నిద్రలేచి, ఆయన తాను బస చేసిన 'హైదరీ హౌజ్' నుంచి మార్నింగ్ వాక్ కు బయలు దేరగానే మహాత్ముడిని ఒక్క సారన్నా చూద్దామని అశేష జన వాహిని ఆయనను అనుసరించారట. నడక ముగించుకుని తిరిగి రాగానే, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వపు నూతన మంత్రివర్గం ఆయన ఆశీస్సులకొరకు వచ్చారట. 'ముళ్ల కిరీటాన్ని' ధరించమని మహాత్ముడు వారితో అన్నారట! అహింసకు కట్టుబడమని, అసత్యం పలకొద్దని, వినయ విధేయతలతో మెలగమని, సహన శీలంతో మసలుకోవాలని, అధికారం అంటే అప్రమత్తంగా వుండాలని, భారతదేశంలోని గ్రామాల్లో నివసిస్తున్న పేద గ్రామీణులకు సేవచేసేందుకే అధికారమని వారికి బోధించారట మహాత్ముడు. ఆయన బోధనలను కొన్నైనా గుర్తుంచుకున్నప్పుడే, స్వతంత్ర భారతదేశంలో వుండే అర్హత మనకుందనుకోవాలి. ఆగస్టు పదిహేనున ఇదే మనం ఆయనకిచ్చే నిజమైన నివాళి.

■ వనం జ్వాలా నరసింహారావు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన మెయిల్:
editpage@andhrajyothy.com

గ్రంథాలయశాస్త్ర శకపురుషుడు

గణిత శాస్త్ర అధ్యాపకునిగా, గ్రంథాలయ అధికారిగా, గ్రంథాలయ శాస్త్ర అధ్యాపకునిగా, రచయితగా, గ్రంథ సంపాదకునిగా, గ్రంథాలయ ఉద్యమ నాయకునిగా, వివిధ ఇన్ఫర్మేషన్ సెంటర్స్ స్థాపకుడుగా గ్రంథాలయాల అభివృద్ధికి, పౌర గ్రంథాలయాల అభివృద్ధికి నిరంతరం సేవలు అందించిన చిరస్మరణీయుడు సియాలి రామమృత రంగనాథన్. మన దేశంలో గ్రంథాలయ శాస్త్ర అభివృద్ధికి, గ్రంథాలయాల అభివృద్ధికి విశేష కృషిచేసిన అసాధారణవ్యక్తి ఆయన.



ఎస్. ఆర్. రంగనాథన్

ఇంగ్లాండ్ పర్యటనలో 'సెల్ఫ్ రిడ్జస్ స్టోర్'లో బొమ్మలు తయారు చేసే మెకానో సెట్ ను చూసి దాని ప్రేరణ తో రంగనాథన్ 'ద్విబిందు వర్గీకరణ సిద్ధాంత (Colon Classification) పథకాన్ని రూపొందించారు. వ్యక్తిత్వం, పదార్థం, శక్తి, స్థలం, కాలం (PMEST) అనే ఐదు అంశాల ఆధారంగా ఆయన 'ద్విబిందు వర్గీకరణ సిద్ధాంతం'ను ఆయన రూపొందించారు. గ్రంథాలయ శాస్త్రానికి భారతదేశపు మహోన్నత సేవగా ఈ 'ద్విబిందు వర్గీకరణ సిద్ధాంతం' పేరుగాంచింది. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలలో పర్యటించి ఆయా దేశాలలోని గ్రంథాలయ శాస్త్ర పద్ధతులను రంగనాథన్ క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ఆ అధ్యయనాల ఫలితంగా రంగనాథన్ నూతన పద్ధతులను ఆవిష్కరించి గ్రంథాలయ శాస్త్రంలో నూతన శకానికి నాంది పలికారు. గ్రంథాలయ శాస్త్ర పురోగతికి దిక్సూచి గా నిలిచారు.

గ్రంథాలయ శాస్త్రంలో ఐదు సూత్రాలు, కోలన్ క్లాసిఫికేషన్, క్లాసిఫైడ్ కాటలాగ్ కోడ్, ఆచూకీ సేవలు (రెఫెరెన్సు సర్వీస్), లైబ్రరీ నిర్వహణ సూత్రాలు మొదలైన అంశాలపై ఆయన సాధికార గ్రంథాలు రచించారు. పుస్తకాలు చదువరులకు అందుబాటులో ఉండే ఓపెన్ షెల్ఫ్ వ్యవస్థను భారతదేశంలో మొట్టమొదటి సారిగా ప్రవేశపెట్టారు. అదేవిధంగా మద్రాసు విశ్వవిద్యాలయంలో మొట్టమెదటి సారిగా రెఫెరెన్సు గ్రంథాలయాన్ని ఆయన ఏర్పాటు చేశారు. 1931 లో గ్రంథాలయశాస్త్రానికి సంబంధించి రంగనాథన్ ప్రవేశ పెట్టిన ఐదు సూత్రాలు గ్రంథాలయ స్థితిగతులను మార్చివేశాయి. అవి: 1. పుస్తకాలు ఉపయోగం కోసం/అధ్యయనం కోసం పుస్తకాలు; 2. ప్రతి పాఠకుడుకి తన పుస్తకం; 3. ప్రతి పుస్తకానికి ఒక చదువరి; 4. చదువరి సమయం కాపాడటం (ఆదా చేయడం); 5.గ్రంథాలయం ఒక సజీవ వ్యవస్థ (నిత్యం అభివృద్ధి చెందుతున్న వ్యవస్థ). గ్రంథాలయశాస్త్రం, గ్రంథాలయాల అభివృద్ధికి మహోన్నత సేవలు అందించిన రంగనాథన్ జన్మదినం ఆగష్టు 12 వ తేదీని 'జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం'గా దేశ వ్యాప్తంగా జరుపుకుంటున్నారు.

– డాక్టర్ రవికుమార్ చేగొని

ప్రధాన కార్యదర్శి, తెలంగాణ గ్రంథాలయ సంఘం

నింగి వానగట్టు ఉరకలేసినట్టు

తెలంగాణ వస్తే ఏమొస్తది అన్న పరాయి పాలకుల గొంతుతో శ్రుతి కలిపిన తెలంగాణ ఇంటి దొంగల వెటకారం మాటలకు దక్కన్ కరువు సీమగా పేరొందిన జనగాం గడ్డలో నిండు ఎండాకాలం నిండుకుండలై అలుగులు దుంకిన చెరువులే సమాధానం ఇచ్చాయి. ప్రపంచానికే తలమానికమైన తెలంగాణ గొలుసుకట్టు చెరువులు అరవై ఏళ్ల పరాయి పాలకుల ఏలుబడిలో నిరాదరణకు గురయ్యాయి. ఫలితంగా గంగాళం లాంటి చెరువులు తాంబాళాలుగా మారాయి. అనేక ఏళ్లుగా నిర్వహణకు నోచుకోక చీమల పుట్టలతో చిన్నపాటి వర్షానికే కట్టలకు గండ్లు, రైతులకు కడగండ్లు మిగిలాయి. దీంతో తెలంగాణ ప్రజల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాలు చిన్నాభిన్నమై కరువు కరాళనృత్యం చేసింది. ధాన్యం ఆరబోసుకునే పచ్చని కల్లాపి వాకిళ్లు పొక్కిలైనాయి. అన్నమో రామచంద్రా అంటూ ఉన్న ఊరును, కన్నవారిని వదిలి ప్రజలు పట్నాలు, పరదేశాలకు వలసపోయిన గతం ఇంకా పీడకల గానే కళ్లముందు కదలాడుతున్నది.

దక్కన్ పీఠభూమిలో భాగమైన తెలంగాణలో మూడువేల ఏళ్లక్రితమే హోయసలులు, రాష్ట్రకూటులు, కాకతీయులు అద్భుతమైన గొలుసుకట్టు చెరువులు నిర్మించారు. భూభౌతిక శాస్త్రం, భూరసాయన శాస్త్రం ఈ రెండింటినీ ఔపోసన పట్టిన పాలకులు చెరువులు నిర్మించిన తీరు నేటికీ అద్భుతమే. 'భూమి కంటే పెద్దది భుక్కపట్నం చెరువు, ధరణి కంటే పెద్దది ధర్మవరం చెరువు' అని ప్రజలు పాటలు పాడుకుంటూ లక్షల ఎకరాల్లో రాజనాలు పండించారు.



రాష్ట్రం బరువును కెసిఆర్ మోస్తే, పెద్ద నీరడి హరీశ్‌రావు ఆలనా పాలనలో ఊరు బరువును మోసే ఏకైక ఆదరువు నేనున్నానంటూ రైతు కంటనీరు కడుగుతుంది చెరువు. చెరువు నిండాలంటే మొగులు దిక్కు చూసేది లేదు, హరీశ్‌రావు దిక్కు చూస్తే సరిపోతుంది అని తెలంగాణ రైతు ఆత్మవిశ్వాసంగా చెప్పగలుగుతుండటమే ఆయన పనితీరుకు నిదర్శనం.

నదుల ప్రవాహం అధారం చేసుకొని, వరద నీటికి కాలం అడ్డం పెడితే కాలువలు పారే నిర్మాణ శైలి నాటి ప్రకృతి ఇంజనీరింగ్ మేధోసంపత్తికి నిదర్శనం. చుక్క నీరు వృథా కాకుండా పడ్డ చినుకు పడ్డట్టే చెరువల్లోకి చేరి పెద్ద చెరువు నిండిన తర్వాత చిన్న చెరువు ఆ తర్వాత కుంటలు అక్కడి నుంచి మడుగులు నిండే విధంగా పక్కా ప్రణాళికతో ప్రతి చుక్కా ఒడిసి పట్టుకున్నారు.

ఒడ్డెరలు, లంబాడీలు, ఉప్పరలు తెలంగాణ చెరువుల నిర్మాణంలో ప్రధాన భూమిక పోషించారు. రాళ్ల గురించి సంపూర్ణ అవగాహన కలిగిన ఒడ్డెరలు ఓఢ్రదేశం (ఒడిషా) నుంచి వచ్చి తెలంగాణ కట్టకు రాళ్లెత్తారు. రూపాయి రూపాయి కూడబెట్టి వందరూపాయలు చేసే మార్వాడీల తీరుగా, రాజస్థాన్ నుంచి వచ్చిన లంబాడీలు చినుకూ చినుకూ చేరి చెరువును నింపే విధంగా ఫీడర్ కాలువులు తొవ్వారు. సముద్రం ఒడ్డున మడులు కట్టి ఉప్పు పండించే ఉప్పరలు భూసారం గురించి సంపూర్ణ అవగాహన కలిగి చెరువు నిర్మాణానికి అనుకూలమైన భూమిని ఎంచుకోవడంలో సహాయపడ్డారు. చెరువులోకి వరదతో పాటు కొట్టుకొచ్చిన నల్ల రేగడి మట్టి బంక వలె అట్టకట్టి నీరు భూమిలోకి ఇంకకుండా నిల్వ ఉంచుతుందన్న ప్రకృతి ధర్మాన్ని వారు ఆనాడే ఉప్పు పండించిన అనుభవంతో గుర్తించారు.

ఎనభైశాతం గోదావరి, 70శాతం కృష్ణా నది తెలంగాణలో పారుతున్నా ఇక్కడి పంటలు ఎండబెట్టి, ప్రజల గొంతులు ఎండబెట్టి నీళ్లను ప్రాంతం దాటించారు. ఒక బేసిన్‌లోని ప్రజల సాగునీటి, తాగునీటి అవసరాలతో పాటు పరిశ్రమల అవసరాలు 60 శాతం తీరాకనే మిగిలిన నీటిని వేరొక బేసిన్‌లోని ప్రజల అవసరాలకు తరలించాలనే సహజ న్యాయసూత్రాలను ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు గంగలో కలిపారు. గోదావరి బేసిన్ నుంచి కృష్ణా బేసిన్‌కు అటునుంచి పెన్నా బేసిన్‌కు అక్రమంగా నీటిని తరలించి తెలంగాణ మడులు, గొంతులు ఎండబెట్టారు. దీంతో అనాదిగా చెరువుపై అధారపడిన అరకలు అటకెక్కాయి.

నీళ్లు, నిధులు, నియామకాల పునాదిగా 14ఏండ్లపాటు అవిశ్రాంతంగా సాగిన ఉద్యమ ఫలితంగానే తెలంగాణ ఏర్పడింది. మా నీళ్లు మాగ్గావాలంటూ పిడికిలి బిగించిన నాయకుడే రాష్ట్ర పాలనా పగ్గాలు చేతబట్టి స్వయంగా రాష్ట్రాన్ని మరమ్మత్ చేసి పనిలో పడ్డారు. పుండున్న చోటే మందు రాయాలన్న సూక్తిని ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం చేసిన రోజు నుంచే అమలు చేస్తున్నారు. కృష్ణా, గోదావరి నీళ్లతో రైతుల పాదాలు కడుగుతానని ప్రతిజ్ఞ చేశారు.

ఉమ్మడి రాష్ట్రంలో విధ్వంసం అయిన తెలంగాణ పల్లెలు తిరిగి పునర్వైభవం సంతరించుకోవాలంటే ఊరుకు ఊపిరి, ప్రజల ఆర్థిక ఆయువుపట్టు అయిన చెరువులను బాగుచేయాలని భావించారు. స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలు రచించారు. భారీ నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణం కొనసాగిస్తూనే 'మన ఊరు మన చెరువు' నినాదంతో 'మిషన్ కాకతీయ' పేర యుద్ధ ప్రాతిపదికన చెరువుల్లో పూడికతీత, కట్టల పునర్నిర్మాణానికి పూనుకున్నారు. ఫలితంగా మూడేళ్లలోనే తెలంగాణ పల్లెలు మళ్లా జీవకళ సంతరించుకున్నాయి. ఆరు దశాబ్దాల కిందటి పసిడి తెలంగాణ కళ్ల ముందు తిరిగి సాక్షాత్కరిస్తున్నది.

నింగి వానగట్టు ఉరకలేసినట్టు తూములు, అలుగులు నురగలు గక్కుకుంటూ తెలంగాణ మాగాణాల్లో దుంకుతున్నాయి. ఒకప్పుడు ఎండిన సర్కార్ తుమ్మలు, లొట్టపీసు పువ్వుల మధ్య తొండలు గుడ్లు పెట్టిన చెరువుల్లోనే నేడు మిషన్ కాకతీయతో సర్కార్ చేపలు చెంగుచెంగు మంటున్నాయి. చెరువు కట్టల మరమ్మత్తుతో ప్రతి చెరువు గట్టూ మరో ట్యాంక్ బండ్ ను తలపిస్తుంది.

రాష్ట్రం బరువును కెసిఆర్ మోస్తే, పెద్ద నీరడి హరీశ్ రావు ఆలనా పాలనలో ఊరు బరువును మోసే ఏకైక ఆదరువు నేనున్నానంటూ రైతు కంట నీరు కడుగుతుంది చెరువు. చెరువు నిండాలంటే మొగులు దిక్కు చూసేది లేదు, హరీశ్ రావు దిక్కు చూస్తే సరిపోతుంది అని తెలంగాణ రైతు ఆత్మవిశ్వాసంగా చెప్పగలుగుతున్నాడంటే ఆయన అసలుసిసలు పనితీరుకు నిదర్శనం.

రైతు కళ్లల్లో ఆనందం తొణికిసలాడాలంటే చెరువులు నీళ్లతో కళకళలాడాలె అని గుర్తించిన సర్కార్ ప్రతి ఏటా బడ్జెట్‌లో అధికంగా నిధులు వెచ్చిస్తూ మిషన్ కాకతీయను పరుగులు పెట్టిస్తుంది. అమెరికాలోని చికాగో, మిచిగన్ విశ్వవిద్యాలయాల పరిశోధకులు, గుజరాత్ ఆనంద్‌లోని గ్రామీణ పరిశోధనా సంస్థ నిపుణులు మిషన్ కాకతీయ అధ్యయనం కోసం రావటం తెలంగాణకు దక్కిన గొప్ప గౌరవం. రాష్ట్రంలోని 46,531 చెరువుల్లో మొదటి, రెండవ దశల్లోనే దాదాపు 17 వేల చెరువుల్లో పూడికతీత పూర్తయినట్టు అధికార గణాంకాలే తెలుపుతున్నాయి. అంతే కాదు మిషన్ కాకతీయ చెరువుల ద్వారా 20 లక్షల ఎకరాల్లో ఈ ఏడు దేశంలోనే అత్యధిక పంట దిగుబడి వచ్చినట్టు అధికారులు ధ్రువీకరించడం శుభపరిణామం.

గత 60 సంవత్సరాలుగా ఏనాడూ 12 లక్షల ఎకరాలకు మించని చెరువు కింది ఆయకట్టు మిషన్ కాకతీయ మొదటి, రెండు దశలు కలిపి 17 వేల చెరువుల మరమ్మత్తు ద్వారా కొత్తగా 5 లక్షల ఆయకట్టు పెరిగి 17 లక్షలకు చేరుకోవడం పట్ల మిషన్ కాకతీయ విజయవంతం అయినదని చెప్పవచ్చు. ఈ ఏడు మూడో దశలో మరో 6800 చెరువుల్లో పూడికతీత పనులు నీళ్లమంత్రి హరీశ్ రావు పర్యవేక్షణలో ముమ్మరంగా సాగుతున్నాయి.

కృష్ణా, గోదావరి బేసిన్ లలో 265 టి.ఎం.సీ ల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన చెరువుల ద్వారా 25 లక్షల ఎకరాల ఆయకట్టును తిరిగి స్థిరీకరించేందుకు రాష్ట్ర అధికార యంత్రాంగం నిమగ్నమవ్వడం ప్రభుత్వ పట్టుదలకు నిదర్శనం. ఇప్పటి వరకు చెరువుల్లో 8 టి.ఎం.సిలకు సమానమయ్యే మట్టిని తీసినారంటే పనులు వేగం అంచనా వేయవచ్చు. రాష్ట్రం ఏర్పడిన మూడేళ్ల స్వల్పకాలంలోనే ఆకలి చావులు, ఆత్మహత్యలు, వలసలు గణనీయంగా తగ్గినట్టు తేటతెల్లం అయ్యింది. వలస పక్షులు గూటికి చేరుకున్నట్టు బతుకునెతుక్కుంటూ ఊరిడిసిన ప్రజలు తిరిగి సొంతూరు చేరుకుంటున్నారు. తెలంగాణ తల్లికి అలుకుడు భోనం చేసి బంగారు తెలంగాణ సాధనకు అరకటెడ్లతో పోటీపడుతున్నారు.

■ కొండె సమ్మయ్య

జర్నలిస్టు

ఔను.. ఇవాంకా వస్తోంది



- అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ట్వీట్
- భారత్‌కు రానుండడం గౌరవం: ఇవాంకా

చెన్నై, ఆగస్టు 11: ప్రపంచవ్యాప్త పారిశ్రామికవేత్తలతో హైదరాబాద్‌లో జరగనున్న గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సదస్సుకు తన కుమార్తె ఇవాంకా ట్రంప్ హాజరు కానున్న విషయాన్ని ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిర్ధారించారు. 'ప్రపంచవ్యాప్తంగా మహిళా పారిశ్రామికవేత్తలకు మద్దతుగా, జీఈఎస్-2017కు అమెరికా ప్రతినిధుల బృందానికి ఇవాంకా ట్రంప్ సారథ్యం వహిస్తుంది' అని ట్రంప్ గురువారం ట్వీట్ చేశారు. ఈ సదస్సు నవంబరు 28 నుంచి మూడు రోజులపాటు హైదరాబాద్‌లో జరగనున్న విషయం తెలిసిందే. నీతీ ఆయోగ్, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరగనున్న ఈ సదస్సులో ప్రధాని మోదీ కూడా పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో, 'భారత్‌లో జరిగే జీఈఎస్-2017కు అమెరికా ప్రతినిధుల బృందానికి సారథ్యం వహించనుండడం, ప్రధాని మోదీని, ప్రపంచస్థాయి పారిశ్రామికవేత్తలను కలుసుకోనుండడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను' అని ఇవాంకా ట్విటర్‌లో పేర్కొన్నారు. ప్రధాని మోదీతో తాను కరచాలనం చేస్తున్న చిత్రాన్ని కూడా ఆమె తన ట్విటర్‌లో పోస్ట్ చేశారు. "మహిళలే ముందు. అందరికీ శ్రేయస్సు" ఇదే ఈ సదస్సు థీమ్ అని న్యూఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. కాగా ట్రంప్, ఇవాంకాల ట్వీట్‌లను ప్రధాని మోదీ శుక్రవారం ఉదయం రీట్వీట్ చేశారు. 'ఈ సదస్సు ప్రపంచంలోని పారిశ్రామికవేత్తలందరినీ ఒక్క చోటికి చేర్చే గొప్ప వేదిక' అని ప్రధాని పేర్కొన్నారు.

ఏప్రిల్ 12నే బడులు బంద్.. జూన్ 1న ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో విద్యార్థులు, టీచర్లు స్కూళ్లలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పినట్టు సమాచారం.

అనుబంధ గుర్తింపులో అవినీతి లేదు: కడియం శ్రీహరి


ప్రైవేటు జూనియర్ కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇచ్చే అంశంలో ఇంటర్మీడియట్ బోర్డు అవినీతికి పాల్పడటం లేదని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి చెప్పారు. అనుమతుల జారీలో పారదర్శకతను పాటించేందుకే అన్‌లైన్ విధానం ప్రవేశపెట్టామని, కాలేజీ యాజమాన్యాలు బోర్డు చుట్టు తిరగాల్సిన పనిలేదని అన్నారు. ఇప్పటి వరకు 1,250 జూనియర్ కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇచ్చామని, మరో 350 కాలేజీలకు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. ఈ నెల 21 వరకు ఆయా కాలేజీలకు గడువు ఇచ్చినట్టు వివరించారు. రాష్ట్రంలో వాసవి కాలేజీ లాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కడియం శ్రీహరి వెల్లడించారు. విజిలెన్స్ బకాయిలు చెల్లించని కార్పొరేట్ కాలేజీలకు అనుబంధ గుర్తింపునకు అవకాశం కల్పించలేదని, వారు శుక్రవారం నాటికి జరిమానాలు చెల్లించారని తెలిపారు. బోర్డు చరిత్రలో కార్పొరేట్ కాలేజీల నుంచి జరిమానాలు వసూలు చేసిన దాఖలాలు లేవన్నారు. జరిమానాలు చెల్లించిన 29 కార్పొరేట్ కాలేజీలు ఈ నెల 21వ తేదీ వరకు అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకునేలా సమయం ఇచ్చామన్నారు. పరీక్ష ఫీజు చెల్లింపునకంటే ముందే అనుబంధ గుర్తింపు లేని కాలేజీల వివరాలను బహిరంగ పరుస్తామన్నారు. గుర్తింపు ఉన్న కాలేజీల్లోనే ప్రవేశాలు పొందేలా విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఉపాధ్యాయ ఏకీకృత సర్వీసు రూల్స్‌పై ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు, సంఘాలు, జేఏసీలతో సమావేశం ఏర్పాటు చేసి, వారి సలహాలు, సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో గత మూడేళ్లలో 50 వేల ప్రవేశాలను పెంచామని, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోనూ మధ్యాహ్న భోజన పథకంపై కసరత్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

మూడూళ్లు.. 4 రోజులు!

నేటి నుంచి భూముల రీ సర్వే.. రంగారెడ్డిలో 2, సిద్దిపేటలో ఒకటి

- జిల్లా యంత్రాంగమంతా గ్రామాల్లోనే
- రైతులూ.. ఊరు విడిచి వెళ్లొద్దు
- సరిహద్దులు, రికార్డులను చూపించండి
- రెవెన్యూ యంత్రాంగం విజ్ఞప్తి
- పంద్రాగస్టు తర్వాత సీఎం సమీక్ష

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ప్రభుత్వం ప్రయోగాత్మకంగా భూముల రీ సర్వే చేపట్టనుంది. రంగారెడ్డి జిల్లాలో రెండు; సిద్దిపేట జిల్లాలో ఒక గ్రామాన్ని ఇందుకు ఎంపిక చేసింది. ఈనెల 12వ తేదీ నుంచి 15 వరకూ నాలుగు రోజులపాటు ఈ సర్వే జరగనుంది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని తుర్కగూడ, చింతపల్లిగూడ; సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని దౌలాపూర్ గ్రామాల్లో భూములు సర్వే చేస్తారు. దౌలాపూర్‌లో 3000 ఎకరాలు ఉండగా, వాటిలో 1000 ఎకరాలు అటవీ భూమి కాగా.. 2000 ఎకరాలు రెవెన్యూ భూమి. నాలుగు రోజులూ ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఆర్ఐ, వీఆర్వో, వీఆర్ఏ తదితర ఆయా జిల్లాల యంత్రాంగమంతా గ్రామాల్లోనే బస చేసి, రికార్డులను సరిచేయనుంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ యంత్రాంగం ఆయా గ్రామాల్లోనే పర్యటించనుంది. సర్వే నేపథ్యంలో ఆయా గ్రామాల రైతులను యంత్రాంగం అప్రమత్తం చేసింది. రైతులంతా భూముల వద్దే ఉండి.. సదరు భూమి ఎంత విస్తీర్ణంలో ఉంది? తదితర వివరాలను అందించాలని కోరింది. సంబంధిత రికార్డులు అందించడంతోపాటు ఆయా భూముల సరిహద్దులను చూపించాలని సూచించింది. ఆ నాలుగు రోజులూ రైతులెవరూ గ్రామాలను విడిచి వెళ్లరాదని, తమ భూముల్లో ఉండాలని కోరింది. పహాణీ, రికార్డ్ ఆఫ్ రైట్ (ఆర్వోఆర్) 1బీ సర్టిఫికెట్‌తోపాటు ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ నంబర్‌తో సిద్ధంగా ఉండాలని రెవెన్యూ శాఖ కోరింది. ప్రయోగాత్మకంగా నాలుగు రోజులపాటు మూడు గ్రామాల్లో చేపట్టనున్న ఈ ప్రక్రియతో భూముల సర్వేపై స్పష్టత రానుంది. తొలుత రికార్డుల అప్‌డేషన్, ప్యూరిఫికేషన్ కోసం 90 రోజులపాటు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని సీఎం కేసీఆర్ ఇప్పటికే ఆదేశించారు. పంద్రాగస్టు తర్వాత సీఎం దీనిపై సమీక్షిస్తారు. ఈ సందర్భంగా సర్వేపై నివేదికను అధికారులు సీఎంకు అందించనున్నారు.



స్పీకర్ కుమారుడి వివాహానికి హాజరైన సీఎం కేసీఆర్, మంత్రులు నాయిని, ఇంద్రకరణ్ తదితరులు

మూడేళ్ల కిందటే నిధులు

భూముల సర్వేకు మూడేళ్ల కిందటే కేంద్రం నిధులు మంజూరు చేసింది. అయినా, సర్వే దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. గతంలో మెదక్ జిల్లాలో ఒక గ్రామంలో భూముల సర్వేను ప్రతిపాదించారు. పూర్వపు నిజామాబాద్ జిల్లాలో భూముల రీ సర్వే 90 శాతం పూర్తయింది. సర్వేకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోయినా సర్వే శాఖ ఏకంగా 8 వేల రెవెన్యూ గ్రామాల రికార్డులను డిజిటైజేషన్ చేసింది. నిబంధనల ప్రకారం, ప్రతి 30 ఏళ్లకు ఒకసారి రెవెన్యూ రికార్డుల నవీకరణ జరగాలి. అప్పుడే ఏ భూమికి ఎవరు యజమానులో తేలి.. రుణాల పంపిణీ, మాఫీ, పంటల బీమా, భూముల సేకరణ వంటి అంశాల్లో సమస్యలు పరిష్కారమవుతాయని రెవెన్యూ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రీ-సర్వే నిరంతర ప్రక్రియగా జరగాల్సి ఉండగా.. భూ పరిపాలనపై ఉమ్మడి రాష్ట్ర అవలక్షణాలే పునరావృతమవుతున్నాయని అధికారులు మండిపడుతున్నారు. తెలంగాణలో నిజాం కాలంలోనే 1936-42 మధ్య కాలంలో సమగ్ర భూముల సర్వే జరగ్గా... హైదరాబాద్‌తో పాటు పట్టణాల్లో 1972 టౌన్ సర్వే జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 30 జిల్లాల్లో (హైదరాబాద్ కాకుండా) 1.64 కోట్ల సర్వే నంబర్లు/ సబ్ డివిజన్లు ఉండగా 74 లక్షల మంది పట్టాదారులు ఉన్నారు. భూమి ఒకరి చేతుల్లో ఉంటే.. రికార్డులో మరొకరి పేరు ఉంది. చివరికి భూముల సరిహద్దు పత్రా (టిప్పన్)లు కూడా 75 ఏళ్ల పాతవే. భూములు కొలవడానికి ఈ పత్రాలు తీయగానే చిరిగిపోతుంటాయని సర్వేయర్లు వాపోతున్నారు. రీ సర్వే చేపడితే రికార్డులన్నీ శాశ్వతంగా అప్‌డేట్ అవుతాయని సూచిస్తున్నారు.

సాదా బైనామాల క్రమబద్ధీకరణ పూర్తి

తెలంగాణలో సాదా బైనామాల క్రమబద్ధీకరణ ప్రక్రియ ఎట్టకేలకు పూర్తయింది. రైతులకు 1బీ (యాజమాన్య ధ్రువీకరణ) పత్రాలు జారీ చేసి... వెబ్‌ల్యాండ్‌లో రికార్డులను అప్‌డేట్ చేశారు. 2014 జూన్ 2వ తేదీకి ముందు జరిగిన భూముల క్రయవిక్రయాలకు ఉచితంగా చట్టబద్ధత కల్పించడానికి 2016 మార్చి 1న రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబరు 53 తెచ్చింది. ఈ మేరకు 15,68,137 దరఖాస్తులు అందగా, వాటిలో 6,18,081 సర్వే నంబర్లకు చెందిన దరఖాస్తులను అధికారులు ఆమోదించారు.

వచ్చే వారం మంత్రివర్గ భేటీ

హైదరాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మంత్రివర్గ సమావేశం వారం రోజుల్లో జరగనుంది. కేబినెట్‌లో పెట్టాల్సిన అంశాల ఫైళ్లు పంపించాలని వివిధ శాఖలకు సాధారణ పరిపాలన శాఖ మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. 32 శాఖల నుంచి అరడజను చొప్పున ఫైళ్లు జీఏడీకి చేరుకున్నాయి. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ల అంశాన్ని చర్చిస్తారు. ఈ నెల 16 లేదా 17వ తేదీల్లో మంత్రివర్గ సమావేశం జరగనున్నట్లు అధికారిక వర్గాలు నిర్ధారించాయి.

టీఎస్‌పీఎస్సీ సభ్యుల వేతనాలు పెంపు

హైదరాబాద్,ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల వేతనాలు పెంచుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. చైర్మన్ వేతనం రూ.80 వేల నుంచి రూ.2,25,000 వరకు, సభ్యుల వేతనాలు రూ.79వేల నుంచి రూ.2,24,100 వరకు పెరిగింది. పెరిగిన వేతనం 1జనవరి 2016 నుంచి అమల్లోకి వస్తుందని తెలిపారు.

2020 కల్లా తట్టు నివారణ: లక్ష్మారెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వ్యాధుల పట్ల అవగాహన, చైతన్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.లక్ష్మారెడ్డి అన్నారు. వ్యాధులు రాకుండా జాగ్రత్త పడటం, వచ్చినా మొదటి దశలోనే గుర్తించడం, తర్వాత అవసరమైన చికిత్స తప్పనిసరి అన్నారు. మీజిల్స్ (తట్టు)-రూబెలా టీకాలపై అవగాహన, చైతన్యపరిచే పోస్టర్‌ను మంత్రి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2020 కల్లా దేశం, రాష్ట్రంలో ప్రాణాంతకమైన మీజిల్స్-రూబెల్లా వ్యాధిని నివారించడమే లక్ష్యంగా 9-15 ఏళ్లలోపు పిల్లలకు టీకాలు ఉచితంగా ఇస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 17 నుంచి సెప్టెంబరు 25 వరకు టీకాల కార్యక్రమం ఉంటుందన్నారు.

72 గంటల్లో రిజిస్ట్రేషన్.. మ్యుటేషన్

హైదరాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): భూ రికార్డులకు సంబంధించి 2018 జనవరి నుంచి భూముల రిజిస్ట్రేషన్‌తో పాటు 72 గంటల్లో మ్యుటేషన్ పక్రియ పూర్తి చేసే విధానాన్ని అమలు చేయనున్నట్టు డిప్యూటీ సీఎం మహమూద్ అలీ తెలిపారు. శుక్రవారం వివిధ శాఖల అధికారులతో కలిసి శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని హజ్ టెర్మినల్, నాంపల్లి హజ్‌హౌజ్ ప్రాంగణంలో హజ్ యాత్రికులకు సిద్ధం చేసిన హజ్ శిబిరాన్ని పరిశీలించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. హజ్‌కు వెళ్లే 7 వేల మంది యాత్రికులకు వసతి సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది రూ.3 కోట్లు వ్యయం చేయనుందని తెలిపారు.

ఇంటర్మీడియట్ బోర్డులో ఆంక్షలు

హైదరాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డులో సందర్శకుల ప్రవేశంపై అధికారులు ఆంక్షలు విధించారు. అత్యవసరమైన వారికి పాస్‌లు ఇచ్చి ప్రజాసంబంధాల అధికారిని కలిసేందుకు అనుమతిస్తున్నారు. ప్రైవేట్ కాలేజీలకు అఫిలియేషన్ల అంశంపై రగడ సాగుతుండడం, ఇతరత్రా కారణాలతో ఈ ఆంక్షలు విధించినట్లు సమాచారం. సేవలన్నీ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నందున బయటి వ్యక్తులు, కళాశాలల యాజమాన్యాలు బోర్డు అధికారులను కలవకుండా చర్యలు తీసుకున్నారు.

జాతీయ టారిఫ్ ఆధారంగా క్రాస్ సబ్సిడీ

హైదరాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్‌లో కరెంట్‌ను కొనుగోలు చేస్తున్న వినియోగదారులపై జాతీయ టారిఫ్ పాలసీ ఆధారంగా క్రాస్‌సబ్సిడీ సర్‌చార్జీ విధించాలని రాష్ట్ర విద్యుత్తు సంస్థలు నిర్ణయించాయి. ఎంబెడెడ్ కాస్ట్ మెథడ్ ప్రకారం.. ఇప్పటిదాకా క్రాస్ సబ్సిడీ వసూలు చేయగా జాతీయ టారిఫ్ పాలసీ ప్రకారం క్రాస్ సబ్సిడీని ప్రతిపాదించాయి. దీనిపై తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలి(టీఎస్ఈఆర్సీ) అభ్యంతరాలు/సూచనలు/సలహాలు స్వీకరిస్తోంది. సెప్టెంబరు 4 లోగా దీనిపై సమాచారం అందించాలని టీఎస్ఈఆర్సీ నోటీసులిచ్చింది. ఇప్పటిదాకా 11 కేవీ కరెంట్ కొంటే ఒక్కో యూనిట్‌కు రూ.2.07 వసూలు చేయగా.. 33 కేవీకి అయితే రూ.1.29, 132 కేవీకి రూ.0.93ల క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీని వినియోగదారులు చెల్లిస్తున్నారు. ఇది 2003 ఎలక్ట్రిసిటీ యాక్ట్ ప్రకారం జారీ చేసిన నేషనల్ టారిఫ్ పాలసీకి వ్యతిరేకమని వినియోగదారులు సుప్రీం కోర్టులో కేసు వేశారు. దాంతో సుప్రీం ఆదేశాలతో జాతీయ టారిఫ్ పాలసీ ఆధారంగా క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీ విధించాలని డిస్కంలు యోచిస్తున్నాయి.

ఎంబీబీఎస్ 216.. బీడీఎస్ 219 సీట్లు

- తొలి దశ కౌన్సెలింగ్‌లో మిగిలిన వైద్య సీట్లు

హైదరాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మొదటి దశ కౌన్సెలింగ్ తరువాత 216 ఎంబీబీఎస్ సీట్లు, 219 బీడీఎస్ సీట్లు మిగిలాయి. ఈ సీట్ల భర్తీకి 12 నుంచి వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుదని శుక్రవారం తెలంగాణ హెల్త్ యూనివర్సిటీ ప్రత్యేక నోటిఫికేషన్ జారీ చేసింది. ఆయా కాలేజీల్లో మిగిలిన సీట్ల వివరాలను కూడా వర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచారు. తొలి దశ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన వారు కాలేజీల్లో చేరకపోవడంతో ఇవి మిగిలాయి. వీటిలో ఎక్కువగా ఏపీ విద్యార్థులు వదిలిపెట్టినవే ఉన్నాయి. 15% అన్‌రిజర్వ్ సీట్లకు ఇరురాష్ట్రాల విద్యార్థులు పోటీ పడే అవకాశం ఉంది. అయితే ఇక్కడ సీట్లు పొందిన ఏపీ విద్యార్థులకు ఏపీ కాలేజీల్లోనూ సీట్లు దక్కి ఉంటాయి. దాంతో ఇక్కడి సీటును వదులుకుని ఏపీలో చేరడంతో తొలి దశలో ఎక్కువ ఎంబీబీఎస్ సీట్లు మిగిలాయి. బీడీఎస్ సీట్లదీ అదే పరిస్థితి. తొలి దశలో సీట్లు వచ్చి, వాటిలో చేరని విద్యార్థులకు రెండవ దశ కౌన్సెలింగ్‌లో పాల్గొనే అవకాశం లేదు. రెండవ దశ కౌన్సెలింగ్‌కు శనివారం(12) ఉదయం 11 గంటల నుంచి 14వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు విద్యార్థులు ఆప్షన్లను నమోదు చేసుకోవాలి.

జర్నలిస్టు సొసైటీకి నిజాంపేట భూమి

హైదరాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీకి మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా బాచుపల్లి మండలం నిజాంపేటలోని సర్వే నం:332లో 32 ఎకరాల స్థలాన్ని అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ స్థలాన్ని సొసైటీకి పొజిషన్ ఇవ్వాలని నిర్దేశిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీఆర్ మీనా మెమో.19544/అసైన్‌మెంట్-3(3)2011-9ను శుక్రవారం జారీ చేశారు. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని భూపరిపాలన ప్రధాన కమిషనర్‌తో పాటు, మేడ్చల్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ స్థలాన్ని 2008లోనే సొసైటీకి కేటాయిస్తూ అప్పట్లో రెవెన్యూ శాఖ జీవో ఇచ్చింది. కాగా, ఇప్పుడు ఆ స్థలాన్ని సొసైటీకి అందిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. భూముల కేటాయింపుపై ప్రస్తుతం సుప్రీంకోర్టులో కేసులు కొనసాగుతుండగా, న్యాయస్థానం తుది ఉత్తర్వులకు లోబడి ఈ స్థలాన్ని కేటాయించారు.

లక్ష గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

కొత్తపేట: నిషేధిత గుట్కా ప్యాకెట్లను తరలిస్తున్న ఇద్దరిని ఎల్‌బీనగర్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారి నుంచి లక్ష గుట్కా ప్యాకెట్లు ఉన్న సంచులను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై మారయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్‌నగర్ పరిధిలోని ఈదీ బజార్‌లో ఉండే ఎండీ.హుస్సేన్(40) ఇంట్లోనే గుట్కాల గోదాం నిర్వహిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన అబ్దుల్ ఖాలిద్(46), గౌస్(42) ద్వారా అతను ఇతర ప్రాంతాల వ్యాపారులకు గుట్కాలు తరలించేవాడు. విషయం తెలుసుకున్న ఎస్ఓటీ పోలీసులు మైత్రీనగర్ వద్ద గుట్కాలు తరలిస్తున్న అబ్దుల్ ఖాలిద్, గౌస్‌ను అరెస్టుచేశారు. గుట్కాల సంచులున్న వ్యాన్‌ను స్వాధీనం చేసుని నిందితులిద్దరినీ రిమాండుకు తరలించారు.

'కాకతీయ' కల సాకారం

- 16న మెగా టెక్స్‌టైల్ పార్కుకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన
- వేగంగా నిర్మాణానికి ప్రణాళిక: కడియం



హైదరాబాద్/వరంగల్ రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రూరల్ జిల్లా సంగెం మండలం చింతలపెల్లి గ్రామంలో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు ఆగస్టు 16న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శంకుస్థాపన చేయనున్నారు. రూ.1150 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ పార్కులో సుమారు రూ.11,500 కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో ప్రారంభమైతే సుమారు 1.13 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించే అవకాశముంది. తెలంగాణ నుంచి సూరత్, ఇతర ప్రాంతాలకు వలసలు తగ్గుతాయని ప్రభుత్వం భావిస్తోంది. కాగా టెక్స్‌టైల్ పార్కు కోసం ఇప్పటికే 1190 ఎకరాల స్థలం సేకరించినట్లు ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి తెలిపారు. పనులు వేగంగా జరగనున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా టెక్స్‌టైల్ పార్కు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.1200 కోట్లు అందిస్తున్నందున కేంద్ర జౌళి శాఖ మంత్రి స్మృతి ఇరానీని శంకుస్థాపన కార్యక్రమానికి ఆహ్వానించాలని బీజేపీ నేతలు అంటున్నారు. లేకపోతే శంకుస్థాపనను అడ్డుకుని తీరుతామని హెచ్చరిస్తున్నారు. ఈ సందర్భంగా వరంగల్ రూరల్ జిల్లా కేంద్రంపై ముఖ్యమంత్రి స్పష్టత ఇవ్వనున్నట్టు తెలుస్తోంది.

టీఆర్ఎస్‌ను వదిలే ప్రసక్తే లేదు

- కాంగ్రెస్‌లో చేరుతాననడం కల్ల
- నాతో ఎవరూ మాట్లాడలేదు: డీఎస్



హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): 'నేను టీఆర్ఎస్‌ను వదిలే ప్రసక్తే లేదు. కాంగ్రెస్‌లో చేరుతానన్న ప్రశ్నే ఉత్పన్నం కాదు. నన్ను ఎవరూ పిలవలేదు. ఎవరూ కలవలేదు. నేనవరితోనూ మాట్లాడలేదు. కాంగ్రెస్‌లో చేరనున్నానని మీడియాలో వచ్చిన కథనంలో వాస్తవం లేదు' టీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు డీ.శ్రీనివాస్ తేల్చి చెప్పిన మాటలివి. 'కాంగ్రెస్‌లోకి డీఎస్-ఖండించినా ఆగని ప్రచారం' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై డీఎస్ స్పందించారు. ఈ విషయంపై తెలంగాణ భవన్‌లో ప్రత్యేకంగా మీడియాతో మాట్లాడారు. 'గతంలో ఇలాంటి వార్తను ఖండించాక మళ్లీ రావటం దురదృష్టకరం. వాస్తవమనిపిస్తే అడగాలి. నన్ను అడిగితే చెబుతాను కదా? నన్ను అడగకుండా నా ఇమేజ్‌ని దెబ్బ తీసే విధంగా వార్త రాశారు. క్రెడిబిలిటి, రోల్ లీడింగ్ ఉన్న నేతను నేను. ఆ వార్త చూసి చాలా కలత చెందాను'.. అని పేర్కొన్నారు. బాధ్యతాయుత స్థానంలో ఉన్న మీడియా సమాజంలో గందరగోళాన్ని సృష్టించకూడదన్నారు. నేతలకు- ప్రజలకు మధ్య మీడియా వారధిగా పని చేయాలని అభిప్రాయపడ్డారు. మరోసారి ఇలాంటి వార్తలు రాస్తే చట్టపరంగా ఎదుర్కొనేందుకు ఎంతదూరమైనా వెళ్తానని స్పష్టం చేశారు. కాగా కాంగ్రెస్‌లోకి పోయేదుంటే ఆ సమాచారాన్ని ఎంతో కాలం ఆపలేమని.. ఏ సమాచారం అయినా ఒక స్థాయి వరకే సైలెంట్‌గా ఉంటుందని తనదైన శైలిలో వ్యాఖ్యానించారు. తనంటే గిట్టని వాళ్లే ఇదంతా చేయిస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. 'కాంగ్రెస్‌లో తిరిగి చేరనున్నానని ఒక వేళ పీసీసీ అధ్యక్ష స్థాయి నేత అని ఉంటే, ఆ నేత ఎవరో.. నన్ను పిలిచి మాట్లాడాలి. ఊరికే మాట్లాడితే ఎలా? రాజ్యసభ సీటు వదులుకొని ఎమ్మెల్యే టికెట్ అడుగుతానా?' అని పేర్కొన్నారు.



రోడ్ల పనుల్లో ఇంత జాప్యమా?

- అధికారులపై తుమ్మల అసహనం

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జాతీయ రహదారుల పనుల నత్తనడకపై రోడ్లు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) పనుల్లో జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సంవత్సరం కేంద్రం అనుమతించి, జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)కు బదిలీ చేసిన ఐదు రహదారుల పనుల జాప్యంపై అసహనం వ్యక్తం చేశారు. 15 రోజుల్లో భూసేకరణకు ల్యాండ్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం జుబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మంత్రి తుమ్మల, ఎన్‌హెచ్ఏఐ, సింగరేణి, రాష్ట్ర ఎన్‌హెచ్ విభాగం అధికారిణి వసంత, కన్సల్టెంట్లు, ఖమ్మం జిల్లా ప్రజా ప్రతినిధులతో ఆయన సమీక్షించారు. 6 నెలలుగా కన్సల్టెంట్లు, అధికారులు సరైన పురోగతి సాధించలేకపోయారని, కొన్నిచోట్ల ఇంకా బైపాస్‌లను కూడా ఖరారు చేయలేకపోయారని మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. కన్సల్టెంట్ సంస్థలపై అజమాయిషీ మరింత పకడ్బందీగా ఉండాలని, అధికారులు అలక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. భూసేకరణ ప్రక్రియ వెంటనే చేపట్టి పనులు త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. ఆయా జిల్లా కలెక్టర్లు, అధికారులు, ఇంజినీర్లు, ఎన్‌హెచ్ఏఐ అధికారులు క్రమపద్ధతిలో, కాల నియమావళి ప్రకారం ముందుకు పోవాలని సూచించారు.

ఉద్యోగులకు ప్రోత్సాహక అవార్డులు

132 పేర్లు ఆమోదించిన సీఎం

హైదరాబాద్, ఆగస్ట్ 11(ఆంధ్రజ్యోతి): అంకితభావం, నిబద్ధతతో పనిచేస్తున్న ఉద్యోగులకు అవార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. 'ప్రోత్సాహక' అవార్డులు పొందే ఉద్యోగుల జాబితాకు సంబంధించిన ఫైలుపై సీఎం కేసీఆర్ శుక్రవారం రాత్రి సంతకం చేశారు. ఇన్సెంటివ్ కమిటీ ఖరారు చేసిన జాబితానే సీఎం ఆమోదించారు. జిల్లాల్లో 124 మంది ఉద్యోగులకు, శాఖాధిపతుల కార్యాలయాల నుంచి నలుగురికి, సచివాలయం నుంచి నలుగురికి మొత్తం 132 మంది ఉద్యోగులకు ప్రోత్సాహకాలిస్తారు. ఈ ఉద్యోగుల కు అదనపు ఇంక్రిమెంట్, కమెండేషన్ లెటర్ ఇవ్వడంతో పాటు సర్వీస్ పుస్తకాల్లో అప్రిసియేషన్‌ను నమోదు చేస్తారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన ఉద్యోగులకు ఆగస్ట్ 15న సీఎం కేసీఆర్, జిల్లాల్లో మంత్రులు అవార్డులిస్తారు. రాష్ట్ర స్థాయిలో 4కేటగిరీల్లో మొదటి స్థానం పొందిన ఉద్యోగులకు రూ.5 లక్షలు, ద్వితీయ స్థానం పొందిన వారికి రూ.3 లక్షల చొప్పున నగదు బహుమతులిస్తారు.

అవార్డులు పొందే ఉద్యోగుల వివరాలు..

కేటగిరీ	పేరు	హోదా	శాఖ/జిల్లా
గ్రూప్ 1...			
మొదటి స్థానం	డాక్టర్ సీహెచ్ మధుసూధన్	అసిస్టెంట్ ప్రొఫెసర్	ఉస్మానియా మెడికల్ కాలేజ్
రెండవ స్థానం	సురేశ్ బాబు	డీపీఓ	సిద్దిపేట
మూడవ స్థానం	పీడబ్ల్యూ జాన్సన్	డీఆర్డీఓ	వికారాబాద్
గ్రూప్ 2...			
మొదటి స్థానం	ఖానాపూర్ చంద్రకళ	ఆర్డీఓ	హైదరాబాద్
రెండవ స్థానం	విశ్వనాథం గుప్తా	హెడ్‌మాస్టర్	రంగారెడ్డి
మూడవ స్థానం	రమీజుద్దీన్ అహ్మద్	మండల ప్లానింగ్ అధికారి	పెద్దపల్లి
గ్రూప్ 3...			
మొదటి స్థానం	ఎం.జయమ్మ	స్టాఫ్ నర్స్	మహబూబ్‌నగర్
రెండవ స్థానం	కె.ప్రకాశ్	పంచాయతీ కార్యదర్శి	వరంగల్ రూరల్
మూడవ స్థానం	డి.శంకర్ కుమార్	పీఏ టు సీపీఆర్వో	ఐ అండ్ పీఆర్
గ్రూప్ 4...			
మొదటి స్థానం	బి.దశరథ్	సైకిల్ ఆర్డర్లీ	స్త్రీ, శిశు సంక్షేమ శాఖ
రెండవ స్థానం	కె.గంగయ్య	ఆఫీస్ సబార్డినేట్	కామారెడ్డి
మూడవ స్థానం	కె.కిష్టయ్య	ఆఫీస్ సబార్డినేట్	యాదాద్రి

2019లో మాదే అధికారం

గాంధీభవన్‌లో 13, 14న ఎగ్జిక్యూటివ్ మీటింగ్... రాష్ట్ర సమస్యలు, ఎన్నికల వ్యూహాలపై చర్చ...

- **కాంగ్రెస్‌లో బాహుబలి ఉండడు, అందరూ సైనికులే**
- **నేరెళ్ల ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్‌సీలో ఫిర్యాదుతోనే ప్రభుత్వం కదిలింది**
- **ఆంధ్రజ్యోతితో కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జ్ కుంతియ**

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సోనియాగాంధీ చలవతోనే తెలంగాణ ఏర్పడిందని, 2019లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ రుణం తీర్చుకుంటారని, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ ఆర్‌సీ కుంతియా ధీమా వ్యక్తం చేశారు. కొత్త బాధ్యతలు చేపట్టిన తరువాత పలు అంశాలపై ఆంధ్రజ్యోతికి కుంతియా ఇచ్చిన ఇంటర్వ్యూ వివరాలిలా ఉన్నాయి.



కొత్త బాధ్యతతో తెలంగాణలో కాంగ్రెస్‌ను ఎలా ముందుకు తీసుకెళ్లబోతున్నారు..?

తెలంగాణలో పార్టీ చాలా పటిష్ఠంగా ఉంది. 2019లో అధికారం తప్పకుండా మమ్మల్నే వరిస్తుంది. అసలు రాష్ట్రం ఏర్పాటు చేసింది సోనియాగాంధీనే. తెలంగాణ ప్రజలకిచ్చిన హామీ ప్రకారం విభజన జరిగితే అది వేరే వాళ్లు తమ ఖాతాలో వేసుకుని అధికారంలోకి వచ్చారు. ఈ సారి ఆ పరిస్థితి రాకుండా పక్కాగా ప్రజలకు ఆ విషయం తెలిసేలా ముందుకెళతాం. గతంలో పంజాబ్, మిజోరామ్ వంటి రాష్ట్రాల ఏర్పాటు సమయంలోనూ కృషి చేసింది కాంగ్రెస్ అయితే.. ప్రాంతీయ పార్టీలు లబ్ధి పొందాయి.

కాంగ్రెస్ లక్ష్యంగా టీఆర్ఎస్ దూకుడు పెంచింది. దీన్ని ఎలా ఎదుర్కొంటారు?

ప్రస్తుతం తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా టీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఇసుక మాఫియా పేరుతో జరిగే అన్యాయాలను ప్రశ్నించినందుకు నలుగురు బీసీలు, ఇద్దరు ఎస్సీలు, ఇద్దరు గిరిజనులను అతి క్రూరంగా పోలీసులు హింసించారు. ఈ విషయంలో ప్రభుత్వం మొదట పోలీసులను అడ్డంగా సమర్థించింది. ఎప్పుడైతే కాంగ్రెస్ పార్టీ తరఫున జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు, ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశామో అప్పుడు టీఆర్ఎస్‌లో భయం పట్టుకుంది. ప్రజలు వారి పక్షాన లేరని వారికి భయం పట్టుకుంది. అందుకే దుందుడుకుతనంతో మాట్లాడుతున్నారు. ఆ క్రమంలోనే మీడియా సమావేశాల్లో కాంగ్రెస్‌ని లక్ష్యంగా చేసుకుని మాట్లాడుతున్నారు.

విభజన చట్ట ప్రకారం అసెంబ్లీ సీట్ల అంశానికి మీరు మద్దతిస్తారా?

చట్టప్రకారం జరగాల్సిన ప్రతి అంశానికీ కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది. కాకపోతే అధికార దాహంతో ఇష్టానుసారంగా సీట్లు పెంపు, పునర్‌వ్యవస్థీకరణ చేయడం సరికాదు. అధికారంలో ఉన్న పార్టీ ఎక్కడ బలంగా ఉందో లెక్కలేసుకుని, లేని చోట ప్రత్యర్థి పార్టీకి అవకాశం లేకుండా ముక్కలు చేయాలని చూడటానికి మేము వ్యతిరేకం. అఖిలపక్షంతో చర్చించి కేంద్రం నిర్ణయం తీసుకోవాలి. అప్పుడే మా మద్దతు.

కాంగ్రెస్‌లో బాహుబలి ఎవరు..? ప్రస్తుతం పీసీసీలో మార్పులేమైనా ఉంటాయా?

కాంగ్రెస్‌లో బాహుబలి అని ఎవరూ ఉండరు. సోనియాగాంధీ, రాహుల్ సారథ్యంలో క్రమశిక్షణ కలిగిన సైనికుల్లా కార్యకర్తలు పనిచేస్తారంతే. పీసీసీలో మార్పులు చేయాలంటే అది రాహుల్‌గాంధీ నిర్ణయం. పీసీసీ ప్రస్తుత అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి చాలా బాగా పనిచేస్తున్నారు. రాష్ట్రంలో రెవెన్యూ జిల్లాల సంఖ్య పెరిగినా కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగం ప్రకారం తెలంగాణలో 10 జిల్లాలే ఉన్నాయి. ఏఐసీసీ తరువాతి సెషన్‌లో పెంచిన జిల్లాలను ఆమోదించిన తరువాత కమిటీల ఏర్పాటు ప్రక్రియ మొదలవుతుంది.

2019 ఎన్నికలకు ఏ వ్యూహంతో వెళ్లబోతున్నారు..?

రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు బాగా పనిచేస్తున్నారు. ఇప్పుడు మెరుగైన స్థితిలోనే ఉన్నాం. 2019లో ఎన్నికలకు ఎలా వెళ్లాలి, ప్రస్తుతం రాష్ట్రంలో ఎటువంటి సమస్యలున్నాయి, పార్టీ తరఫున ఎటువంటి పోరాటం చేయాలి అనే అంశాలను చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ఈ నెల 13న హైదరాబాద్ వెళతాను. రెండు రోజుల పాటు (13, 14న) గాంధీ భవన్‌లో ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహిస్తాం. అక్కడ నాయకులతో అన్ని అంశాలపై చర్చించి అప్పుడు ఎన్నికల వ్యూహం ఎలా ఉండాలనేది నిర్ణయిస్తాం.

కుంతియాతో అయ్యేనా!

- **దిగ్విజయ్‌కి సాధ్యం కాని క్రమశిక్షణను తీసుకువస్తారా?**
- **నేడు ఇన్‌చార్జి హోదాలో రాష్ట్రానికి తొలిసారి రాక**

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు సొంత పార్టీ నేతల మధ్య విభేదాలు.. కుమ్ములాటలు.. క్రమశిక్షణ లోపం. మరోవైపు బలమైన నేత సారథ్యంలో దూసుకెళ్తున్న అధికార పార్టీ. ఇటువంటి ప్రతికూల పరిస్థితుల్లో రాష్ట్ర కాంగ్రెస్‌ను గాడిలో పెట్టేందుకంటూ అధిష్ఠానం రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా రామచంద్ర కుంతియాను నియమించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంతో తలపడే సత్తా సంగతేమోగానీ.. కనీసం పార్టీనైనా దారిలో పెట్టగలరా? అనే సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. కొంత కాలంగా రాష్ట్ర వ్యవహారాల పరిశీలకునిగా కుంతియా పని తీరు చూసిన నేతలు పలువురు ఆయన సమర్థతపై పెదవి విరుస్తున్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి హోదాలో ఉండి, ఓ రాష్ట్రానికి పదేళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న దిగ్విజయ్ సింగ్ లాంటి ఇన్‌చార్జే వారిని అదుపులో పెట్టలేకపోయారని, క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని కూడా చెప్పలేకపోయారని, ఇపుడు కుంతియా మాత్రం ఏం చేయగలుగుతారని సందేహం వ్యక్తం చేశారు. కాగా, ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు టీపీసీసీ కార్యవర్గ సమావేశం, సోమవారం ఉదయం 11 గంటలకు టీపీసీసీ అనుబంధ సంఘాల భేటీ నిర్వహిస్తున్నట్లు గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.



అవార్డు అందుకుంటున్న టీఎస్‌ఆర్టీసీ అధికారులు

ఆర్టీసీ 'వజ్ర'కు ఎక్సలెన్సీ అవార్డు

హైదరాబాద్, ఆగస్ట్ 11 (ఆంధ్రజ్యోతి): 'ఇంటి సమీపంలోనే బస్సు సర్వీసు' పేరుతో తెలంగాణ ఆర్టీసీ నిర్వహిస్తున్న 'వజ్ర' సర్వీసులకు అతి తక్కువ వ్యవధిలోనే పురస్కారం దక్కింది. ప్రయాణికులకు అందిస్తున్న సేవలను గుర్తించిన కేంద్ర రహదారులు, ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ తెలంగాణ ఆర్టీసీకి 'నేషనల్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఎక్సలెన్సీ' అవార్డును అందించింది.

• దివ్యాంగులకు.. ఇక 5% రిజర్వేషన్

హైదరాబాద్, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు అమలవుతున్న సంక్షేమ పథకాల రిజర్వేషన్‌ను మూడు శాతం నుంచి ఐదు శాతానికి పెంచుతూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

• ఐసెట్ చివరి దశ సీట్లు కేటాయింపు

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో చివరి దశ సీట్లు శుక్రవారం కేటాయించినట్లు కౌన్సెలింగ్ క్యాంప్ ఆఫీసర్ బి.శ్రీనివాస్ వెల్లడించారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 19వ తేదీలోగా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి, 21వ తేదీలోగా సంబంధిత కాలేజీలో చేరాలని శ్రీనివాస్ తెలిపారు.

• తగ్గిన జీపీఎఫ్ వడ్డీ రేటు

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జీపీఎఫ్ (ఉద్యోగుల భవిష్యనిధి)పై ఇచ్చే వడ్డీని ప్రభుత్వం తగ్గించింది. తొలి త్రైమాసికానికి సంబంధించి 7.9 శాతం వడ్డీ మాత్రమే చెల్లించగా, రెండో త్రైమాసికంలో వడ్డీని 0.1శాతం తగ్గించి, 7.8 శాతం చెల్లించనుంది.

• 17న ఓపెన్ స్కూల్ అడ్మిషన్ నోటిఫికేషన్

హైదరాబాద్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలో ప్రవేశాలకు ఈనెల 17న నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. టెన్త్, ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరాలని భావించే విద్యార్థులు సెప్టెంబరు 4వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

• విదేశీ విద్యానిధికి సెప్టెంబరు 30 గడువు

హైదరాబాద్: మహాత్మ జ్యోతిబా పూలే బీసీ ఓవర్సీస్ విద్యా నిధి పథకం కోసం బీసీ విద్యార్థులు 15నుంచి సెప్టెంబరు 30 వరకు దరఖాస్తులు సమర్పించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ సూచించింది.

• డీసెట్‌లో 7119 మందికి సీట్లు

హైదరాబాద్: డీసెట్-2017 అడ్మిషన్ కౌన్సెలింగ్‌లో 7119 మందికి సీట్లు కేటాయించినట్లు కన్వీనర్ బి.శేషుకుమారి వెల్లడించారు.

• కంపల్సరీ సర్వీసు వైద్యుల జీతాలు పెంపు

హైదరాబాద్: పీజీ వైద్య విద్య పూర్తి చేసి, ఏడాది పాటు కంపల్సరీ ప్రభుత్వ సర్వీసులో చేరిన వైద్యుల జీతాలు 15 శాతం పెంచారు.

కేసీఆర్ ముఖ్యమంత్రా? ఇంజనీరా?

- **ప్రాజెక్టులను ఇష్టారాజ్యంగా రీడిజైన్ చేస్తున్నారు**
- **త్వరలో తెలంగాణ ఆత్మగౌరవ పాదయాత్ర: భట్టి**
- **వైఫల్యాలను కప్పిపుచ్చేందుకే 'పునరుజ్జీవం': జీవన్‌రెడ్డి**




(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): సీఎం కేసీఆర్ తనకు తోచినట్లు ప్రాజెక్టులకు రీడిజైనింగ్ చేస్తున్నారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క ఆక్షేపించారు. ప్రాజెక్టులను డిజైన్ చేయాల్సింది నిపుణులైన ఇంజనీర్లు అని, ముఖ్యమంత్రులు ఇష్టారాజ్యంగా చేసేది కాదన్నారు. కేసీఆర్ రీడిజైన్ వల్ల రాష్ట్ర ఖజానాపై భారీ భారం పడుతుందన్నారు. భట్టి శుక్రవారం నాడిక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్సారెస్పీ విషయంలో టీఆర్ఎస్ చేసిందేమీ లేదని, ఎస్సారెస్పీకి ప్రారంభోత్సవం చేసినప్పుడు కూడా కాంగ్రెస్ ఇంత హడావిడి చేయలేదన్నారు. రాష్ట్రంలో ఆత్మగౌరవానికి తీవ్ర విఘాతం కలుగుతోందని, ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు త్వరలో ఆత్మగౌరవ యాత్ర చేపడతానన్నారు. కాగా, సీఎం కేసీఆర్ తన పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకానికి శంకుస్థాపన చేశారని సీఎల్పీ ఉపనేత టి.జీవన్‌రెడ్డి కరీంనగర్‌లో ఆరోపించారు. ఎస్సారెస్పీ నిర్మించాక 32 ఏళ్లలో ఆయకట్టు కింద ఏ ఒక్క పంటకూ నీరివ్వని సందర్భం లేదన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఎస్సారెస్పీ వట్టిపోయిందనే భావన కల్పించడం సరికాదన్నారు. కాగా, ఎస్సారెస్పీ పునరుజ్జీవానికి కేటాయించిన రూ.2 వేల కోట్లలో రూ.250 కోట్లు కేసీఆర్ కుటుంబానికి వాటాగా పోతోందని ఎమ్మెల్యే జి.చిన్నారెడ్డి వనపర్తిలో ఆరోపించారు. అందుకే బడ్జెట్‌లో ప్రస్తావించకుండానే నేరుగా నిధులు కేటాయించారన్నారు. దక్షిణ తెలంగాణపై ముఖ్యమంత్రి సవతితల్లి ప్రేమ చూపిస్తున్నారన్నారు. మరోవైపు రాష్ట్రంలో సీఎం కేసీఆర్ గ్రాఫ్ తగ్గుతోందనడానికి పోచంపాడు సభ నిదర్శనమని ఏఐసీసీ కార్యదర్శి మధుయాష్కీ హైదరాబాద్‌లో అన్నారు. డబ్బులిచ్చి జనాన్ని తరలించారన్నారు. పూర్తయిన ఇంటికి సున్నం వేసి ఇల్లంతా తానే కట్టినట్టు ప్రచారం చేసుకుంటున్న చందంగా.. తాము కట్టిన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు చేస్తూ, కేసీఆర్ తానే నిర్మించినట్టు చెప్పుకోవడం సిగ్గు చేటని అన్నారు.

కేటీఆరే తెలంగాణకు అసలైన టూరిస్టు

కాంగ్రెస్ నాయకులను టూరిస్టులన్న మంత్రి కేటీఆరే అసలైన టూరిస్టని, ఆయన అమెరికా, లండన్ నుంచి టూరిస్టుగా తెలంగాణకు వచ్చారని మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. నేరెళ్లలో పరిస్థితి చూస్తే ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా? దొరల రాజ్యంలో ఉన్నామా? అనే అనుమానం కలుగుతోందన్నారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న నేరెళ్ల బాధితులను కేటీఆర్ దొంగచాటుగా వెళ్లి పరామర్శించాల్సిన అవసరం ఏమొచ్చిందని వీహెచ్ ప్రశ్నించారు. నేరెళ్ల బాధితులకు న్యాయం జరగకుంటే తాను అక్కడే ఆమరణ దీక్ష చేపడతానని హెచ్చరించారు. ఇక నిజామాబాద్‌లో నిర్వహించింది ఎస్సారెస్పీ పునరుజ్జీవ సభ కాదని, రోజు రోజుకు తగ్గుతున్న రాజకీయ ప్రాబల్యాన్ని కాపాడుకునేందుకు సీఎం కేసీఆర్ నిర్వహించిన సభ అని టీపీసీసీ ప్రధానకార్యదర్శి దాసోజు శ్రావణ్‌కుమార్ అన్నారు. ప్రాజెక్టులు కట్టిన కాంగ్రెస్‌పై కేసీఆర్ అవాకులు చవాకులు సమంజసం కాదన్నారు. న్యాయ వ్యవస్థను సైతం అపహాస్యం చేసేలా మాట్లాడుతున్న సీఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

హైకోర్టు సమాచారం



తల్లిదండ్రుల విజ్ఞప్తి వినండి

• స్కూల్ తరలింపుపై అధికారులకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా బ్రాహ్మణపల్లిలో జడ్పీహెచ్ఎస్ స్కూల్ తరలింపుపై విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోవాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. అన్ని అంశాలను పరిశీలించి ఒక నిర్ణయానికి రావాలని న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరాం శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. తమ గ్రామంలోని పాఠశాలను అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌కు కేటాయించి...తమ పిల్లలను మరో గ్రామంలోని పాఠశాలకు తరలించడాన్ని సవాల్ చేస్తూ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ రమేశ్ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి విచారించారు. స్వగ్రామంలో ఉన్న స్కూల్‌ను మరో రెసిడెన్షియల్ స్కూల్‌కు కేటాయించడంతో 3 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి ఉందని పిటిషనర్ తరపు న్యాయవాది అన్నారు.

వారిని కొనసాగించండి: హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు కమిషన్ కార్యాలయంలోని ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని విధుల్లో కొనసాగించాలని హైకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. వారికి జీతభత్యాలను ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు జనాభా ప్రాతిపదికన 58:42 శాతం నిష్పత్తిలో చెల్లించాలని ఆదేశించింది. ఔట్ సోర్సింగ్ సిబ్బందిని ఈనెల 16నుంచి విధుల్లోకి తీసుకోవాలని తేల్చి చెప్పింది. ఈ మేరకు హైకోర్టు ఏసీజే జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం ఆదేశాలు జారీచేసింది. సమాచార హక్కు కమిషన్ ఏర్పాటు చేయని కారణంగా వారిని ఉద్యోగం నుంచి తొలగించడం సరైన విధానం కాదని అభిప్రాయపడింది. తెలంగాణ స్థానికత ఉన్న ఉద్యోగులను సమాచార హక్కు కమిషన్ కార్యాలయంలో కొనసాగిస్తున్న విధంగా తమను కొనసాగించాలని కోరుతూ ఆ కార్యాలయంలో పనిచేస్తున్న పలువురు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది హైకోర్టును ఆశ్రయించారు.

తుది తీర్పునకు లోబడే సీట్ల భర్తీ: హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్, కాళోజి వర్సిటీల్లో భర్తీ చేసిన సూపర్ స్పెషాలిటీ కోర్సుల సీట్లు తమ తీర్పుకు లోబడి ఉంటాయని ఉమ్మడి హైకోర్టు స్పష్టం చేసింది. తెలుగు అభ్యర్థులతోనే ఆ సీట్లను భర్తీ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ టి.రజనిల ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. ఎన్టీఆర్, కాళోజి ఆరోగ్య విశ్వవిద్యాలయాల్లో సూపర్ స్పెషాలిటీ కోర్సులకు చెందిన సీట్లను జాతీయ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలంటూ ఢిల్లీలోని హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్, కేంద్ర, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేయడాన్ని పీజీ వైద్య విద్యార్థి బి.సతీష్‌కుమార్‌తో పాటు పలువురు అభ్యర్థులు సవాల్ చేశారు. ఈ మేరకు స్పందించిన ధర్మాసనం.. కౌంటర్లు దాఖలు చేయాలని రెండు వర్సిటీలను ఆదేశిస్తూ విచారణను 16కు వాయిదా వేసింది.

మాజీ ఐఏఎస్ శామ్ బాబ్‌కు ఊరట

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజోతి): వైసీపీ అధినేత వైఎస్ జగన్ కేసులో నిందితునిగా ఉన్న మాజీ ఐఏఎస్ అధికారి బుసి శామ్ బాబ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. లేపాక్షి నాలెడ్జి హబ్‌కు భూకేటాయింపులకు సంబంధించిన వ్యవహారంలో సీబీఐ ఆయనపై దాఖలు చేసిన చార్జిషీట్‌లో కేసును హైకోర్టు కొట్టివేసింది. ఈ మేరకు జస్టిస్ ఎం.సీతారామ్మూర్తి శుక్రవారం తీర్పునిచ్చారు.

కోదండ యాత్ర ఉద్రిక్తం

కామారెడ్డిలో అమరుల స్ఫూర్తియాత్ర సభ వద్ద ఘర్షణ

- **అడ్డుకున్న టీఆర్ఎస్ కార్యకర్తలు.. టెంటు కూల్చివేత**
- **ప్రతిఘటించిన జేఏసీ కార్యకర్తలు.. ఇరువర్గాల తోపులాట**
- **బస్వాపూర్ వద్దనే కోదండరాంను అడ్డుకున్న టీఆర్ఎస్ నేతలు**
- **టీజేఏసీ చైర్మన్ అరెస్టు.. హైదరాబాద్‌కు తరలింపు**



టీజేఏసీ స్ఫూర్తియాత్ర సభాస్థలంపైకి కుర్చీలు విసిరేస్తున్న టీఆర్ఎస్ కార్యకర్తలు

కామారెడ్డి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): టీజేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం చేపట్టిన అమరుల స్ఫూర్తియాత్ర రణరంగంగా మారింది. శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన స్ఫూర్తియాత్ర సభకు కోదండరాం రాక ముందే సభను అడ్డుకునేందుకు కొందరు టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు యత్నించారు. ఈ క్రమంలో టీఆర్ఎస్ కార్యకర్తలకు, జేఏసీ కార్యకర్తలకు మధ్య ఘర్షణ జరిగి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. మరోవైపు సభలో పాల్గొనేందుకు వస్తున్న కోదండరాంను భిక్కనూరులోని బస్వాపూర్ వద్దనే టీర్ఎస్ నాయకులు అడ్డుకున్నారు. స్ఫూర్తియాత్ర సభను కామారెడ్డి మునిసిపాలిటీ కార్యాలయం ఎదుట అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించ తలపెట్టగా.. అక్కడికి టీఆర్ఎస్ కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరుకున్నారు. ఇరు వర్గాలు పోటాపోటీ నినాదాలు చేశారు. అయితే విద్యార్థి సంఘాల నాయకులు తమ ప్రసంగంలో 'తెలంగాణ ద్రోహులెవరో ప్రజలకు తెలుసు' అని అనడంతో టీఆర్ఎస్ వర్గీయులు సభావేదిక పైకి దూసుకొచ్చేందుకు యత్నించారు. వారిని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించినా.. నిలువరించలేకపోయారు. దీంతో వారు సభ నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన సౌండ్ బాక్సులను, టెంట్‌ను కూల్చివేసి, ఫ్లెక్సీలను చించివేశారు. కుర్చీలతో, కోడిగుడ్లు, టమాటాలతో విద్యార్థులపై దాడి చేశారు. తర్వాత ఇరువర్గాల మధ్య తోపులాట, దాడి, ప్రతిదాడి జరిగాయి. ఈ ఘర్షణలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. వారిని పోలీసులు కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కాగా కొన్ని కోడిగుడ్లు, టమాటాలు అంబేద్కర్ విగ్రహంపై పడ్డాయి. దాడిని నిరసిస్తూ జేఏసీ, విద్యార్థి సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహం ముందు బైఠాయించారు. దీంతో మరోసారి ఘర్షణ చోటుచేసుకుంది. చివరికి పోలీసులు విద్యార్థి సంఘాల నేతలు, జేఏసీ నేతలను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. మరోవైపు కామారెడ్డికి వస్తున్న కోదండరాంను భిక్కనూరులోని బస్వాపూర్ వద్దనే టీర్ఎస్ నాయకులు అడ్డుకున్నారు. జేఏసీ నాయకులు, టీఆర్ఎస్ వర్గీయుల వద్ద పోటాపోటీగా నినాదాలు చేసుకున్నారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో కోదండరాంను, ఇతర జేఏసీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి భిక్కనూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలోని జేఏసీ నాయకులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకోవడంతో మరోసారి ఉద్రిక్తత నెలకొంది. దీంతో జిల్లా ఎస్పీ శ్వేతారెడ్డి భిక్కనూరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని వారిని అక్కడినుంచి పోలీస్ వాహనాల్లో హైదరాబాద్‌కు తరలించారు.



కోదండరాంను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఉద్యమ వ్యతిరేకులే దాడి చేశారు

- **టీఆర్ఎస్.. తెలంగాణ ఉద్యమ వ్యతిరేకుల వేదిక**
- **స్ఫూర్తి యాత్రను అడ్డుకోవడం అప్రజాస్వామికం**
- **యాత్రను తిరిగి కొనసాగిస్తాం: కోదండరాం**

హైదరాబాద్/కామారెడ్డి/రాంగోపాల్‌పేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ వ్యతిరేకుల వేదికగా టీఆర్ఎస్ మారిపోయిందని, ఉద్యమ వ్యతిరేకులే అమరవీరుల స్ఫూర్తియాత్రను అడ్డుకొని దాడి చేశారని టీజేఏసీ చైర్మన్ కోదండరాం ఆరోపించారు. నాడు ఉద్యమకారులపై దాడులు చేసినవారే నేడు టీఆర్ఎస్‌లో చేరి దాడులు చేస్తున్నారని అన్నారు. యాత్రను అడ్డుకోవటం ద్వారా ప్రభుత్వం తన బలహీనతను బయటపెట్టుకుందని, ప్రతిష్ఠను దిగజార్చుకుందని వ్యాఖ్యానించారు. రాళ్లు, రప్పలతో దాడిచేసినా సంయమనం పాటించామని, యాత్రను మళ్లీ అడ్డుకుంటే కఠినమైన కార్యాచరణతో ముందుకుపోతామని ప్రకటించారు. ఎంత నిర్బంధం విధించినా.. శనివారం యాత్రను కచ్చితంగా తిరిగి ప్రారంభిస్తామన్నారు. శుక్రవారం ఆయన పలు సందర్భాల్లో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలను ఢిల్లీ వెళ్లి అన్ని రాజకీయ పక్షాలకు వివరిస్తామన్నారు. కామారెడ్డి జిల్లాకు చెందిన మంత్రికి మంజీర ఇసుక మాఫియాతో సంబంధాలున్నాయని, ఇక్కడి ఎమ్మెల్యేలు భూ దందాలు చేస్తూ కాంట్రాక్టుల పేరిట కమీషన్లు దండుకుంటున్నారని ఆరోపించారు. కాగా టీజేఏసీ నిర్వహిస్తున్న అమరుల స్ఫూర్తియాత్రను టీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకోవడాన్ని సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీర భద్రం, చాడ వెంకటరెడ్డి వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు.

కొత్తగా 54 సీసీఐ కొనుగోలు కేంద్రాలు

• 500 జనరిక్ మందుల దుకాణాలు : లక్ష్మణ్



న్యూఢిల్లీ, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోలు కోసం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఆధ్వర్యంలో కొత్తగా 54 కొనుగోలు కేంద్రాలు తెలంగాణలో ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర జౌళిశాఖ మంత్రి స్మృతి ఇరానీ పేర్కొన్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ తెలిపారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. తెలంగాణ విమోచన దినాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్న నేపథ్యంలో తాము భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు యోచిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సభకు వస్తానని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. సెప్టెంబరు రెండో వారంలో ఉజ్వల పథకాన్ని రాష్ట్రంలో ప్రారంభించనున్నట్లు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారన్నారు. హైదరాబాద్‌లో ప్రీపెయిడ్ గ్యాస్ సిస్టమ్ ప్రాజెక్టుకు అదనంగా రూ.500 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 500 జనరిక్ మందుల షాపుల ఏర్పాటుకు కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని వెల్లడించారు. ఫసల్ బీమాలో రైతులకు మేలు జరిగేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర వ్యవసాయ మంత్రి తెలిపారని చెప్పారు. పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు, కొత్తలైన్లు, కాజీపేట వర్క్‌షాపు, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధి వంటి అంశాలను రైల్వేశాఖ మంత్రి సురేశ్‌ప్రభుకు విన్నవించామని ఆయన తెలిపారు.

కమీషన్ల కోసమే పునరుజ్జీవం: రమణ

• ప్రాజెక్టుల అంచనాల పెంపు తగదు: రేవంత్



హైదరాబాద్/వరంగల్ అర్బన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల రీడిజైనింగ్, పునరుజ్జీవాన్ని టీఆర్ఎస్ ప్రభుత్వం కమీషన్ల కోసమే చేపడుతోందని టీడీపీ-టీఎస్ అధ్యక్షుడు ఎల్.రమణ ఆరోపించారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. అన్ని ప్రాజెక్టులపై తక్షణం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కంతనపల్లి, దేవాదుల తదుపరి దశ ప్రాజెక్టులను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. నేరెళ్ల ఘటనలో ఎస్పీ, డీఎస్పీ, సీఐలను సస్పెండ్ చేసి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మోత్కుపల్లి నర్సింహులు డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల రీడిజైన్ పేరిట అంచనాలు ఇబ్బడిముబ్బడిగా పెంచడం తగదని టీడీపీ-టీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మహారాష్ట్రతో ఒప్పందాన్ని రద్దు చేసి 1800 ఎకరాల భూకేటాయింపు సాధన కోసం ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని సీఎంకు బహిరంగ లేఖ రాశారు. అది ఎస్సారెస్పీ పునరుజ్జీవం కాదని, టీఆర్ఎస్ పునరుజ్జీవ పథకమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రేవూరి ప్రకాశ్ రెడ్డి హన్మకొండలో విమర్శించారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం





మధురమైన స్నేహమంత ప్రీతి... అటుకులంటే ఆయనకు. 'వెన్న దొంగ' అని పిలిచినా ఫర్వాలేదనేంత ఇష్టం వెన్న ముద్దలంటే. ఇన్ని అటుకులు, అంత బెల్లం ముక్క, మరికాస్త వెన్నముద్ద పెడితే చాలు చిలిపి కన్నయ్య ఇట్టే ప్రసన్నం అయిపోతాడు. రెండు రోజుల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి పండగ. అటుకులు, వెన్న, బెల్లం, పచ్చి శెనగపప్పులతో కన్నయ్యకు రకరకాల వంటకాల నివేదన..

గోపాల గోవిందుడు



శెనగపప్పు పాయసం

కావలసినవి:
పచ్చి శెనగపప్పు, పాలు - ఒక్కోటి ముప్పావు కప్పు చొప్పున, బెల్లం పొడి - ఒక కప్పు, ఎండుకొబ్బరి ముక్కలు - ఒక టేబుల్ స్పూన్, యాలకుల రెబ్బలు - నాలుగు (పొడి చేసి), జీడిపప్పులు, ఎండుద్రాక్షలు - అవసరమైనన్ని, నెయ్యి - రెండు టేబుల్ స్పూన్లు.

తయారీ:
- పాన్‌లో ఒక టీస్పూన్ నూనె వేడి చేసి శెనగ పప్పుని మూడు నిమిషాలు వేగించాలి.
- తరువాత వేగించిన పప్పులో ఒకటిన్నర కప్పుల నీళ్లు పోసి ప్రెషర్ కుక్కర్‌లో పెట్టి నాలుగు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. స్టీమ్ వచ్చాక పప్పుని మరీ మెత్తగా కాకుండా మెదపాలి.
- ఒక గిన్నెలో బెల్లం వేసి, పావు కప్పు నీళ్లు పోసి బెల్లం కరిగే వరకు వేడిచేయాలి.
- పప్పు, యాలకుల పొడి వేసి ఐదు నిమిషాలు లేదా మిశ్రమం చిక్కబడేవరకు ఉంచాలి.
- తరువాత స్టవ్ ఆపేసి పాలు పోసి బాగా కలపాలి.
- మిగిలిన నెయ్యిని వేడిచేసి అందులో కొబ్బరి ముక్కలు, జీడిపప్పు, ఎండు ద్రాక్షలు వేసి బంగారు రంగు వచ్చే వరకు వేగించాలి. దీన్ని పాయసం మీద పోసి కలపాలి.

అటుకులు, పల్లీల లడ్డు

కావలసినవి:
అటుకులు - ఒక కప్పు, పంచదార - అరకప్పు, పల్లీగింజలు, నెయ్యి - ఒక్కోటి పావు కప్పు చొప్పున, వంటల్లో వాడే కర్పూరం - చిటికెడు, యాలకుల పొడి - ముప్పావు టీస్పూన్, జీడిపప్పులు - ఐదు.

తయారీ:
- అటుకుల్ని నూనె వేయకుండా సన్నటి మంట మీద బంగారు రంగు వచ్చే వరకు వేగించి, చల్లార్చాలి.
- పల్లీగింజలను కూడా గోధుమ రంగు వచ్చే వరకు నూనె వేయకుండా వేగించి చల్లార్చాలి. పొట్టు తీసేసి కచ్చాపచ్చాగా గ్రైండ్ చేయాలి.
- తరువాత వేగించిన అటుకుల్ని మెత్తటి పిండిలా గ్రైండ్ చేయాలి.
- పంచదారను కూడా అలానే మెత్తగా గ్రైండ్ చేయాలి.
- అటుకులు, పంచదార, పల్లీగింజలు, యాలకుల పొడిని వెడల్పాటి గిన్నెలో వేసి అందులో కర్పూరం పొడి వేసి కలపాలి.
- జీడిపప్పుని చిన్న చిన్న పలుకులుగా చేయాలి. తరువాత నెయ్యి వేడిచేసి ఆ పలుకుల్ని బంగారు రంగు వచ్చే వరకు వేగించాలి.
- వేడిచేసిన నెయ్యిని అటుకుల మిశ్రమంలో పోసి స్పూన్‌తో కలపాలి.
- మిశ్రమం చేతితో పట్టుకునే వేడి ఉన్నప్పుడు లడ్డూలు చేయాలి. గాలి చొరబడని డబ్బాలో ఉంచితే రెండు వారాల వరకు పాడుకావు.



అటుకుల దద్ధోజనం

కావలసినవి:
మందపాటి అటుకులు - ఒక కప్పు, పెరుగు - ఒకటిన్నర కప్పులు, మరిగించి, చల్లార్చిన పాలు - పావు కప్పు, పచ్చిమిర్చి - రెండు (సన్నగా తరిగి), అల్లం తరుగు - ఒకటిన్నర టీస్పూన్లు, పచ్చిశెనగపప్పు, ఆవాలు - ముప్పావు టీస్పూన్, మినపప్పు - పావు టీస్పూన్, కరివేపాకులు - కొన్ని, ఇంగువ - చిటికెడు, నూనె - ఒక టేబుల్ స్పూన్, ఎండుమిర్చి - రెండు, ఉప్పు - రుచికి సరిపడా.

తయారీ:
- అటుకులు మెత్తబడే వరకు నీళ్లతో కడగాలి. తరువాత నీళ్లు వంపేసి కొన్ని నిమిషాలు పక్కన పెట్టాలి.
- ఒక గిన్నెలో అటుకులు, పాలు, పెరుగు, ఉప్పు వేసి కలపాలి. కావాలంటే మరి కొంచెం పెరుగు కలపొచ్చు.
- పాన్‌లో నూనె వేడిచేసి ఆవాలు, పచ్చిశెనగపప్పు, మినపప్పులతో తాలింపు వేయాలి.
- తాలింపు గింజలు చిటపటమంటున్నప్పుడు పచ్చిమిర్చి, అల్లం, కరివేపాకు, ఎండుమిర్చి, ఇంగువ వేసి కొంచెంసేపు వేగించాలి.
- ఈ తాలింపును అటుకుల మిశ్రమం మీద పోసి కలిపితే అటుకుల దద్ధోజనం సిద్ధం.





తీపి అటుకులు

కావలసినవి:
అటుకులు - ఒక కప్పు, బెల్లం పొడి - ముప్పావు కప్పు, కొబ్బరి తురుము - ఒకటిన్నర టేబుల్ స్పూన్లు, యాలకుల పొడి - అరటీస్పూన్, నెయ్యి - రెండు టీస్పూన్లు, జీడిపప్పు - కొద్దిగా.

తయారీ:
- అటుకుల్ని కడిగి వడకట్టి పక్కన పెట్టాలి.
- పాన్‌లో నెయ్యి వేడిచేసి జీడిపప్పు పలుకుల్ని బంగారు రంగు వచ్చే వరకు వేగించాలి.
- పాన్‌లో బెల్లం పొడి వేసి నీళ్లు పోసి తీగ పాకం వచ్చేలా ఉడికించాలి.
- స్టవ్ మంట ఆపేసి యాలకుల పొడి, కొబ్బరి, అటుకుల మిశ్రమాన్ని వేసి కలపాలి. వేగించిన జీడిపప్పులతో అలంకరించాలి.

సౌజన్యం: www.blendwithspices.com

అటుకుల పులిహోర

కావలసినవి:
మందపాటి అటుకులు - ఒక కప్పు, చింతపండు - చిన్న నిమ్మకాయంత సైజ్, పల్లీగింజలు, జీడిపప్పులు - ఒక్కోటి రెండు టీస్పూన్ల చొప్పున, ఆవాలు, శెనగపప్పు - ఒక్కోటి అర టీస్పూన్ చొప్పున, పసుపు - పావు టీస్పూన్, నూనె - రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు - రుచికి సరిపడా, పచ్చి మిర్చి - మూడు, ఎండుమిర్చి - రెండు, కరివేపాకులు - కొన్ని, ఇంగువ - చిటికెడు.

తయారీ:
- చింతపండును నీళ్లలో పదినిమిషాలు నానబెట్టి రసం పిండాలి.
- అటుకుల్ని శుభ్రంగా కడిగి నీళ్లలో రెండు నిమిషాలు నానబెట్టాలి. తరువాత నీళ్లను వడకట్టి పక్కన పెట్టాలి.
- పాన్‌లో నూనె వేడిచేసి ఆవాలు, శెనగపప్పు, మినపప్పు, పల్లీగింజలు వేసి వేగించాలి. అవి చిటపటమంటున్నప్పుడు ఇంగువ, కరివేపాకులు, పచ్చిమిర్చి తరుగు, ఎండుమిర్చి, జీడిపప్పు వేసి కొంచెంసేపు వేగించాలి.
- తరువాత చింతపండు మిశ్రమం, ఉప్పు, పసుపు వేసి గరిటెతో కలిపి, మూతపెట్టి ఉడికించాలి.
- చింతపండు మిశ్రమం చిక్కగా అయ్యాక నానబెట్టిన అటుకుల్ని అందులో వేసి కలపాలి.
- ఓ మాదిరి మంట మీద రెండు నిమిషాలు ఉడికించాక స్టవ్ ఆపేస్తే అటుకుల పులిహోర రెడీ.



వెన్న ఉండలు



కావలసినవి:
మైదా, పంచదార - ఒక్కో కప్పు చొప్పున, బియ్యప్పిండి - పావు కప్పు, వెన్న - 25 గ్రాములు, నూనె - వేగించడానికి సరిపడా, వంటసోడా - చిటికెడు.

తయారీ:
- మైదా, బియ్యప్పిండి, వెన్న, వంటసోడాలను ఒక గిన్నెలో వేయాలి. అందులో గోరువెచ్చని నీళ్లు పోసి పిండిముద్దలా చేయాలి. దాని పైన తడి బట్ట వేసి ఒక గంటసేపు పక్కన పెట్టాలి.
- ఆ తరువాత చిన్న చిన్న ఉండలు చేసి వాటి మీద కూడా తడి బట్ట వేసి ఐదు నిమిషాలు ఉంచాలి.
- పాన్‌లో నూనె వేడి చేశాక వెన్న ఉండల్ని సన్నటి మంట మీద లేత గోధుమరంగుకి వచ్చే వరకు వేగించాలి.
- వేగిన ఉండల్ని చల్లారనివ్వాలి. ఈ లోపు పంచదార మునిగే అన్ని నీళ్లు పోసి తీగపాకం వచ్చేంతవరకు వేడిచేయాలి.
- పాకం రెడీ అయ్యిందా లేదా తెలుసుకునేందుకు ఒక ప్లేట్‌లో నీళ్లు పోసి అందులో ఒక చుక్క పాకం వేయాలి. అది కరిగిపోకుండా ఉంటే పాకం రెడీ అయినట్టు.
- అప్పుడు స్టవ్ ఆపేసి వేగించిన వెన్న ఉండల్ని పంచదార పాకంలో వేసి గరిటెతో కొంచెం సేపటి వరకు ఆపకుండా కలపాలి.

మళ్లీ మొదలుపెడుతున్నారా

కొంతకాలం వ్యాయామాలు ఆపేసి మళ్లీ తిరిగి మొదలెట్టాలనుకునే వాళ్లు మనలో చాలా మంది ఉంటారు. ఉదాహరణకు గుండె ఆపరేషన్ జరిగిన తర్వాత... అలాగే కేన్సర్‌కు చికిత్స తీసుకున్నప్పుడు...లాంటి సందర్భాలలో తిరిగి వ్యాయామాలు చేయడం ఎంతవరకూ మంచిది? అలా వ్యాయామాలు చేయడం వల్ల ఏవైనా రిస్కులు ఎదురవుతాయా? అలాంటి సందర్భాలలో ఆటలు కూడా ఆడొచ్చా? లాంటి సందేహాలు చాలామందిలో తలెత్తుతుంటాయి. వాటి గురించి...

- కొన్నాళ్లు వ్యాయామాలు చేయడంలో/ ఆడడంలో గ్యాప్ వస్తే తప్పనిసరిగా ఎఫెర్ట్ టెస్టు, మెడికల్ చెకప్‌లు చేయించుకోవాలి. అయితే గుండె జబ్బుల సమస్య లేని 40 ఏళ్ల లోపు వారికి ఈ పరీక్షలు తప్పనిసరికాదు కానీ 50 ఏళ్లు నిండిన ఆడవాళ్లకు, 45 ఏళ్లు వచ్చిన మగవాళ్లకు మాత్రం ఇవి చాలా ముఖ్యం.
- ఉష్ణోగ్రత బాగా ఉన్న రోజుల్లో కన్నా చల్లగా ఉన్న రోజుల్లోనే రన్నింగ్ చేస్తే మంచిదనే అభిప్రాయం ఉంది. ఇది తప్పు, రైటు కూడా. అదెలాగంటారా? ఉష్ణోగ్రతలను బట్టి ఇది ఆధారపడి ఉంటుంది. ఐదు డిగ్రీల సెంటీగ్రేడు ఉష్ణోగ్రత ఉన్నప్పుడు తీవ్రంగా గుండెకు సంబంధించిన వ్యాయామాలు చేయడం ఎలా మంచిది కాదో అలాగే 30 డిగ్రీల సెంటిగ్రేడు ఉష్ణోగ్రత ఉన్నప్పుడు వ్యాయామాలు చేయడం కూడా అంతే మంచిది కాదు. గాలిలో కాలుష్యం ఎక్కువగా ఉన్న రోజుల్లో కూడా రన్నింగ్ చేయకుండా ఉంటే ఉత్తమం.



- జ్వరంతో ఉన్నప్పుడు వ్యాయామాలకు దూరంగా ఉండడం మంచిది. జ్వరం తగ్గేందుకు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి. ఫ్లూ వైరస్ లాంటివి వచ్చినపుడు వారం రోజులు వ్యాయామాలు చేయకుండా ఇంటిపట్టునే ఉండాలి.
- వ్యాయామాలు చేసేటప్పుడు నీరు బాగా తాగడం మంచిది. వ్యాయామాలు చేసేటప్పుడు ప్రతి అరగంటకు ఒకసారి ఆగి నాలుగు గుక్కల మంచినీళ్లు తాగాలి. ఇలా చేయడం వల్ల శరీరంలోని కండరాల నొప్పులు కూడా బాగా తగ్గుతాయి.

గుడ్ మార్నింగ్



ఒక చిరునవ్వు.. ఎందరినో స్నేహితులను చేస్తుంది! క్షణికమైన కోపం.. ఎందరినో శత్రువులుగా మారుస్తుంది! విలువైన జీవితాన్ని చిరునవ్వులతో ఆస్వాదించండి.

తెలుసా!

భూపొరలే ఓవెన్

ఐరోపా ఖండంలో ఒక అందమైన ద్వీపం ఐస్‌ల్యాండ్. అట్లాంటిక్ మహాసముద్రంలో ఉన్న ద్వీప దేశం ఇది. సంపన్న దేశం కూడా! పేరులో ఐస్ ఉన్నా.. ఈ ద్వీపం ఎప్పుడూ వేడితో రగిలిపోతూ ఉంటుంది. అగ్నిపర్వతాల పేలుళ్లకు ఐస్‌ల్యాండ్ పెట్టింది పేరు. ప్రపంచవ్యాప్తంగా జరిగిన అగ్నిపర్వతాల పేలుళ్లలో మూడో వంతు ఇక్కడ జరిగినవే. అందుకే ఐస్‌ల్యాండ్‌లోని భూపొరలు నిరంతరం సెగలు కక్కుతుంటాయి. అయితే ఈ భూతాపాన్ని ఇంధనంగా మలుచుకున్నారు ఐస్‌ల్యాండ్‌వాసులు. భూపొరల్లో ఉన్న వేడిని వంట చెరుకుగా ఉపయోగించుకుంటున్నారు. ఇక్కడి నేలలో ఏ వంట అయినా ఇట్టే అయిపోతుంది. వండాల్సిన పదార్థాలన్నీ ఒక పాత్రలో వేసి.. దానిపై మూత పెట్టి.. రెండు అడుగుల గోతి తవ్వి.. అందులో పాత్ర ఉంచి.. మట్టి కప్పేస్తే సరి. అరగంట తర్వాత.. తవ్వి చూస్తే ఘుమఘుమలు వచ్చేస్తాయి. ఐస్‌ల్యాండ్ వాసులు చాలామంది రోజూవారీ వంటకాలు కూడా ఈ విధంగానే వండుకుంటారట! అలా ప్రకృతి సిద్ధమైన మైక్రోవేవ్ ఓవెన్‌లో పాకయాగం చేస్తున్నారు వీళ్లు. ఇక్కడ భూపొరల్లో వండిన బ్రెడ్‌కు ప్రపంచవ్యాప్తంగా మంచి పేరుంది. వాల్కనో బ్రెడ్‌గా దీన్ని పిలుస్తుంటారు. ఈ ద్వీపాన్ని చూసేందుకు వచ్చిన పర్యాటకులు కూడా తమకు కావాల్సిన వంటకాలను భూమి పొరల్లో ప్రయోగాత్మకంగా వండుకొని సరదా తీర్చుకుంటుంటారు.



వెరైటీ

ట్రాఫిక్‌ను ఈదలేక!

ఓ మోస్తరు పట్టణాల నుంచి బడా బడా నగరాల వరకు రోజు రోజుకూ ట్రాఫిక్ పెరిగిపోతోంది. భారత్‌లోనే కాదు ప్రపంచదేశాలన్నీ ట్రాఫిక్ 'జామ్'ఝూటంలో చిక్కుకుంటున్నవే. ట్రాఫికర్ తప్పించడానికి ఆయా దేశాలు ఎప్పటికప్పుడూ కొత్త ప్రణాళికలు రచిస్తూనే ఉన్నాయి. వాటిని అమలుపరుస్తూనే ఉన్నాయి. అయినా ఫలితం అంతంత మాత్రమే! ఇక ట్రాఫిక్ బాధలు భరించలేనని అనుకున్న ఒక ఉద్యోగి మాత్రం వినూత్న మార్గాన్ని ఎంచుకున్నాడు. జర్మనీలోని మూంచి నగరానికి చెందిన బెంజమిన్ డేవిడ్ ఏకంగా నదిలో ఈదుతూ తను పని చేసే చోటికి చేరుకున్నాడు. మూంచీ నగరంలోని ఓ పార్క్‌లో పని చేస్తున్నాడు డేవిడ్. ట్రాఫిక్ కారణంగా రోజూ విధులకు ఆలస్యంగా హాజరవుతున్నాడు. ఇక లాభం లేదనుకున్నాడు. నగరంలో ప్రవహించే మునిచ్ నదిని నమ్ముకున్నాడు. ఆ నది పాయ డేవిడ్ ఇల్లు, అతను పని చేసే పార్క్ మీదుగా సాగిపోతుంది. రెండు కిలోమీటర్లు ఈదితే పార్క్‌కు చేరుకోవచ్చు. ఇంకేం ఆలోచించ లేదు. స్విమ్ సూట్ సిద్ధం చేసుకున్నాడు. తన వెంట తీసుకెళ్లే వస్తువులను ఒక వాటర్ ప్రూఫ్ బ్యాగ్‌లో వేసుకున్నాడు.. నదిలో దిగి ఈదడం మొదలుపెట్టాడు. ఇంటి నుంచి బయల్దేరిన పన్నెండు నిమిషాల్లో పార్క్‌కు చేరుకున్నాడు. వేసవి కావడంతో నీటిలో ప్రయాణం ఎంతో సుఖవంతంగా ఉందంటున్నాడు డేవిడ్. కొన్నాళ్ల పాటు ఇదే రూట్‌లో పార్క్‌కు వెళ్తానంటున్నాడు. సమయానికి పార్క్‌కు చేరుకోవడంతో పాటు స్విమ్మింగ్ వల్ల తన ఫిట్‌నెస్ కూడా మెరుగు పడుతుందని చెప్పుకొచ్చాడు.



Career



జీవితంలో మర్చిపోలేని సందర్భాల్లో కెరీర్ ప్రారంభ దశ ఒకటి. ఎన్నో ఆశలు, మరెన్నో లక్ష్యాలతో ఉద్యోగ జీవితం ఆరంభమవుతుంది. భావి జీవితానికి ఈ దశ పునాదిగా నిలుస్తుంది. అయితే ఉద్యోగంలో చేరిన కొత్తలో ఉత్సాహంతోపాటు కొంత ఆందోళన కూడా ఉంటుంది. అప్పటి వరకు పరిచయం లేని కొత్త వ్యక్తులతో కలిసి పనిచేయడం, ఎవరితో ఏ విధంగా ప్రవర్తించాలి అనే విషయంలో అవగాహన లేకపోవడం తదితర కారణాలతో ఉద్యోగంలో చేరిన కొత్తలో ఒక రకమైన నెర్వస్‌నెస్ క్రియేట్ అవుతుంది. ఇదే ఆందోళనకు దారి తీస్తుంది. కెరీర్ ఆరంభ దశలోని ఈ మానసిక సంసిద్ధత, ఆత్మవిశ్వాసం ద్వారా ఇటువంటి సందర్భాలను సులభంగానే అధిగమించవచ్చు. అందుకు ఉపకరించే ఐదు మార్గాలు..

తడబడకుండా తొలి అడుగులు

ఉద్యోగంలో చేరిన కొత్తలో ఎంత హుషారుగా అనిపిస్తుందో అంతే స్థాయిలో ఏదో తెలియని ఒక రకమైన ఆందోళన కూడా నెలకొని ఉంటుంది. వర్క్ ఎలా చేయాలి? ఎవరితో ఏ విధంగా ప్రవర్తించాలి? సహోద్యోగులతో ఫ్రెండ్లీగా ఉండాలా? ప్రొఫెషనల్‌గా వ్యవహరించాలా? ఇటువంటి ఎన్నో సందేహాల మధ్య ఉద్యోగ జీవితం ప్రారంభమవుతుంది. అయితే పరిస్థితులకు అనుగుణంగా తనని తను సిద్ధం చేసుకుంటే ఇటువంటి సందర్భాలను తేలికగానే ఎదుర్కోవచ్చు.

రిలాక్స్‌డ్‌గా ఉండండి

ఉద్యోగంలో చేరిన మొదటి రోజు ప్రశాంతంగా ఉండటానికి ప్రయత్నించాలి. ఎటువంటి ఆందోళనకు గురికావద్దు. బాడీ లాంగ్వేజ్ హుందాగా ఉండాలి. మొదటి రోజు కాబట్టి కొంత ఒత్తిడి ఉండటం సహజం. అయితే దీని ప్రభావం బాడీ లాంగ్వేజ్ మీద పడకుండా చూసుకోవాలి. ఒత్తిడి కారణంగా బాడీ లాంగ్వేజ్‌లో తేడా వస్తుంది. తద్వారా కొత్త వారితో త్వరగా కలిసిపోలేరు, ఆన్ ఫ్రెండ్లీ నేచర్ అనే ఇంప్రెషన్ క్రియేట్ అయ్యే ఆస్కారం ఉంటుంది. కాబట్టి ఎటువంటి ఆందోళన, ఒత్తిడి లేకుండా ప్రశాంతమైన మనసుతో మొదటి రోజు ఉద్యోగ నిర్వహణపై దృష్టి పెట్టాలి. చక్కని కెరీర్‌కు ప్రారంభం ఈ రోజే కాబట్టి దీన్ని మంచి జ్ఞాపకంగా మలుచుకోవాలి అని మిమ్మల్ని ప్రేరేపించుకోవాలి. అప్పుడు ఎటువంటి ఒత్తిడి దరి చేరదు.

హార్డ్‌వర్క్

ఉద్యోగంలో చేరిన తొలి నాళ్లలో ఉత్సాహంతోపాటు ఒక రకమైన నర్వస్‌నెస్ కూడా క్రియేట్ అవుతుంది. ఎంతగా అంటే ఆ నర్వస్‌నెస్ వల్ల ఒక్కోసారి జాబ్ రోల్‌ను కూడా మరిచిపోతుంటారు. ఇటువంటి సందర్భాల్లో ఉత్సాహం ఒక రకమైన భయం లేదా ఉద్రేకంగా మారుతుంది. స్వయం ప్రేరణ ద్వారా ఇటువంటి సందర్భాలను అధిగమించవచ్చు. ఇందుకు ఉద్యోగం సాధించిన క్రమాన్ని ఒక్కసారి గుర్తు తెచ్చుకోండి. వేలాది మంది పోటీదారులను దాటుకొని సదరు బాధ్యతలు నిర్వహించడానికి మీరే బెస్ట్ అని నిరూపించుకొని ఈ స్థాయికి వచ్చారు. వారందరి వల్ల కానిది మీతోనే సాధ్యమైంది. అంటే మీలో ఏదో ఒక స్పెషల్ టాలెంట్ ఉంది. అదే ఈ స్థాయికి తీసుకు వచ్చింది. ఒక గొప్ప కెరీర్‌కు ప్రారంభం ముగింట నిలిపింది. ఈ కెరీర్‌లో ఎన్నో ఉన్నత శిఖరాలను చేరుకునేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఉద్యోగమిచ్చిన సంస్థ, సహోద్యోగులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. కాబట్టి నర్వస్‌నెస్‌తో ఏర్పడే భయాలను హార్డ్‌వర్క్‌తో అధిగమించడానికి ప్రయత్నించాలి.

తొందర కూడదు

ఉద్యోగంలో చేరిన కొత్తలో బాగా పనిచేయాలనే ఉత్సాహం సహజమే. అనుకున్న సమయంలో పనులు చేయాలి, ప్రతి ప్రాబ్లమ్‌కు సొల్యూషన్ సూచించాలి, మేనేజ్‌మెంట్‌ను ఇంప్రెస్ చేయాలి అనే భావన ఉండటంలో తప్పేమీ లేదు. కాకపోతే ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం.. కెరీర్‌లో మీ ప్రయాణం ఇప్పుడే మొదలైంది. ఈ దశలోనే పనులన్నీ మీరే చేయాలని ఎవరూ ఆశించరు. భవిష్యత్ దృష్టి కోణంలో మీలోని సామర్థ్యాన్ని వినియోగించుకోవచ్చు అనే భావనలో రిక్రూట్ చేసుకుంటారు. కాబట్టి అన్నీ చేసేయాలి అనే తొందర మంచిది కాదు. కెరీర్ తొలి నాళ్లలో వర్క్ ఎగ్జిక్యూషన్ వంటి విషయాలను అవగాహన చేసుకోవడానికి ప్రాధాన్యతనివ్వాలి.

> ఉద్యోగంలో చేరిన కొత్తలో బాగా పనిచేయాలనే ఉత్సాహం సహజం. ఈ దశలోనే పనులన్నీ మీరే చేయాలని ఎవరూ ఆశించరు. భవిష్యత్ దృష్టి కోణంతోనే ఫ్రెషర్స్ రిక్రూట్‌మెంట్ ఉంటుంది. కాబట్టి అన్నీ చేసేయాలి అనే తొందర, చేయలేక పోయామనే బాధ మంచిది కాదు.

ఆత్మన్యూనత సరికాదు

ఉద్యోగంలో చేరిన కొత్తలో ఒక రకమైన ఆత్మన్యూనత కూడా కలుగుతుంది. సహోద్యోగులు మన కంటే ప్రతిభావంతులు, సామర్థ్యాలు కల వారు అనే ఆలోచన ఫలితంగా ఇటువంటి భావన వస్తుంది. ఇది సహజంగా జరిగేదే. ప్రతి వ్యక్తికి తనదైన బలాలు, బలహీనతలు, సామర్థ్యాలు ఉంటాయి. ఇతరులతో మిమ్మల్ని మీరు పోల్చుకోవడం సరికాదు. తద్వారా మీ సామర్థ్యాన్ని మీరే తక్కువ చేసుకున్న వారవుతారు. కాబట్టి ఒకరు ఎక్కువ అని భావన సరికాదు. ఎందుకంటే అటువంటి భావనతో నెగిటివ్ ఫ్రేమ్ ఆఫ్ మైండ్ డెవలప్ అవుతుంది. ఇది కెరీర్ విషయంలో ప్రతిబంధకంగా నిలుస్తుంది. కాబట్టి సాధ్యమైనంత వరకు కామ్‌గా కూల్‌గా ఇటువంటి ఆలోచనలు దరి చేరకుండా విధులు నిర్వహించడానికి ప్రయత్నించాలి.

మానసికంగా సిద్ధం

మన ఆలోచనలన్నీ ఒక క్లిష్టమైన మార్గంలోనే సాగుతాయి. ఉదాహరణకు 'కొత్త' అనే పదాన్ని తీసుకుంటే దాని వెంటనే భయం అనే భావోద్వేగం ఆటోమెటిక్‌గా జతకడుతుంది.

ఇటువంటి పరిస్థితుల్లో భయం అనేది ఒక రకమైన ఆందోళనకు కారణమవుతుంది. ఇవన్నీ మన ఆలోచనలకు ప్రతి రూపాలే. తప్ప మరొకటి కాదు. ఒక్కసారి ఎటువంటి ఆందోళన లేదు, అంత సాధారణంగా ఉంది అని భావించండి. ఒక నిమిషంలోనే అంతా సాధారణంగానే అనిపిస్తుంది. అంటే మానసికంగా సిద్ధంగా ఉండటం ద్వారా ఇటువంటి ఆలోచనలు రాకుండా చూసుకోవచ్చు. ఏదైనా కొత్త విషయాన్ని ప్రారంభిస్తున్నప్పుడు కొంత వరకు ఆందోళన ఉండటం సహజమే. ఉద్యోగంలో చేరిన కొత్తలో కూడా ఇదే జరుగుతుంది. మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకొని ఎటువంటి ఆందోళన, ఒత్తిడి లేకుండా నియంత్రించుకుంటే ఎటువంటి సమస్య ఎదురవదు. అంతా ప్రశాంతంగా అనిపిస్తుంది.

జాబ్ కార్నర్

గవర్నమెంట్ జాబ్స్

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్
పోస్టులు: అసిస్టెంట్
మొత్తం ఖాళీలు: 696
అర్హత: డిగ్రీ, స్థానిక భాషలపై పట్టు
వయసు: 18-28 ఏళ్లు (జూన్ 30 నాటికి)
ఎంపిక: రాత పరీక్ష ద్వారా
దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 28, 2017
వెబ్‌సైట్: www.uiic.co.in

యూపీఎస్సీ-సిడిఎస్ఈ
పరీక్ష: కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2, 2017
మొత్తం ఖాళీలు: 414
భర్తీ చేసే పోస్టులు: ఇండియన్ మిలటరీ అకాడమీ-100, ఇండియన్ నావల్ అకాడమీ-45, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ-32, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ-225, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (ఎస్ఎస్‌సి ఉమెన్ నాన్ టెక్నికల్)-12
ఎంపిక: రాత పరీక్ష, ఎస్ఎస్‌బి ఇంటర్వ్యూ ఆధారంగా
దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబర్ 8, 2017
తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం
వెబ్‌సైట్: www.upsc.gov.in

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్
పోస్టులు: కమిషన్డ్ ఆఫీసర్స్ (ఎన్‌సిసి ఎంట్రీ)
విభాగాలు: మీటియోరాలజీ ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ (నాన్ టెక్నికల్)
వయసు: ఫ్లయింగ్ 20-24 ఏళ్లు, గ్రౌండ్ డ్యూటీ (నాన్ టెక్నికల్) 20-26 ఏళ్లు.
ఎంపిక: ఎస్ఎస్‌బి ఇంటర్వ్యూ ఆధారంగా
దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 25, 2017
వెబ్‌సైట్: www.careerairforce.nic.in

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్
పోస్టులు: ఆఫీసర్స్ (మార్కెటింగ్ ప్రొఫెషనల్స్)
అర్హత: 60 శాతం మార్కులతో రెండేళ్ల పీజీ డిప్లొమా/పీజీ (బిజినెస్ మేనేజ్‌మెంట్-మార్కెటింగ్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌తో)
ఎంపిక: యూజీసీ-నెట్ (నవంబర్) పరీక్ష ద్వారా.
యూజీసీ-నెట్ పరీక్ష తేదీ: నవంబర్ 5, 2017
దరఖాస్తు: ఆన్‌లైన్‌లో. యూజీసీ-నెట్ రిజిస్ట్రేషన్ నెంబర్ వచ్చిన తరవాత ఇండియన్ ఆయిల్ వెబ్‌సైట్ ద్వారా ఆఫీసర్స్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబర్ 11, 2017
వెబ్‌సైట్: www.iocl.com, http://cbsenet.nic.in

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ
పోస్టులు: సైంటిస్ట్ బి, సైంటిఫిక్ / టెక్నికల్ అసిస్టెంట్ ఏ
మొత్తం ఖాళీలు: 340
విభాగాల వారీగా ఖాళీలు: సైంటిస్ట్ బి-81, సైంటిఫిక్ / టెక్నికల్ అసిస్టెంట్ ఏ-259
అర్హత: బిఇ/ బిటెక్ (కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ ఇంజనీరింగ్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలి కమ్యూనికేషన్) / ఎమ్మెస్సీ (ఫిజిక్స్/ఎలక్ట్రానిక్స్ / అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: దరఖాస్తు నాటికి 30 ఏళ్లు మించరాదు
దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 28, 2017
వెబ్‌సైట్: apply-delhi.nielit.gov.in

ఓరియెంటల్ ఇన్సూరెన్స్
పోస్టులు: జనరలిస్ట్స్, లీగల్, అకౌంటెంట్స్, ఆటోమొబైల్ ఇంజనీర్స్, మెడికల్ ఆఫీసర్స్, ఆక్చువరీస్
మొత్తం ఖాళీలు: 300
విభాగాల వారీగా ఖాళీలు: జనరలిస్ట్స్-223, లీగల్-30, అకౌంటెంట్స్-20, ఆటోమొబైల్ ఇంజనీర్స్-15, మెడికల్ ఆఫీసర్స్-10, ఆక్చువరీస్-2.
ఎంపిక: రాత పరీక్ష ద్వారా
దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 18, 2017
దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబర్ 15, 2017
వెబ్‌సైట్: https://orientalinsurance.org.in/

ఇండియన్ నేవీ
పోస్టులు: షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్స్, పర్మినెంట్ కమిషన్ ఆఫీసర్స్
విభాగాలు: ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్ (జనరల్/హైడ్రో కేడర్), టెక్నికల్ బ్రాంచ్ (జనరల్/నావల్ ఆర్కిటెక్చర్), నావల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్టరేట్ కేడర్
అర్హత: సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ
ఎంపిక: ఎస్ఎస్‌బి ఇంటర్వ్యూ ఆధారంగా
దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 25, 2017
వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in

ఇస్రో
పోస్టులు: డ్రైవర్
మొత్తం ఖాళీలు: 128
విభాగాల వారీగా ఖాళీలు: లైట్ వెహికల్ డ్రైవర్ ఎ-50, హెవీ వెహికల్ డ్రైవర్ ఎ-76, స్టాఫ్ కార్ డ్రైవర్-2
అర్హత: 10వ తరగతి/తత్సమానం, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి.
వయసు: 35 ఏళ్లు. **ఎంపిక:** రాత పరీక్ష ద్వారా
దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 28, 2017
వెబ్‌సైట్: www.isro.gov.in

ఢిల్లీ యూనివర్సిటీ
పోస్టులు: అసిస్టెంట్ ప్రొఫెసర్
మొత్తం ఖాళీలు: 128
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 19, 2017
వెబ్‌సైట్: http://as1.du.ac.in/colrec2017/index.php

చెన్నై పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్
పోస్టులు: ఇంజనీర్, ఐటి-సెక్యూరిటీ ఆఫీసర్, హెచ్ఆర్ ఆఫీసర్, సేఫ్టీ ఆఫీసర్, మార్కెటింగ్ ఆఫీసర్
మొత్తం ఖాళీలు: 33
విభాగాల వారీగా ఖాళీలు: ఇంజనీర్ (కెమికల్-15, మెకానికల్-6, ఎలక్ట్రికల్-3, సివిల్-1, మెటలర్జీ-2) , ఐటి- సెక్యూరిటీ ఆఫీసర్-1, హెచ్ఆర్ ఆఫీసర్-3, సేఫ్టీ ఆఫీసర్-1, మార్కెటింగ్ ఆఫీసర్-1.
వయసు: 30 ఏళ్లు (జూలై 31 నాటికి)
దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబర్ 1, 2017
హార్డ్ కాపీల స్వీకరణకు చివరి తేదీ: సెప్టెంబర్ 8, 2017
వెబ్‌సైట్: www.cpcl.co.in

ప్రైవేట్ జాబ్స్

యూఎస్ కాన్సులేట్ జనరల్-హైదరాబాద్
పోస్టులు: సివిల్ ఇంజనీర్, మెకానికల్ ఇంజనీర్, ఎలక్ట్రికల్ ఇంజనీర్, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్స్, ఫారెన్ సర్వీస్ నేషనల్ ఇన్వెస్టిగేటర్, షిప్‌మెంట్ క్లర్క్, చౌఫర్స్, ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్ట్ 16, 2017.
వెబ్‌సైట్: http://in.usembassy.gov/embassy-consulates/hyderabad/

లారెన్స్‌డేల్ ఆగ్రో ప్రాసెసింగ్ ఇండియా
పోస్టులు: సీనియర్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్
దరఖాసు: రెజ్యూమె మెయిల్ చేయాలి.
ఈ-మెయిల్: madhu.kandi@lawrencedale.com
వెబ్‌సైట్: lawrencedale.com


కార్వీ
పోస్టులు: కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్ లీడర్స్, ట్రైనర్స్, క్వాలిటీ కోచ్
అర్హత: కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్‌కు గ్రాడ్యుయేషన్‌తోపాటు చక్కని కమ్యూనికేషన్ స్కిల్స్, హిందీ, ఇంగ్లీష్ భాషలపై పట్టు ఉండాలి. టీమ్ లీడర్స్, ట్రైనర్స్, క్వాలిటీ కోచ్‌కు బిపిఓ రంగంలో అనుభవం ఉండాలి (ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. ఇంటర్వ్యూకు హాజరు కాలేని వారు రెజ్యూమెను మెయిల్ చేయవచ్చు)
ఈ-మెయిల్: ramya.pillai@karvy.com, ratna.bindu@karvy.com
చిరునామా: కార్వీ డేటా మేనేజ్‌మెంట్ సర్వీస్ లిమిటెడ్, రెండో ఫ్లోర్, కార్వీ సెలెనియం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రామ్‌గుడా, గచ్చిబౌలి, హైదరాబాద్.

ఫిజన్ ల్యాబ్స్
పోస్టు: బిజినెస్ అనలిస్ట్
అర్హత: 2017లో 70 శాతం మార్కులతో బిఈ, బిటెక్ (ఐటి/ సిఎస్ఈ/ఈసిఈ) పూర్తి చేసి ఉండాలి.
దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 17, 2017
వెబ్‌సైట్: www.task.telangana.gov.in

వెలాసిటీ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్
పోస్టులు: ఐటి హెడ్, హెడ్-ప్రాజెక్ట్స్, ఎగ్జిక్యూటివ్-అకౌంటెంట్స్ (సీనియర్, జూనియర్), ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్, కాస్ట్ అకౌంటెంట్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్.
ఫ్రెషర్స్: హెచ్ఆర్/ఫైనాన్స్/మార్కెటింగ్/ఐటిలో ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోజిషన్స్ కోసం ఫ్రెషర్స్ దరఖాస్తు చేసుకోవచ్చు.
దరఖాస్తు: రెజ్యూమె మెయిల్ చేయాలి
ఈ-మెయిల్: hr@velocity.co.in

విమెన్ పవర్

ప్రపంచవ్యాప్తంగా ఏ రంగంలో మహిళ ఉద్యోగుల సంఖ్య ఎక్కువగా ఉందో మీకు తెలుసా? ప్రపంచంలోని పార్లమెంట్ సభ్యుల్లో ఎంత మంది మహిళలు ఉన్నారో అవగాహన ఉందా? ఫార్చ్యూన్-500 కంపెనీ సీఈఓల్లో ఎంత మంది మహిళలు ఉన్నారు? ఇటువంటి వివరాలను ఒక్క సారి పరిశీలిద్దాం (శాతాల్లో)



చిత్రజ్యోతి



వారిని చూస్తే బాధగా ఉంటుంది

- శ్రుతీహాసన్

"**జీ**వితం చాలా చిన్నది. అందుకే ప్రతిక్షణాన్ని ఆస్వాదించాలి. నటిగా మంచి జరిగినప్పుడు ఆనందపడుతూ.. చెడు జరిగినప్పుడు బాధపడటం నాకు నచ్చదు. ఏ క్షణమైనా ఒకేలా ఉంటా. నలుగురితో కలిసుండటానికి ఇష్టపడతా" అని చెబుతోంది శ్రుతీహాసన్. ప్రస్తుతం తన తండ్రి నటిస్తున్న 'శభాష్ నాయుడు' చిత్రంలో ఓ కీలక పాత్ర పోషిస్తోంది. శ్రుతీ మాట్లాడుతూ "మనకున్న చిన్న జీవితాన్ని వీలైనంత ఆనందంగా గడపాలి. చుట్టు పక్కలవారితో కలసిమెలసి ఉండాలి. వారి కష్టసుఖాలు తెలుసుకోవాలి. కొత్తవాళ్లని కలవడమన్నా, గలగల మాట్లాడటమన్నా నాకు చాలా ఇష్టం. అలా ఉండకపోతే ఇండస్ట్రీలో ఉండలేనేమో అనిపిస్తుంటుంది. వృత్తిపరంగా చూస్తే కొందరు హీరోయిన్లు చాలా సైలెంట్‌గా ఉంటారు. వారిని చూస్తే నాకు బాధగా ఉంటుంది. అలాంటి వాళ్లతో కలిసి మాట్లాడటంలో ఆనందం ఉంటుందని భావిస్తా" అని చెప్పింది.



అదే నా ప్లస్ పాయింట్!

- అమలాపాల్

'**మీ**లో ఉన్న ప్లస్ పాయింట్స్ ఏంటి? అని చాలా మంది సరదాగా అడుగుతుంటారు. అలాంటప్పుడు ఏం చెప్పాలో నాకు అర్థం అయ్యేది కాదు.. కానీ నా తొలి సినిమా విడుదలయ్యాక ఆ ప్రశ్నకు సమాధానం చెప్పడం తెలిసింది' అని అంటున్నారు అమలాపాల్. తమిళ్‌తోపాటు తెలుగులోనూ పలు చిత్రాల్లో నటించిన మలయాళ బ్యూటీ అమలాపాల్. ఆమె మాట్లాడుతూ "నేను జీవితంలో ఎన్ని సినిమాలు చేసినప్పటికీ కెరీర్ ప్రారంభంలో చేసిన చిత్రాలు చాలా స్పెషల్‌గా అనిపించాయి. ఎందుకంటే షూటింగ్ స్పాట్‌లో అడుగుపెట్టక ముందు నాకు హీరోయిన్ అంటే ఉన్న దృష్టి వేరు. స్పాట్‌లో అడుగుపెట్టిన తర్వాత నా అభిప్రాయాలు పూర్తిగా మారిపోయాయి. హెవీ మేకప్‌తో, వెరైటీ హెయిర్ స్టైల్‌తో, కురచ దుస్తులతో ఉంటేనే హీరోయిన్‌గా యాక్సెప్ట్ చేస్తారని అనుకున్నా. కానీ నా తొలి చిత్రంలో నేను పోషించింది 'మైనా' అనే పల్లెటూరి అమ్మాయి పాత్ర. నా బుగ్గలమీద అప్పుడు మొటిమలు కూడా ఉన్నాయి. మా డైరెక్టర్‌గారు 'నో మేకప్' అన్నారు. అందువల్ల కళ్లకు కాటుక తప్ప ఇంకేమీ పెట్టుకునేదాన్ని కాదు. అయినా ఆ సినిమా సూపర్‌హిట్. ఆ తర్వాత ఎక్కడికెళ్లినా నన్ను మైనా అని పిలవసాగారు. కనిపించిన వారందరూ 'మీ కళ్లు చాలా బావుంటాయి' అని అన్నారు. అప్పటి నుంచి నాకూ అదే కరెక్టేమోననిపించింది" అని అన్నారు అమలాపాల్.

బాలల చలన చిత్రోత్సవం..

నవంబర్ 8 నుంచి... హైదరాబాద్‌లో...

ఇరవయ్యవ బాలల చలనచిత్రోత్సవానికి హైదరాబాద్ వేదికకానుంది.నవంబర్ 8 నుంచి 14వ తేదీ వరకు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఉత్సవాల ప్రారంభ, ముగింపు వేడుకలను శిల్పకళావేదికలో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి చలన చిత్రాభివృద్ధి సంస్థ(ఎఫ్‌డీసీ) కార్యలయంలో శుక్రవారం ఐఅండ్ పీఆర్ కమిషనర్ నవీన్ మిట్టల్ ఆధ్వర్యంలో ప్రిలిమినరీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫిలిం డెవలప్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు. బాలల చలన చిత్రోత్సవానికి సంబంధించి ఏర్పాట్లను చర్చించారు. ఈ చిత్రోత్సవానకి సంబంధించి నగరంలోని 12 థియేటర్లను రిజర్వు చేయాల్సిందిగా కమిషనర్ ఎఫ్‌డీసీ, సీఎఫ్ఎస్ఐ అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బాలల చలనచిత్రోత్సవాలను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఫిలిం మేకింగ్‌పై జవహర్ బాల భవన్‌లో ఒక వర్క్‌షాపును నిర్వహించనున్నామన్నారు. వేడుకలను కవర్ చేయడానికి మీడియా సెంటర్లను కూడా ఏర్పాటుచేస్తామన్నారు. ఉత్సవాలకు హాజరయ్యే విదేశీ ప్రముఖులకు, బాలల ప్రతినిధుల కోసం ప్రివ్యూ థియేటర్‌లను రిజర్వ్ చేయనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర చతనచిత్రాభివృద్ధి సంస్థ జేఎండి కిషోర్ తదితరులు పాల్గొన్నారు

డైలీ సుడోకు - 151

		1						6
9		7		5	6			
2					1	5		
	5			3			1	
7			1		4			3
	2			8			6	
		5	7					1
			2	9		6		7
3						9		

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

నిన్నటి సుడోకు- 150 సమాధానం

నివేదన

ఎప్పుడో చేస్తానంటే కుదరదు!

పూర్వం ఒక పట్టణంలో ఒక జంట ఉండేది. భర్త ఉన్నతోద్యోగి. ఉదయం తొమ్మిదింటికి ఆఫీస్‌కు వెళ్తే.. సాయంత్రం ఆరయ్యాక ఇంటికి చేరుకునే వాడు. అతడి భార్య పరమ సాధ్వి. నిరంతరం హరి నామస్మరణతో కాలక్షేపం చేసేది. భర్తతో.. 'రోజూ ఒక అరగంటైనా దేవుడిని పూజించ వచ్చు కదా!' అనేదావిడ. దానికి ఆయనగారు.. 'అంత తీరిక నాకెక్కడిది! రిటైర్ అయ్యాక కాలక్షేపం పూజలే కదా!' అంటుండేవాడు. భర్త మనసు మార్చడానికి భార్య ఎన్నోసార్లు ప్రయత్నించి విఫలమైంది.

ఇలా ఉండగా, ఒకసారి భర్తకు తీవ్రమైన జ్వరం వచ్చింది. డాక్టర్ ఇంటికి వచ్చి అతణ్ణి పరీక్షించాడు. ఒక ఔషధం ఇచ్చి.. రోజుకు మూడు పూటలా.. ఔషధాన్ని ఒక్కో కప్పు చొప్పున తాగించమన్నాడు. ఆ మందు సీసాను జాగ్రత్త చేసింది భార్య. సాయంత్రం దాటిపోయినా.. భర్తకు ఔషధం ఇవ్వలేదు. రాత్రి కావొస్తున్నా.. అదే పరిస్థితి. భర్తకు ఒళ్లు మండింది. భార్యను పలిచి.. 'డాక్టర్ ఇచ్చిన ఔషధం ఎందుకు ఇవ్వడం లేదు?' అని ప్రశ్నించాడు. దానికి భార్య.. 'తొందరేముంది లెండి, మీరు రిటైర్ అయ్యాక ఔషధం పుచ్చుకుందురుగాని!' అని సమాధానం ఇచ్చింది. 'అదేమిటే! రోగం వచ్చినప్పుడు కదా.. మందు తీసుకోవాలి. రిటైర్ అయ్యాక అంటావేమిటి! నీకు మతిపోయిందా?' అని నీరసంగా ప్రశ్నించాడు భర్త. 'రోగం వచ్చినప్పుడే ఔషధం తీసుకోవాలన్నది నిజమే! అయితే ఈ సంసారం అనే రోగంతో కొట్టుమిట్టాడుతున్నాం కదా! భగవన్నామం అనే ఔషధాన్ని నిత్యం సేవించమని కోరితే.. రిటైర్ అయ్యాక చేస్తానన్నారు కదా! ఇదీ అంతే' అన్నది భార్య. ఆ మాటలతో భర్తకు కనువిప్పు కలిగింది. భగవన్నామస్మరణ ప్రాధాన్యం తెలిసొచ్చింది. ఆనాటి నుంచి నిత్యం దైవారాధన చేస్తూ హాయిగా జీవనం కొనసాగించారు ఆ దంపతులు.



కౌన్సెలింగ్

ఉద్యోగం వదిలి ఊరెళ్లిపోతానంటున్నాడు....

డిగ్రీ పూర్తి చేసిన నా మిత్రుడొకడు మూడేళ్లుగా ఏదో ఒక ఉద్యోగం చేస్తూనే ఉన్నాడు. ఎక్కడా ఆరుమాసాలకు మించి ఉండలేకపోతున్నాడు. బాస్ బాగోలేడనో, సహోద్యోగులు హేళన చేస్తున్నారనో చెబుతుంటాడు. ఈ మధ్య.. 'నేను ఊరికి వెళ్లిపోయి అక్కడే ఏదైనా చేస్తాను.. తప్ప ఇక సిటీలో ఉండనంటు'న్నాడు. ఊళ్లో పొలాలు, ఆస్తులు బాగానే ఉన్నాయి. ఉద్యోగం చేస్తే తప్ప ఇల్లు గడవని పరిస్థితి ఏమీ లేదు. కానీ, ఖాళీగా ఉండిపోవడం సరికాదు కదా అంటాడు వాళ్ల నాన్న. అతణ్ణి నిలబెట్టే మార్గం ఏమైనా ఉంటే చెప్పండి?

- జె. వసంత్, హైదరాబాద్

కొంత ఆలస్యంగా, కొంత అస్పష్టంగానే అయినా మీ మిత్రుడు తన మనసులో ఉన్నదేదో ఇప్పుడు బయటపెట్టేశాడు. అతణ్ణి తప్పు పట్టడం కాకుండా.. అర్థం చేసుకునే ప్రయత్నం చేయండి. మీరు చెప్పే దాన్ని బట్టి ఆయన బాగా సున్నిత మనస్కుడు. ఒక రకంగా బలహీనుడు కూడా. ఎదుటి వారి నెగెటివ్ పోకడలను తట్టుకునే శక్తి ఆయనలో కాస్త తక్కువే ఉంది. ఊళ్లో ఆస్తిపాస్తులు, ఆర్థిక వెసులుబాటు లేకపోతే ఎలాగోలా ఇక్కడే మొండిబారిపోయేవాడేమో! కానీ, ఊళ్లో పొలాలు, ఇతరత్రా వ్యాపకాలు ఉండటం వల్ల అక్కడికే వెళ్లిపోవాలని అలోచిస్తున్నాడు. అతడిని తప్పు పట్టాల్సిన అవసరమేమీ లేదు. అస్తమానం మనసు నొప్పించే మనుషులకు దూరంగా వెళ్లాలనే అభిప్రాయం అతనిలో ఇప్పటికే బలపడిపోయి ఉంటుంది. అతడు మీకింకా వివరంగా ఏమీ విప్పి చెప్పలేదు కానీ అతని మనసులో ఊరికి వెళ్లిపోయి పాడి పరిశ్రమ, కోళ్ల పరిశ్రమ లేదా వాణిజ్య పంటల గురించిన స్వతంత్ర ఆలోచనలేవో ఉండి ఉంటాయి. ఒకవేళ అదే అతని నిర్ణయంగా అతడు బయటపడితే అప్పుడింక ప్రోత్సహించడమే మీరు చేయాల్సిన పని. డిగ్రీ చేసినంత మాత్రాన ఉద్యోగమే చేయాలనేమీ లేదు కదా! అతని నిర్ణయం వారి తలిదండ్రులకు నచ్చినా... నచ్చకపోయినా, అతని నిర్ణయాన్ని గుర్తించి, ఆమోదించాల్సిన బాధ్యత వారికి ఉంది. ఒకవేళ, తన నిర్ణయాన్ని తానే నేరుగా తలిదండ్రులకు చెప్పలేని ఏదైనా ఇబ్బంది మీ మిత్రుడికి ఉంటే, మిత్రుడిగా మీరే కలగచేసుకుని వారికా విషయం చెప్పండి. అది కార్యరూపం దాలిస్తే అతని భవిష్యత్తు గురించి ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు.

- డాక్టర్ వి.కరుణాకర్, కన్సల్టెంట్ సైకాలజిస్టు



మీకు మీరే డాక్టర్

మైగ్రేన్ హుష్‌కాకి!

- అవిసె గింజలు 5 గ్రాములు, ఆవాలు 5 గ్రాములు ఈ రెంటినీ కలిపి నీళ్లల్లో మెత్తగా నూరి ఆ మిశ్రమాన్ని తల పైన పట్టువేయాలి ఆ తర్వాత తల పట్టు మీద కాగితం అంటించి కాపడం పెడితే పార్శ్వపు తలనొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.
- 5 గ్రాముల పంచదార, 5 గ్రాముల పటిక బెల్లం పొడిని 250 మి.లీ నీళ్లల్లో కరిగించి మూత పెట్టి ఉంచాలి. ఆ మరునాటి ఉదయాన్నే ఏమీ తినక ముందు.. ఆ ద్రావణం తాగితే పార్శ్వపు నొప్పి తగ్గిపోతుంది.
- బచ్చలాకు నూరి నొసట పట్టు వేస్తే, తలనొప్పి, పార్శ్వపు నొప్పి రెండూ తగ్గిపోతాయి.
- జీలకర్రను నిమ్మకాయ రసంతో నూరి పట్టువేస్తే చాలా త్వరగా నొప్పి తగ్గిపోతుంది.
- పిప్పళ్లు, మిరియాలు, కరక్కాయ - వీటిని సమభాగాలుగా కలిపి, గంజిలో నూరి పట్టువేస్తే పార్శ్వపు నొప్పి చాలా వేగంగా తగ్గుతుంది.
- సైంధవ లవణాన్ని నెయ్యితో మెత్తగా నూరి, వడగట్టాలి. ఈ రసాన్ని రోజూ రెండు మూడు చుక్కలు ముక్కులో వేసుకుంటే పార్శ్వపు నొప్పి తగ్గుతుంది.



స్మార్ట్‌హోమ్

నెగెటివ్ ఎనర్జీ పోవాలంటే...

మానసిక ప్రశాంతత కావాలంటే ఇంట్లో నెగెటివ్ ఎనర్జీ లేకుండా చూసుకోవాలి. ఇలా చేయడం వల్ల నెగెటివ్ ఎనర్జీని దూరం చేసుకోవచ్చు.

- ఇంట్లోకి ధారాళంగా వెలుతురు, గాలి వచ్చేలా కిటికీలన్నీ తెరచి ఉంచండి. సూర్యకిరణాలు ఇంట్లో పడేలా చూసుకోండి. గాలి, సూర్యకిరణాలు నెగెటివ్ ఎనర్జీని తొలగిస్తాయి.
- ఇంట్లో ఉండే పాత వస్తువులను, పనికిరాని వస్తువులను తొలగించండి. పాత వస్తువులు నెగెటివ్ ఎనర్జీని ఆకర్షిస్తాయి.
- గతంలో చెప్పులను ఇంటి బయటే విడిచి కాళ్లు నీళ్లతో కడుక్కుని ఇంట్లోకి వచ్చేవారు. దీనివల్ల నెగెటివ్ ఎనర్జీ ఇంట్లోకి వచ్చేది కాదు. ఇప్పుడు కూడా అదే పద్ధతి పాటించడం వల్ల నెగెటివ్ ఎనర్జీ ఇంటి దరిచేరకుండా చూసుకోవచ్చు.
- పార్క్‌లో లేదా విశాలమైన మైదానంలో కాసేపు నడవండి. ప్రకృతికి దగ్గరగా గడపడం వల్ల శరీరం ఉత్తేజం పొందుతుంది.
- ఇంటిని రోజూ ఊడవడం వల్ల దుమ్ముతో పాటు నెగెటివ్ ఎనర్జీ వెళ్లిపోతుంది.
- బకెట్ నీటిలో కొద్దిగా రాక్‌సాల్ట్ వేసి ఆ నీటితో ఇల్లు తుడిచినా నెగెటివ్ ఎనర్జీ తొలగిపోతుంది.
- బాల్కనీలో, ఇంటి గది మూలల్లో కుండీల్లో పూల మొక్కలు పెంచుకోవడం వల్ల పాజిటివ్ ఎనర్జీ వచ్చి చేరుతుంది.
- ఇంట్లో ప్రార్థనలు చేయడం వల్ల పాజిటివ్ వైబ్రేషన్స్ పెరుగుతాయి.




UNANIMOUS INDUSTRY HIT
Thanks to Audience -MIRYALA RAVINDER REDDY
A BOYAPATI SREENU FILM
MIRYALA SATHYANARAYANA REDDY PRESENTS
DWARAKA CREATIONS
జయ జానకి నాయక
ROCKSTAR DEVI SRI PRASAD DSP MUSICAL
MIRYALA RAVINDER REDDY BOYAPATI SREENU
DEVI SRI PRASAD
CHITYALA SAIKUMAR REDDY
M.RATHNAM RISHI PUNJABI SAHI SURESH KOTAGIRI VENKATESWARA RAO RAM-LAXMAN PREM RAKSHITH VAMSI SHEKAR
Junglee
U/A





ర్యాంప్ నిర్మిస్తున్న విద్యార్థులు, (ఇన్‌సెట్లో)మస్తాన్ బాబు

దోస్త్ మేరా దోస్త్

- **దివ్యాంగుడి కోసం మేస్త్రీలైన విద్యార్థులు**
- **ర్యాంప్ నిర్మించి ఔదార్యం.. సహకరించిన టీచర్**

మెదక్ రూరల్, ఆగస్టు 11: అభిమానం, వాత్సల్యం, నిస్వార్థ చింతన.. స్నేహంలో మాత్రమే ఉండే గొప్ప లక్షణాలేమో!! వీటి స్ఫూర్తితోనే రెండు కాళ్లు పనిచేయని తమ ప్రాణస్నేహితుడి కష్టాన్ని తీర్చారా విద్యార్థులు! తన స్నేహితుల ఔదార్యంతో తనకున్న ఇబ్బంది తీరిపోయిన ఆ దివ్యాంగ విద్యార్థి కళ్లలో ఇప్పుడు వారిపట్ల మాటలకందని కృతజ్ఞతా భావం!! మెదక్ జిల్లా హవేళీఘణపూర్ హైస్కూల్లో మస్తాన్ బాబు 8వ తరగతి చదువుతున్నాడు. పుట్టుకతోనే రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. ట్రై సైకిల్‌పై ఎలాగో అలా రోజూ స్కూల్‌కు వెళ్తున్నాడు! తరగతి గదిలోకి వెళ్లాలంటే 'అడ్డు'గా నాలుగైదు మెట్లున్నాయి. అయినా మెట్లపై పాకుతూనే అతడు క్లాస్‌రూంలోకి వెళ్లేవాడు. మస్తాన్ బాబు ఇలా రోజూ పడుతున్న ఇబ్బందిని చూసి తోటి విద్యార్థుల మనసు చలించింది. అంతా కలిసి ఓ పరిష్కారాన్ని ఆలోచించారు. ఓ ర్యాంప్‌ను నిర్మిస్తే.. మస్తాన్‌బాబు ఇబ్బందులు తొలగిపోతాయని భావించారు. స్కూల్లోని టీచర్ నాగేందర్‌తో తమ ఆలోచనను పంచుకున్నారు. ఆ టీచర్ తన సొంత ఖర్చులతో సిమెంటు, ఇతర సామగ్రి తెప్పించారు. అంతే.. స్నేహితుడి కోసం తోటి విద్యార్థులంతా శుక్రవారం మేస్త్రీలుగా మారి తాపీ పట్టారు. మస్తాన్‌బాబు సునాయసంగా తరగతి గదిలోకి వెళ్లే విధంగా సాయంత్రానికల్లా చక్కగా ఓ ర్యాంప్ నిర్మించారు. స్కూల్లో రెండు భవనాల మధ్య ఉన్న సందిని పూడ్చి మూడుచక్రాల సైకిల్ వెళ్లేందుకు అనువుగా మార్చారు. తమ స్నేహితుడి కోసం చేసిన పని తమకెంతో సంతృప్తినిచ్చిందని తోటి విద్యార్థులు తమ ఆనందాన్ని పంచుకున్నారు.

కిడ్నాప్ చేసి చంపేశారా?!

- **ముంబైలో అదృశ్యమైన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్**
- **కృష్ణానదిలో తేలిన మృతదేహం**



సిల్వెంట్ ఆధార్ కార్డు

విజయవాడ/వన్‌టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ముంబైలో కనిపించకుండా పోయిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.. సిల్వెంట్ సొంకత్లే(26) విజయవాడలో కృష్ణా నదిలో శవమై కనిపించాడు. మహారాష్ట్రలోని షోలాపూర్‌కు చెందిన మల్లికార్జున సొంకత్లే కూలీ. నిరుపేద కుటుంబమైనప్పటికీ తన కుమారుడు సిల్వెంట్‌ను బీటెక్ వరకు చదివించాడు. ఇంజనీరింగ్ పూర్తిచేసిన సిల్వెంట్ ముంబైలోని నిమ్రాటెక్ కంపెనీలో ఇటీవలే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం సంపాదించాడు. విధులకు వెళ్లిన సిల్వెంట్ ఈ నెల 7 నుంచి కనిపించకుండా పోయాడు. దీనిపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. ఇదిలావుంటే, కనిపించకుండా పోయిన రెండు రోజుల తర్వాత ఈ నెల 9న సిల్వెంట్ తనను ఎవరో నలుగురు వ్యక్తులు కిడ్నాప్ చేశారంటూ స్నేహితుడి సెల్‌ఫోన్‌కు మెసేజ్ పంపాడు. దీంతో పోలీసులు ఈ కిడ్నాప్‌ను ఛేదించే పనిలో పడ్డారు. ఇంతలో సిల్వెంట్.. గురువారం రాత్రి 12 గంటల సమయంలో విజయవాడలోని కృష్ణానదిలో శవమై తేలాడు. సిల్వెంట్ మృతి మిస్టరీగా మారింది.

మరో బీటెక్ దొంగ

- **ఉన్నతకుటుంబం నుంచి వచ్చి దోపిడీలు**
- **జైలుకు వెళ్లివచ్చినా మారని బుద్ధి**

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అతడిది ఉన్నత కుటుంబం! తల్లిదండ్రులు ఉన్నత విద్యావంతులు! డబ్బుకు కొదవే లేదు! ఇంజనీరింగ్ చేశాడు! అయినా అతడి బుద్ధి వక్రమార్గం పట్టింది! దీనికి సంబంధించిన వివరాలను సైబరాబాద్ సీపీ సందీప్ శాండిల్య గచ్చిబౌలి కమిషనరేట్‌లో వెల్లడించారు. తమిళనాడుకు చెందిన వీరవంశీనాయుడు ఇంజనీరింగ్ పూర్తిచేసి ఒక కాల్‌సెంటర్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అతడి కుటుంబం ఉన్నత కుటుంబమే. అయినా జల్సాలకు అలవాటు పడిన అతడు మరింత డబ్బు కోసం దొంగతనాలను ఎంచుకున్నాడు. 2012 నుంచి ఇళ్లలో దోపిడీలు చేస్తున్నాడు. ఆ విషయం తెలిసి అతడిని అతడి తల్లిదండ్రులు ఇంటి నుంచి వెళ్లగొట్టారు. 2015లో నాచారం, తిరుమలగిరి కేసుల్లో రెండు సార్లు పోలీసులకు పట్టుబడి కటకటాలపాలయ్యాడు. అయినా బుద్ధిమారలేదు. భార్యను హత్య చేసిన కేసులో అరెస్టయిన జగద్గిరిగుట్టకు చెందిన మురళీతో జైలులో దోస్తీ కట్టాడు. 18 నెలల శిక్ష తర్వాత ఇద్దరు బయటికి వచ్చి దోపిడీలకు స్కెచ్ వేశారు. మురళీ స్నేహితులైన సంగారెడ్డికి చెందిన అనువుల సాయీశ్వర్, కుత్బుల్లాపూర్ నివాసి సయ్యద్ షబ్బీర్‌ను ముఠాలో చేర్చుకున్నాడు వీరవంశీ నాయుడు. వీరంతా కలిసి 19 ఇళ్లలో దోపిడీలు చేశారు. అయితే చేసిన పాపం ఎప్పటికైనా పండకపోదు అన్న చందాన, జగద్గిరిగుట్టలోని ఓ వైన్ షాప్ వీరవంశీనాయుడుతో పాటు మరో ఇద్దరిని బాలానగర్ సీసీఎస్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. విచారణలో నేరం చేసినట్టు వారు అంగీకరించారు. వారి నుంచి 35 తులాల బంగారు ఆభరణాలు, 1219 గ్రాముల వెండి ఆభరణాలు, 10టీవీలు, రెండు బైక్‌లు, రెండు ల్యాప్‌టాప్‌లు, రెండు కెమెరాలు, రెండు సెల్ ఫోన్లు, ఒక ప్రింటర్, ఒక సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ. 19.55 లక్షలు ఉంటుందని అంచనా. కాగా, వీరవంశీనాయుడు ఒక్కడే 4 దొంగతనాలు, సాయీశ్వర్‌తో కలిసి మరో 11, మురళీతో కలిసి మరో మూడు దొంగతనాలు చేసినట్టు సీపీ తెలిపారు. కేసును ఛేదించిన సిబ్బందిని ఆయన అభినందించారు.



నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి వివరాలు వెల్లడిస్తున్న సీపీ సందీప్ శాండిల్య

స్వదేశీ మంత్రం



పత్తి చేనులో కలుపు తీద్దామంటే కాడెద్దు లేవు. దంతెతో తీయిద్దామంటే రోజుకు రూ.600 దాకా ఖర్చు. ఎలా? ఈ సమస్యను అధిగమించేందుకు మెదడుకు పదను పెట్టాడా రైతు. ఆటో ఇంజన్‌తో ఏకంగా ఓ కలుపుతీత యంత్రాన్నే తయారు చేశాడు. నల్లగొండ జిల్లా దామరచర్లకు చెందిన గాలం రాముదీ ఘనత. అతడు పదెకరాల్లో పత్తి పంట వేశాడు. ఇటీవల జల్లులకు చేన్లో కలుపు మొక్కలు పెరిగాయి. తనకున్న పాత ఆటో ఇంజన్‌తో టిల్లర్‌ను తయారు చేశాడు. దానికి చిన్న సైజులో దమ్ము చక్రాలు, నాగళ్లు, గుంటక, గొర్రు తయారు చేసి అమర్చేందుకు వీలుగా యంత్ర భాగాలను రూపొందించాడు. ఈ యంత్రం తయారీకి రూ.18 వేలు ఖర్చయిందని, లీటర్ డీజిల్‌తో ఎకరానికిపైగా గుంటక తోలకం పూర్తవుతోందని రాము చెప్పాడు.
- దామరచర్ల

విదేశీ యంత్రం



సాగు కోసం ఎరువులు, విత్తనాలను అప్పు తెచ్చయినా సమకూర్చుకోవచ్చు. అసలు సమస్యల్లా కూలీలదే! రెండింతలిస్తామని కాళ్లరిగేలా తిరిగినా కూలీలు దొరికితే ఒట్టు. ప్రత్యేకించి వరినాట్లు వేసే సమయంలోనైతే కూలీల కొరత మరీ ఎక్కువ. మరి.. చకచకా నాట్లు వేయగలిగే ఓ యంత్రం రైతులకు అందుబాటులో ఉంటే? వరంగల్‌కు చెందిన చామల రవీందర్‌రెడ్డి ఇదే పనిచేశాడు. వరి నాట్లు వేసేందుకు జపాన్ నుంచి ఓ యంత్రాన్ని తెప్పించి ఉపాధి పొందుతున్నాడు. ఇది గంటకు ఎకరం విస్తీర్ణంలో నాట్లు వేస్తుంది. శుక్రవారం జనగామ మండలం చీటకోడూరులో నాట్లు వేస్తూ రవీందర్ రెడ్డి ఇలా బిజీగా కనిపించాడు. దీన్ని రూ.18లక్షలకు కొన్నట్టు చెప్పాడు.
- జనగామ, ఆంధ్రజ్యోతి

షాక్ కొట్టిన కరెంట్ బిల్లు

- **ఒక్కో ఇంటి బిల్లు రూ.50 వేల నుంచి లక్ష!**
- **దిడిగి గ్రామస్థుల ఆగ్రహం**
- **మృతుడు బాబుమియా కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన**





అధిక బిల్లుల ప్రతులను చూపుతున్న దిడిగి గ్రామస్థులు.. మీటర్ రీడింగ్ లేకుండా బాబుమియా (మృతుడు)కు బిల్ కలెక్టర్ ఇచ్చిన రశీదు

జహీరాబాద్, ఆగస్టు 11: కరెంటు ముట్టుకుంటే షాక్ కొడుతుంది. కానీ ఆ ఊర్లోని కరెంటు బిల్లుల్ని చూస్తేనే షాక్ కొట్టింది. మరీ ఎక్కువ విద్యుత్ వాడితే వెయ్యి కూడా దాటని ఇంటికి సంబంధించిన కరెంటు బిల్లు రూ.50వేల నుంచి రూ.లక్ష దాకా వచ్చింది. అలా ఒకటి కాదు.. రెండు కాదు దాదాపు 100 ఇళ్లకు వేలల్లో బిల్లులు. ఇది అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అంటూ ఆగ్రహంతో ఊగిపోయిన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం దిడిగి గ్రామస్థులు శుక్రవారం జహీరాబాద్ సబ్ స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు. రహదారికి అడ్డంగా బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రూ.90,452 కరెంటు బిల్లును చూసి గుండెపోటుతో మృతి చెందిన బాబుమియా కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రోడ్డుపై అరగంట పాటు బైఠాయించడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. తమకు న్యాయం జరిగే వరకు కదలబోమని స్పష్టం చేశారు. అంతటితో ఆగకుండా సబ్‌స్టేషన్‌లోకి వెళ్లి ఏడీ కార్యాలయం ఎదుట అధిక బిల్లులు చూపిస్తూ నిరసన తెలిపారు. సమావేశం నిమిత్తం విద్యుత్ శాఖ అధికారులు అందుబాటులో లేకుండా పోయారు. స్థానిక ఎస్సై విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ ద్వారా తెలుపగా స్పందించారు. మృతి చెందిన బాబుమియా కుటుంబాన్ని ఆదుకుంటామని, అధికంగా వచ్చిన బిల్లులను సవరిస్తామని హామీనిచ్చారు. దీంతో గ్రామస్థులు శాంతించారు.

బీజేపీకి ప్రత్యామ్నాయమెలా?

- **ఢిల్లీలో 16 విపక్షాల కీలక భేటీ**
- **సోనియా సారథ్యంలో మంతనాలు**



అఖిలపక్ష భేటీకి హాజరైన సోనియా, మమత, డి.రాజా తదితరులు

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ప్రధాని మోదీని, బీజేపీని ఎదుర్కొనేందుకు సమర్థ ప్రత్యామ్నాయ కూటమి ఏర్పాటు చేయాలని 16 ప్రతిపక్షాలు సంకల్పించాయి. ఇందుకోసం ఉమ్మడి వ్యూహం రూపొందించాలని నిర్ణయించాయి. ఈ పార్టీలు కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ సారథ్యంలో శుక్రవారమిక్కడ కీలక సమావేశం నిర్వహించాయి. అయితే దీనికి శరద్ పవార్ నాయకత్వంలోని ఎన్సీపీ డుమ్మాకొట్టింది. గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో తమ అభ్యర్థి అహ్మద్ పటేల్‌కు ఓట్లేస్తామని హామీ ఇచ్చి పవార్ మోసగించారని కాంగ్రెస్ నేతలు ఆరోపించడంతో ఆ పార్టీ ఆగ్రహంతో ఉంది. బిహార్‌లో మహాకూటమి నుంచి వైదొలగిన జేడీయూ నుంచి ఆ పార్టీ అసమ్మతి ఎంపీ అలీ అన్వర్ ఈ భేటీకి హాజరు కావడం గమనార్హం. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో లేవనెత్తాల్సిన ప్రజాసమస్యలపై విపక్షాలను సమన్వయపరిచేందుకు ఓ సబ్‌గ్రూపును ఏర్పాటు చేయాలని భేటీలో నిర్ణయించారు. ఈ గ్రూపును ఏర్పాటుచేసే అధికారాన్ని సోనియాకు అప్పగించారని రాజ్యసభలో విపక్ష నేత గులాం నబీ ఆజాద్ ఆ తర్వాత మీడియాకు తెలిపారు. ఈ సమావేశానికి కేరళ కాంగ్రెస్ (మణి) కూడా రాలేదని, ఆ పార్టీకి ఆ రాష్ట్రంలో వేరే కార్యక్రమం ఉండడంతో నేతలెవరూ రాలేకపోయారని చెప్పారు. కాగా, ఈ భేటీకి మన్మోహన్‌సింగ్, అహ్మద్ పటేల్, ఏకే ఆంటోనీ (కాంగ్రెస్), బెంగాల్ సీఎం మమతా బెనర్జీ (తృణమూల్), సీతారాం ఏచూరి (సీపీఎం), డి.రాజా (సీపీఐ), జైప్రకాశ్ యాదవ్ (ఆర్‌జేడీ), అజిత్‌సింగ్ (ఆర్‌ఎల్‌డీ), తిరుచి శివ (డీఎంకే), సతీశ్ మిశ్రా (బీఎస్పీ), నరేశ్ అగర్వాల్ (ఎస్పీ), ఒమర్ అబ్దుల్లా (ఎన్సీ), సంజీవ్‌కుమార్ (జేఎంఎం), డానిష్ అలీ (జేడీఎస్), బద్రుద్దీన్ అజ్మల్ (ఏఐయూడీఎఫ్), ఎన్కే ప్రేమ్‌చంద్రన్ (ఆర్ఎస్పీ), మొహమ్మద్ బషీర్ (ఐయూఎంఎల్) కూడా వచ్చారు.

అలీ అన్వర్‌పై జేడీయూ వేటు

కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన విపక్షాల భేటీకి హాజరైనందుకు తమ రాజ్యసభ సభ్యుడు అలీ అన్వర్ అన్సారీని జేడీయూ సస్పెండ్ చేసింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు ఆయనపై వేటు వేసినట్లు శుక్రవారం రాత్రి ప్రకటించింది. తద్వారా తమ అధ్యక్షుడు, బిహార్ సీఎం నితీశ్‌కుమార్‌ను విమర్శిస్తున్న పార్టీ మాజీ అధ్యక్షుడు శరద్ యాదవ్‌కు కూడా హెచ్చరిక చేసింది. జేడీయూలో అసమ్మతిని తనకు అనుకూలంగా మార్చుకునేందుకు సోనియా ప్రయత్నిస్తున్నారని, తమ పార్టీ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని పార్టీ అధికార ప్రతినిధి కేసీ త్యాగి ఆరోపించారు.



రాజధానిలో 'శ్రీమంతుడు'

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సినిమాలో 'శ్రీమంతుడు' పల్లెకు వెళ్లి.. ఊరిని దత్తత తీసుకుని, తనెవరో చెప్పకుండా ఊరికి మేలు చేస్తాడు. ఊరికి ఉపకారం కాదుగానీ.. ఉద్యోగుల సాధకబాధకాలు తెలుసుకునేందుకు తండ్రి ఆజ్ఞతో హైదరాబాద్‌లో అజ్ఞాతవాసం చేశాడో అభినవ శ్రీమంతుడు. అతడి పేరు హితార్థ్. తన దగ్గర పని చేసే ఉద్యోగులకు దీపావళి బోనస్‌గా.. 400 ఫ్లాట్లు, 1260 కార్లు ఇచ్చిన సూరత్ వజ్రాల వ్యాపారి.. హరేకృష్ణ ఎక్స్‌పోర్ట్స్ సంస్థ అధిపతి సావ్‌జీ ధోలాకియా గుర్తున్నారా? ఆయన సోదరుడు.. సంస్థ అధినేతల్లో ఒకరైన ఘనశ్యామ్ కుమారుడే ఈ హితార్థ్. ఆ కుటుంబంలో పుట్టే అబ్బాయిలు ఓ విశిష్ట సంప్రదాయాన్ని పాటిస్తున్నారు. అదేంటంటే.. వ్యాపార బాధ్యతలు స్వీకరించడానికి ముందు కొంతకాలంపాటు ఒక సామాన్యుడిలా జీవితం గడపాలి. అప్పుడే చిన్న ఉద్యోగుల ఇబ్బందులు, సమస్యలు ఎలా ఉంటాయో తెలుస్తుందని ఈ ఏర్పాటు. అందులో భాగంగానే హితార్థ్ హైదరాబాద్‌లో నెలరోజుల పాటు ఉన్నారు. వారానికి ఒకటి చొప్పున నాలుగు ఉద్యోగాలు చేసిన హితార్థ్ శుక్రవారం ఇక్కడ ఒక హోటల్‌లో తన కుటుంబ సభ్యులైన సావ్‌జీ ధోలాకియా, పెద్దమ్మ గౌరీ బెన్, సోదరుడు పింటూ తులసీ భట్ ధొలాకియా, సోదరి కృపాలి, ఐపీఎస్ అధికారి రాజీవ్ త్రివేదితో కలిసి మీడియాతో మాట్లాడారు. ఇండియా మ్యాప్‌లో హైదరాబాద్ నగరం ఎక్కడుంటుందో కూడా తనకు తెలియదని.. అలాంటిది ఇక్కడ ఎన్నో మధురానుభూతులను సొంతం చేసుకున్నానని చెప్పారు. తన ఐడెంటిటీ తెలుపకుండా నాలుగు చోట్ల ఉద్యోగం చేశానని.. హైదరాబాదీల ఆదరణ ఎన్నటికీ మరువలేనని పేర్కొన్నారు. ఈ నగరం తనకు ఎంతో ఇచ్చిందని.. తానూ హైదరాబాద్‌కు ఎంతోకొంత ఇవ్వడానికి ప్రయత్నిస్తానని చెప్పారు.

బజ్జున్న వ్యాపారాలు!

జీఎస్టీ ప్రభావంతో కుదేలు

- **హోటల్ 30%, ఫర్నిచర్ 50% క్షీణత**
- **జనరల్ బజార్‌లో 80% పడిన వ్యాపారం**
- **నాన్ ఏసీలోనూ ఏసీ జీఎస్టీ అమలు**

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): హోటల్ కుదేలు! ఫర్నిచర్ బెంబేలు! జనరల్ బజార్ గగ్గోలు! బేగం బజార్ ఎగవేతలు! ఏ రంగం చూసినా ఏమున్నది గర్వకారణం వ్యాపారం సమస్తం జీఎస్టీతో కుయ్యో మొర్రో! జీఎస్టీ అమల్లోకి వచ్చిన నెల రోజుల తర్వాత నగరంలో ఇదీ పరిస్థితి. హోల్‌సేల్ మార్కెట్ నుంచి మాల్స్, రీటెయిల్ మార్కెట్ వరకూ ఏ ఒక్కరూ సంతోషంగా లేరు.

30% తగ్గిన హోటల్ వ్యాపారం

జీఎస్టీ దెబ్బకు హోటల్ రంగం కుదేలవుతోంది. ఏసీ హోటళ్లలో అమలవుతున్న 18 శాతం జీఎస్టీతో ఒక్కసారిగా 25-30 శాతం వ్యాపారం పడిపోయిందని పలు హోటళ్ల నిర్వాహకులు గగ్గోలు పెడుతున్నారు. నష్టాలను భరించలేక కొంతమంది మూసేస్తున్నారు. దీని ప్రభావంతో హోటళ్లతోపాటు టూరిజం కూడా సంక్షోభంలో పడక తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏసీతోపాటు నాన్ ఏసీ సెక్షన్లకూ 18 శాతం జీఎస్టీ వడ్డిస్తున్నారని హోటళ్ల యజమానులు చెబుతున్నారు.

పడిపోయిన ఫర్నిచర్ కొనుగోళ్లు

ఫర్నిచర్ కొనుగోలు చేస్తే గతంలో 14.5 శాతం పన్ను చెల్లిస్తే సరిపోయేది. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత అది కాస్తా 28 శాతానికి పెరిగింది. సోఫా సెట్లు, మంచాలు, టేబుళ్లు, కుర్చీలు.. ఇలా వస్తువుల ధరలన్నీ పెరిగాయి. గతంలో సోఫా సెట్ రూ.12 వేలు ఉంటే, ఇప్పుడు వెయ్యి నుంచి రూ.2000 ఎక్కువ చెబుతున్నారు. దాంతో, ఫర్నిచర్ వ్యాపారం ఒక్కసారిగా 50 శాతానికి పడిపోయింది.



గొల్లుమంటున్న జనరల్ బజార్

సికింద్రాబాద్ జనరల్ బజార్‌లో జీఎస్టీ ప్రభావం తీవ్రంగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక రిటైల్ వ్యాపారులు ఇప్పటికీ జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. ఫలితంగా రోజూ 20 నుంచి 50 లక్షల వరకూ క్రయవిక్రయాలు జరిపే వ్యాపారులు ఇప్పుడు మూడు నుంచి నాలుగు లక్షల రూపాయలకు వ్యాపారం పడిపోయిందని గొల్లుమంటున్నారు.

బేగం బజార్‌లో తగ్గిన జీరో దందా

రాష్ట్రంలో జీరో దందాకు ప్రధాన కేంద్రం బేగం బజార్. నగరానికి, ఇతర జిల్లాలకు ఇక్కడి నుంచే భారీఎత్తున కొనుగోళ్లు జరుగుతాయి. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత 20% బిల్లులతో లావాదేవీలు జరుగుతున్నా, ఇంకా 80% జీరో దందానే సాగుతోంది. అయినా, నెల రోజులుగా వ్యాపారాలు తగ్గుముఖం పట్టాయి. కచ్చితంగా బిల్లు కావాలని అడిగితే ఇస్తున్నారు కానీ జీఎస్టీ వసూలు చేస్తున్నారు.

హోటల్స్‌పై తీవ్ర ప్రభావం: ఎస్.వెంకట్ రెడ్డి, హోటల్స్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

హోటల్ రంగంపై జీఎస్టీ తీవ్ర ప్రభావం చూపుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 25-30 శాతం వ్యాపారం కుదేలైంది. జీఎస్టీని ఐదు శాతానికి తగ్గించాలని మొదటినుంచీ డిమాండ్ చేస్తున్నాం.

ఉద్యోగులకు దిక్సూచి.. ఉద్యమాల్లో సవ్యసాచి

- **70 ఏళ్ల టీఎన్జీఓఏ ప్రత్యేకతలెన్నో**
- **దేశంలోనే పెద్ద ఉద్యోగ సంఘం**
- **రెండు రోజుల పాటు వేడుకలు**
- **సీఎం సహా ప్రముఖుల హాజరు**

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీఓఏ).. తొలి, మలి విడత తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాల్లో అత్యంత కీలక పాత్ర పోషించిన సంఘం. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో, డిమాండ్ల సాధనలో వారికి చుక్కానిగా నిలిచిన సంఘం. దేశంలోని అతి పెద్ద ఉద్యోగుల సంఘాల్లో ఒకటిగా నిలబడడమే కాకుండా సుదీర్ఘ చరిత్రలో మరెన్నో ప్రత్యేకతలు ఉన్న సంఘం. సంఘం 70 వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు నాయకులు సన్నాహాలు చేస్తున్నారు. 1946 ఆగస్టు 20న హైదరాబాద్ రాష్ట్రంలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఓ ఫర్మానా ద్వారా హైదరాబాదీ సర్కారీ ములాజిన్ యూనియన్ పేరుతో ఏర్పడిన ఈ సంఘానికి మొదటి అధ్యక్షునిగా అబ్దుల్ గఫార్ నియమితులయ్యారు. 1965లో టీఎన్జీఓఏగా రూపు దిద్దుకుంది. టీఎన్జీఓఏకి మొదటి అధ్యక్షుడిగా కేఆర్ ఆమోస్ పనిచేశారు. ఇప్పటి వరకు ఆరుగురు అధ్యక్షులు పని చేశారు. మొదటగా రామకృష్ణారావు, ఆ తర్వాత వరుసగా స్వామినాథం, కృష్ణారెడ్డి, సుధాకర్, స్వామిగౌడ్, దేవీ ప్రసాదరావు అధ్యక్షులుగా పనిచేశారు. ప్రస్తుతం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కారం రవీందర్ రెడ్డి, మామిళ్ళ రాజేందర్ వ్యవహరిస్తున్నారు. ఈ నెల చివరి వారంలో లేదా వచ్చే నెల మొదటి వారంలో 'టీఎన్జీఓఏ 70 ఏళ్ళు' పేరిట హైదరాబాద్ హైటెక్ సిటీలో రెండు రోజుల పాటు భారీ సదస్సు నిర్వహించనున్నారు. మొదటి రోజు సంఘం స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం, రెండో రోజు వేడుకలు నిర్వహించనున్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యోగులు పోరాడిన తీరు, ఉద్యమ చరిత్రపై డాక్యుమెంటరీ ప్రదర్శన, ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నారు.

రివర్స్ గేర్..



బేర్ పట్టులో మార్కెట్

సెన్సెక్స్ 317 పాయింట్లు డౌన్.. బ్లాక్ ఫ్రైడే.. ఈ వారమంతా నష్టాలే

దేశీ, అంతర్జాతీయ పరిణామాల ప్రభావంతో దేశీయ మార్కెట్లో మొదలైన ప్రకంపనలు కొనసాగుతున్నాయి. వరుసగా ఐదో రోజూ స్టాక్ మార్కెట్లు నష్టాలతోనే ముగిసాయి. ఆర్థిక సర్వే భవిష్యత్ అంచనాలు ప్రోత్సాహకరంగా లేకపోవడం కూడా మార్కెట్‌ను మరింత కుంగదీసింది. శుక్రవారం నాడు నష్టాలతోనే మొదలైన సెన్సెక్స్ 317 పాయింట్ల నికర నష్టంతో 31213 పాయింట్ల వద్ద ముగిసింది. జూలై 4 తర్వాత కీలకసూచీ ఇంత బలహీనంగా ఎప్పుడూ ముగియలేదు. నిఫ్టీ ఇంట్రాడేలో భారీ నష్టాలతో 9700 దిగువకు పడిపోవడంతో ఇన్వెస్టర్లు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఆఖరులో 109 పాయింట్ల నికర నష్టంతో నిఫ్టీ 9700 ఎగువన 9710 వద్ద ముగిసింది. కొన్ని వారాలుగా బుల్ రన్‌తో పండుగ జరుపుకుంటున్న స్టాక్ మార్కెట్లో ఈ వారం తీవ్ర కలవరాన్ని సృష్టించింది. వారం మొత్తంపై సెన్సెక్స్ 1111 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ 355 పాయింట్లు పతనమైంది. దాదాపు అన్ని విభాగాల్లోనూ షేర్లు నష్టాలతోనే ముగిసాయి. మెటల్, ఆటో, రియల్టీ, పీఎస్‌యు, ఇన్‌ఫ్రా షేర్లు భారీగా నష్టపోయాయి. మొత్తం 1525 షేర్లు నష్టాలతో ముగియగా 1003 షేర్లు లాభపడ్డాయి.

అమెరికా, ఉత్తర కొరియా మధ్య ఉద్రిక్తత దేశీ మార్కెట్లతోపాటు అంతర్జాతీయంగా అన్ని మార్కెట్లనూ ప్రభావితం చేస్తోంది. డొల్ల కంపెనీలనే ఆరోపణలతో 331 కంపెనీలపై సెబి ఆదేశాల మేరకు స్టాక్ ఎక్స్చేంజీలు ఆంక్షలు విధించడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను నీరుగార్చింది. ఈ పరిణామాలకు తోడుగా శుక్రవారం వెలువడిన మధ్యంతర ఆర్థిక సర్వేలో ఈ ఆర్థిక సంవత్సరంలో 6.75-7.5 శాతం వృద్ధి రేటు కష్టమేనని తేల్చిచెప్పడం దేశీ ఇన్వెస్టర్లను మరింత భయపెట్టింది.

భారీ లాభాల్లో కొచ్చిన్ షిప్‌యార్డ్

ఇటీవల పబ్లిక్ ఇష్యూకు వచ్చిన ప్రభుత్వ రంగ సంస్థ కొచ్చిన్ షిప్‌యార్డ్ షేర్లు శుక్రవారం నాడు స్టాక్ మార్కెట్లలో లిస్టయ్యాయి. మార్కెట్లలో సాధారణ ట్రెండ్ నెగెటివ్‌గా ఉన్నప్పటికీ ఈ షేరు మాత్రం ఆఫర్ ధరతో పోలిస్తే 22 శాతం ప్రీమియం 522 రూపాయల గరిష్ఠ స్థాయివద్ద ముగిసింది. పబ్లిక్ ఇష్యూ ఆఫర్ ధర 432 రూపాయలతో పోలిస్తే స్వల్పలాభంతో 435 రూపాయల వద్ద ఈ షేర్లు లిస్టయ్యాయి. ఆ వెంటనే గరిష్ఠ స్థాయికి దూసుకుపోయి ట్రేడింగ్ పూర్తయ్యే వరకు అదే స్థాయిలో నిలబడ్డాయి. ఈ ఇష్యూ దాదాపు 76 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయింది.

- జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో మెరుగైన ఫలితాలను ప్రకటించినప్పటికీ ఎస్‌బీఐ షేరు ధర 5.4 శాతం నష్టపోయింది. ఎల్ అండ్ టి, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎం అండ్ ఎం... సెన్సెక్స్ పతనంలో ముఖ్యభూమిక పోషించాయి.
- శాట్ ఆదేశాలతో ట్రేడింగ్‌పై ఆంక్షలు ఎత్తివేయడంతో పార్శ్వనాథ్ డెవలపర్స్, ప్రకాష్ ఇండస్ట్రీస్‌లో ట్రేడింగ్ మళ్లీ మొదలైంది. అయితే ఈ రెండు షేర్లు 20 శాతం నష్టపోయాయి.
- తీవ్ర ప్రతికూల వాతావరణంలోనూ టాటా గ్లోబల్ బెవరేజెస్ షేరు మాత్రం 5 శాతం లాభపడింది. క్యూ1 ఫలితాలు షేరు ధర పెరుగుదలకు కారణం.
- ప్రధాన షేర్లలో డాక్టర్ రెడ్డీస్, టాటా మోటార్స్ డీవీఆర్, అరబిందో లాభాలతో ముగిసాయి.

దిగజారిన పారిశ్రామికం

న్యూఢిల్లీ : పారిశ్రామికోత్పత్తి జూన్ నెలలో తిరోగమనం బాట పట్టింది. తయారీ, యంత్రపరికరాల రంగాలు క్షీణత నమోదు చేయడంతో పాటు మైనింగ్, విద్యుత్ ఉత్పత్తి, మౌలిక వసతులు-నిర్మాణ రంగ వస్తువులు, కన్స్యూమర్ డ్యూరబుల్స్ విభాగాలు అత్యంత నిరాశాజనకమైన పనితీరు ప్రదర్శించడంతో పారిశ్రామికోత్పత్తి సూచి (ఐఐపి) ఆధారంగా లెక్కించే పారిశ్రామికోత్పత్తి 0.1 శాతం ప్రతికూల వృద్ధిని నమోదు చేసింది. గత జూన్‌లో నమోదైన వృద్ధి 8 శాతం. ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో కూడా పారిశ్రామికోత్పత్తి 7.1 శాతం నుంచి 2 శాతానికి మందగించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో నమోదైన మొదటి ప్రతికూల వృద్ధి ఇదే. సూచిలో 77 శాతం వాటా ఉన్న తయారీ రంగం 0.4 శాతానికి దిగజారగా మైనింగ్ రంగం 0.4 శాతం, విద్యుత్ ఉత్పత్తి రంగం 2.1 శాతం ప్రతికూల వృద్ధిని నమోదు చేశాయి. ప్రధానంగా పారిశ్రామిక పెట్టుబడులకు ప్రధాన సూచికగా నిలిచే యంత్రపరికరాల రంగంలో వృద్ధి 14.8 శాతం నుంచి 6.8 శాతానికి దిగజారింది. ప్రైమరీ వస్తువుల విభాగంలో వృద్ధి 8.2 శాతం నుంచి 0.2 శాతానికి, ఇంటర్మీడియేట్ వస్తువుల విభాగంలో వృద్ధి 6 శాతం నుంచి 0.6 శాతానికి దిగజారింది. తయారీ రంగంలోని మొత్తం 23 పారిశ్రామిక విభాగాల్లో 15 ప్రతికూల వృద్ధిని నమోదు చేశాయి.



పార్శ్వనాథ్, కవిత్ ఇండస్ట్రీస్‌పై ఆంక్షల ఎత్తివేత

పార్శ్వనాథ్ డెవలపర్స్, కవిత్ ఇండస్ట్రీస్ షేర్ ట్రేడింగ్‌పై విధించిన ఆంక్షలను ఎత్తివేయాల్సిందిగా స్టాక్ ఎక్స్చేంజీలను సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఆదేశించింది. డొల్ల కంపెనీలనే ఆరోపణతో సెబి ఆదేశాల మేరకు 331 కంపెనీల షేర్ల ట్రేడింగ్‌పై ప్రధాన స్టాక్ ఎక్స్చేంజ్‌లు ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. ఈ కంపెనీల్లో కొన్ని పేరున్న కంపెనీలు కావడం వీటిలో దేశీ, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లకు కూడా చెప్పుకోదగిన స్థాయిలో వాటా ఉండటంతో మార్కెట్లో తీవ్ర అలజడి చెలరేగింది. ఈ ఆంక్షలను సవాలు చేస్తూ పార్శ్వనాథ్ డెవలపర్స్, కవిత్ ఇండస్ట్రీస్‌తో సహా కొన్ని కంపెనీలు శాట్‌ను ఆశ్రయించాయి. జె కుమార్ ఇన్‌ఫ్రా, ప్రకాష్ ఇండస్ట్రీస్ షేర్లపై ఆంక్షలను ఎత్తివేయాల్సిందిగా గురువారం నాడే శాట్ ఆదేశించింది. తాజాగా పార్శ్వనాథ్, కవిత్ ఇండస్ట్రీస్‌కు ఊరట లభించింది. పార్శ్వనాథ్ డెవలపర్స్ ఢిల్లీ కేంద్రంగా రియల్టీ వ్యాపారంలో ఉంది. గుజరాత్‌కు చెందిన కవిత్ ఇండస్ట్రీస్ వంట నూనెల ఉత్పత్తిలో ఉంది.

రూ.100 కోట్లతో హర్యానాలో ప్లాంట్

- ఈ ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి ప్రారంభం
- విశాకా ఇండస్ట్రీస్ క్యూ1 లాభం 23 కోట్లు



వంశీ కృష్ణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భవన నిర్మాణ సామగ్రి తయారీ రంగంలోని విశాకా ఇండస్ట్రీస్ కొత్త తరానికి చెందిన ఆధునిక టెక్నాలజీతో కూడిన ఉత్పత్తుల కోసం హర్యానాలోని జజ్జర్‌లో కొత్త ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. 100 కోట్ల రూపాయలు పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న ఈ ప్లాంట్ నిర్మాణం ఇప్పటికే ప్రారంభమైందని, ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఆ ప్లాంట్ ఉత్పత్తులు మార్కెట్లోకి వస్తాయని కంపెనీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ జి వంశీ కృష్ణ తెలిపారు. శుక్రవారంనాడిక్కడ కంపెనీ మొదటి త్రైమాసిక ఫలితాలను ప్రకటించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం మిర్యాలగూడ, పుణెలో రెండు ప్లాంట్లు పని చేస్తున్నాయని, ఆ ప్లాంట్ల ఉత్పాదక సామర్థ్యం నెలకి 10 వేల టన్నులని, కొత్త ప్లాంట్‌తో ఈ సామర్థ్యం 16 వేల టన్నులకు చేరుతుందని చెప్పారు. మూడు ప్లాంట్ల వార్షిక ఉత్పాదక సామర్థ్యం 1.9 లక్షల టన్నులు దాటుతుందని ఆయన తెలిపారు.

నిప్పును, నీటిని తట్టుకునే వి నెక్స్ట్

తాము కొత్తగా ప్రవేశపెట్టిన వి నెక్స్ట్ భవన నిర్మాణంలో సంచలనం అవుతుందని వంశీ అన్నారు. వీటిని ఉపయోగించడం వల్ల అగ్ని ప్రమాదాలు, జల ప్రళయాల నుంచి తట్టుకోగల భవనాలు నిర్మించవచ్చునని ఆయన తెలిపారు. గోడల నిర్మాణంలో ఉపయోగించే ఈ ఉత్పత్తుల ధర చదరపు అడుగు 175 నుంచి 195 రూపాయలుంటుందని, ఇతర ఉత్పత్తులతో పోలిస్తే ఇవి సగం ధరకే అందుబాటులో ఉంటాయని, దీని వల్ల భవన నిర్మాణ వ్యయం తగ్గుతుందని చెప్పారు. వీటికి సిఐఐ గ్రీన్ బిజినెస్ సర్టిఫికేషన్ లభించిందని, ఈ తరహ సాధించిన తొలి కంపెనీ తమదేనని ఆయన అన్నారు. భవన నిర్మాణ సమయం తగ్గడంతో పాటు కార్పెట్ ఏరియా పెరుగుతుందని, ఇళ్ల కొనుగోలుదారులకు మరింత విశాలమైన గదులు లభిస్తాయని ఆయన చెప్పారు.

క్యూ1 లాభాలకు జీఎస్‌టీ, డీమా గండి

ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసిక లాభాలకు తొలుత పెద్ద నోట్ల రద్దు, ఆ తర్వాత జీఎస్‌టీ వేగ నిరోధకాలుగా నిలిచాయని వంశీ కృష్ణ అన్నారు. అయినప్పటికీ తాము గత ఏడాదితో పోల్చితే మెరుగైన ఫలితాలను ప్రకటించగలిగామని ఆయన చెప్పారు. జూన్ 30వ తేదీతో ముగిసిన త్రైమాసికంలో 342.3 కోట్ల రూపాయల ఆదాయంపై 22.95 కోట్ల రూపాయల నికరలాభాన్ని ఆర్జించినట్లు ఆయన తెలిపారు. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన ఆదాయం 342.88 కోట్ల రూపాయలు కాగా నికరలాభం 16.67 కోట్ల రూపాయలుగా ఉందన్నారు. గత ఏడాదితో పోల్చితే త్రైమాసిక ఆదాయం నిలకడగానే ఉన్నప్పటికీ వడ్డీ వ్యయాల తగ్గుదల, పోటీ సామర్థ్యం పెంచుకోవడం వంటి చర్యల వల్ల లాభంలో మంచి వృద్ధిని సాధించగలిగామన్నారు.

భవిష్యత్తులో జీఎస్‌టీ తమకు లాభదాయకమే అవుతుందని, ఏడాది మొత్తం మీద 20 శాతం వరకు వ్యాపారంలో వృద్ధిని తాము అంచనా వేస్తున్నామని వంశీ చెప్పారు. భవన నిర్మాణ సామాగ్రిపై పన్ను రేటు 28 శాతం ఉండేదని, జీఎస్‌టీలో అది 18 శాతానికి తగ్గడం వల్ల ఉత్పత్తుల ధరలు కూడా 10 శాతం మేరకు తగ్గే ఆస్కారం ఉన్నట్లు తెలిపారు.

మార్కెట్లోకి సామ్‌సంగ్ ఫ్లెక్స్‌వాష్



- ధర రూ.1.45 లక్షలు
- వాషింగ్ మిషన్ విభాగంలో నెంబర్ 1 లక్ష్యం

58	183	పట్టా	మెట్ట	1.020	గంగిరెడ్డి వెంకట్‌రెడ్డి తండ్రి నర్సింహ్మారెడ్డి	కోతోల్ల బుడ్డ బాలయ్య తండ్రి సాయిలు	151	182	184	155
59	183	పట్టా	మెట్ట	0.150	గంగిరెడ్డి వెంకట్‌రెడ్డి తండ్రి నర్సింహ్మారెడ్డి	ఎద్దుల లింగారెడ్డి తండ్రి బాల్‌రెడ్డి	151	182	184	155
60	183	పట్టా	మెట్ట	1.220	గంగిరెడ్డి వెంకట్‌రెడ్డి తండ్రి నర్సింహ్మారెడ్డి	కోతోల్ల తిక్క బాలయ్య తండ్రి సాయిలు	151	182	184	155
61	183	పట్టా	మెట్ట	1.020	గంగిరెడ్డి వెంకట్‌రెడ్డి తండ్రి నర్సింహ్మారెడ్డి	కోతోల్ల రాములు తండ్రి బక్కయ్య	151	182	184	155
62	183	పట్టా	మెట్ట	1.030	గంగిరెడ్డి వెంకట్‌రెడ్డి తండ్రి నర్సింహ్మారెడ్డి	మందపురం పెద్ద సవరయ్య తండ్రి కర్రె మశయ్య	151	182	184	155
63	148	పట్టా	మెట్ట	2.200	తువగుండు బిచ్చయ్య తండ్రి సాయన్న	కుమార కోటయ్య తండ్రి గాలయ్య కుమార రాములు తండ్రి గాలయ్య కుమార లక్ష్మయ్య తండ్రి గాలయ్య	146	192	గ్రామ శివారు	149
64	148	పట్టా	మెట్ట	2.200	బోయ పుల్లమ్మ భర్త నర్సింహ్మా లక్ష్మీదేవమ్మ భర్త స్వామి నిరంజన్ తండ్రి స్వామి బోయ చంద్రయ్య తండ్రి బిచ్చయ్య బోయ కురుమయ్య తండ్రి నర్సింహ్మా	క్యాసాని నర్సింగమ్మ భర్త రాములు	146	192	గ్రామ శివారు	149
65	183	పట్టా	మెట్ట	2.200	ఎగంగి రెడ్డి తండ్రి నర్సింహ్మారెడ్డి	ఎబిచ్చిరెడ్డి తండ్రి నర్సింహ్మారెడ్డి	151	182	184	155
66	192	పట్టా	మెట్ట	2.000	క్యాసాని నర్సింగమ్మ భర్త రాములు	తైలి బాలస్వామి తండ్రి బాలయ్య	185	193	గ్రామ శివారు	191
67	192	పట్టా	మెట్ట	0.270	బోయ కుమార్ రాములు తండ్రి గాలయ్య లక్ష్మయ్య తండ్రి గాలయ్య	జనమోని బాలయ్య తండ్రి భీమయ్య	185	193	గ్రామ శివారు	191
68	192	పట్టా	మెట్ట	0.260	బోయ కుమార్ రాములు తండ్రి గాలయ్య లక్ష్మయ్య తండ్రి గాలయ్య	జనమోని బాలయ్య తండ్రి భీమయ్య	185	193	గ్రామ శివారు	191
69	192	పట్టా	మెట్ట	0.270	క్యాసాని నర్సింగమ్మ భర్త రాములు	జనమోని శేషయ్య తండ్రి భీమయ్య	185	193	గ్రామ శివారు	191
70	58	పట్టా	మెట్ట	0.080	ఎస్.శ్రీనివాస్‌రెడ్డి	ఎస్.శ్రీనివాస్‌రెడ్డి	57	42	47	59
71	197	లావుని పట్ట	మెట్ట	2.000	ఎ.బసమ్మ భర్త రాజేందర్	ఎ.బసమ్మ భర్త రాజేందర్	196	గ్రామ శివారు	గ్రామ శివారు	178
72	197	లావుని పట్ట	మెట్ట	2.000	ఇందిరమ్మ భర్త రాజశేఖర్	ఇందిరమ్మ భర్త రాజశేఖర్	196	గ్రామ శివారు	గ్రామ శివారు	178
73	36	లావుని పట్ట	మెట్ట	0.100	పెద్ద బాలయ్య తండ్రి అయ్యన్న	పెద్ద బాలయ్య తండ్రి అయ్యన్న	21	29	18	39
74	36	లావుని పట్ట	మెట్ట	0.100	చిన్న బాలయ్య తండ్రి అయ్యన్న	చిన్న బాలయ్య తండ్రి అయ్యన్న	21	29	18	39
75	36	లావుని పట్ట	మెట్ట	0.100	చెన్నయ్య తండ్రి అయ్యన్న	చెన్నయ్య తండ్రి అయ్యన్న	21	29	18	39
76	860	లావుని పట్ట	మెట్ట	0.100	బైని పెద్ద ఎల్లయ్య తండ్రి పెద్ద మాశన్న	బైని పెద్ద ఎల్లయ్య తండ్రి పెద్ద మాశన్న	72	890	63	గ్రామ శివారు
77	860	లావుని పట్ట	మెట్ట	0.100	బైని గోవిందు తండ్రి పెద్ద మాశన్న	బైని గోవిందు తండ్రి పెద్ద మాశన్న	72	890	63	గ్రామ శివారు
78	860	లావుని పట్ట	మెట్ట	0.100	బైని శ్రీరాములు తండ్రి పెద్ద మాశన్న	బైని శ్రీరాములు తండ్రి పెద్ద మాశన్న	72	890	63	గ్రామ శివారు
79	860	లావుని పట్ట	మెట్ట	0.245	బైని గోవర్ధన్ తండ్రి పెద్ద మాశన్న	బైని గోవర్ధన్ తండ్రి పెద్ద మాశన్న	72	890	63	గ్రామ శివారు
80	860	లావుని పట్ట	మెట్ట	0.245	బి.బాలస్వామి తండ్రి బక్కయ్య	బి.బాలస్వామి తండ్రి బక్కయ్య	72	890	63	గ్రామ శివారు
81	860	లావుని పట్ట	మెట్ట	0.245	వి.బొజ్జయ్య తండ్రి బక్కయ్య	వి.బొజ్జయ్య తండ్రి బక్కయ్య	72	890	63	గ్రామ శివారు
82	860	లావుని పట్ట	మెట్ట	0.245	వి.నారాయణ తండ్రి బక్కయ్య	వి.నారాయణ తండ్రి బక్కయ్య	72	890	63	గ్రామ శివారు
83	860	లావుని పట్ట	మెట్ట	0.290	వి.శాంతయ్య తండ్రి బక్కయ్య	వి.శాంతయ్య తండ్రి బక్కయ్య	72	890	63	గ్రామ శివారు
84	860	లావుని పట్ట	మెట్ట	0.240	రాములు తండ్రి వెంకయ్య	రాములు తండ్రి వెంకయ్య	72	890	63	గ్రామ శివారు
85	860	లావుని పట్ట	మెట్ట	0.360	వీరపాగ బాలస్వామి తండ్రి ఎర్రయ్య	వీరపాగ బాలస్వామి తండ్రి ఎర్రయ్య	72	890	63	గ్రామ శివారు
86	70	లావుని పట్ట	మెట్ట	0.200	పబ్బతి బాలయ్య తండ్రి దానయ్య	పబ్బతి బాలయ్య తండ్రి దానయ్య	83	ఇ261	69	71
87	130	లావుని పట్ట	మెట్ట	3.000	బక్కమ్మ భర్త సంపన్న	బక్కమ్మ భర్త సంపన్న	129	136	138	127
88	121	లావుని పట్ట	మెట్ట	3.000	ద్యాపరి రాముడు తండ్రి సంపన్న	ద్యాపరి రాముడు తండ్రి సంపన్న	గ్రామ శివారు	122	గ్రామ శివారు	177
89	36	లావుని పట్ట	మెట్ట	4.000	జి.రవీందర్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి	జి.రవీందర్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి	21	29	18	39
90	36	లావుని పట్ట	మెట్ట	0.310	బి.చంద్రయ్య తండ్రి జమ్ములయ్య	బి.చంద్రయ్య తండ్రి జమ్ములయ్య	21	29	18	39
91	36	లావుని పట్ట	మెట్ట	0.310	బి.వెంకటయ్య తండ్రి జమ్ములయ్య	బి.వెంకటయ్య తండ్రి జమ్ములయ్య	21	29	18	39
92	36	లావుని పట్ట	మెట్ట	0.050	బి.వెంకటయ్య తండ్రి జమ్ములయ్య	బి.వెంకటయ్య తండ్రి జమ్ములయ్య	21	29	18	39
93	36	లావుని పట్ట	మెట్ట	0.050	బి.చంద్రయ్య తండ్రి జమ్ములయ్య	బి.చంద్రయ్య తండ్రి జమ్ములయ్య	21	29	18	39
94	36	లావుని పట్ట	మెట్ట	0.310	బి.కృష్ణయ్య తండ్రి జమ్ములయ్య	బి.కృష్ణయ్య తండ్రి జమ్ములయ్య	21	29	18	39
95	36	లావుని పట్ట	మెట్ట	0.050	బి.కృష్ణయ్య తండ్రి జమ్ములయ్య	బి.కృష్ణయ్య తండ్రి జమ్ములయ్య	21	29	18	39
96	860	లావుని పట్ట	మెట్ట	1.000	సంగనమోని కృష్ణయ్య తండ్రి నారాయణ	సంగనమోని కృష్ణయ్య తండ్రి నారాయణ	72	890	63	గ్రామ శివారు
			మొత్తం	106.37 1/2						

భూసేకరణ పునరావాస మరియు రిసెటిల్మెంట్ (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం నెం 21 ఆఫ్ 2017) పారదర్శకత మరియు పరిహారాన్ని కొరకు హక్కు చట్టం ద్వారా సవరించబడిన విధముగా భూ సేకరణ పునరావాసన మరియు రిసెటిల్మెంట్ (తెలంగాణ సవరణ) చట్టం 2013 (కేంద్ర చట్టము నెం. 30/2013)లో సక్రమ పరిహారం మరియు పారదర్శక హక్కు యొక్క సెక్షన్ 11(1) యొక్క నిబంధనల క్రింద ఇందుకు సంబంధించిన వారందరికి ఈ ప్రకటన చేయబడినది.

భూమి యొక్క ప్లాన్ జిల్లా కలెక్టర్, వనపర్తి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, వనపర్తి భూసేకరణ వారి కార్యాలయములో ఏదైనా పని దినములలో పరిశీలించుకొనవచ్చును. తెలంగాణ ప్రభుత్వం / కలెక్టర్ కం సరియైన ప్రభుత్వము సదరు చట్టం యొక్క సెక్షన్ 12లో తెలిపిన మరియు నిర్దేశిత విధంగా వారి పనిని సరిగా చేపట్టుట కొరకు అవసరమైన అన్ని ఇతర చట్టాలను చేయుటకు & భూమిలోనికి ప్రవేశించుటకు మరియు సరిగా చేయుటకు ఏదేని భూమి యొక్క ఎత్తుపల్లాలు తీసుకొనుటకు సబ్ సాయిల్ త్రవ్వుటకు లేదా బోర్ వేయుటకు రెవిన్యూ డివిజనల్ అధికారి మరియు అతని సిబ్బందికి అధికారాగా అధికారమిచ్చుటకు.

చట్టం సెక్షన్ 11(4) క్రింద కలెక్టర్ యొక్క ముందస్తు ఆమోదాలు లేకుండా ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి భూమి యొక్క ఏదేని లావాదేవీలు అనగా అమ్మకాలు / కొనుగోలు మొదలైనవి లేదా అటువంటి భూముల పై ఏవేని ఋణభారములు సృష్టించుటకు కారణమగుట లేదా ఏదేని లావాదేవీ ఏ వ్యక్తి చేయరాదు. పరిహారం యొక్క సంప్రదింపుల ద్వారా సెటిల్మెంట్ కొరకు ఆసక్తి / ప్రభావితమయ్యే వ్యక్తులందరి నుండి క్లెయింలు మరియు సేకరణకు అభ్యంతరాలు ఏమైనా ఉంటే భూమిలో ఆసక్తి గల వ్యక్తులు చట్టం యొక్క సెక్షన్ 15 క్రింద ఏర్పాటు ప్రకారం ఈ నోటిఫికేషన్ ప్రచురించిన తేదీ నుండి 60 (అరువది) రోజుల లోపల బూమిలో ఆసక్తి గల వ్యక్తులచే జిల్లా కలెక్టర్ / అధికృత సమక్షంలో సమర్పించవచ్చు.

సం/-
భూ సేకరణ అధికారి & రాజస్వ మండలాధికారి, వనపర్తి

సం/-
సంయుక్త కలెక్టర్ వనపర్తి

సం/-
జిల్లా కలెక్టర్ వనపర్తి

మా వాళ్లను క్షేమంగా చేర్చండి

- **ఒమన్ బాధితుల కుటుంబసభ్యుల ఆవేదన**

జగిత్యాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఒమన్‌లో ఇబ్బందులు పడుతున్న వారి కుటుంబ సభ్యులు శుక్రవారం జగిత్యాల కలెక్టరేట్‌కు తరలివచ్చారు. ఐదు మాసాలుగా జీతాలు ఇవ్వకపోవడంతో తినడానికి తిండి లేక ఇబ్బందులు పడుతున్నారని, ఇంటికి వద్దామంటే చేతిలో డబ్బులు లేక గంజి మెతుకులు తాగుతున్నారని వారి కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒమన్‌లో పేరొందిన పెట్రోన్ కంపెనీలో మంచి ఉద్యోగాలు ఉండటంతో జగిత్యాల జిల్లా నుంచి చాలా మంది ఏడెనిమిది సంవత్సరాలకు పైగా వెళ్తున్నారు. నెల నెలా జీతం ఇచ్చిన ఆ కంపెనీ ఏడాదికోసారి అదనంగా ఒక



జగిత్యాల కలెక్టరేట్ ఎదుట బాధిత కుటుంబ సభ్యులు

నెల జీతం కలిపిస్తూ వచ్చింది. అయితే ఐదారు మాసాలుగా జీతాలు ఇవ్వడం నిలిపివేసింది. ఇదేమిటంటే కంపెనీలో పని లేదని, ఇంటికి వెళ్లాలని కంపెనీ ప్రతినిధులు పేర్కొనడంతో చాలా కాలంగా పని చేస్తున్న కార్మికులు గందరగోళంలో పడ్డారు. ఐదు మాసాలుగా జీతాలు ఇవ్వకపోగా, ఏడెనిమిది సంవత్సరాలుగా చేసిన గ్రాట్యుటీ డబ్బులు కూడా ఇవ్వకుండా ఇంటికి వెళ్లాలని పేర్కొనడంతో కంపెనీ ప్రతినిధులను నిలదీశారు. దీంతో వారందరిని గదిలో బంధించడంతో కొద్ది రోజులుగా జిల్లావాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆంధ్రజ్యోతి మెయిన్, టాబ్లాయిడ్‌లో శుక్రవారం ఒమన్‌లో తెలుగువారి కష్టాలు శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఇది చూసిన ప్రవాసీ మిత్ర నిర్వాహకులు మంద భీంరెడ్డి, కడార్ల రంజిత్‌లు బాధితులను కలిసి వివరాలు సేకరించారు. అనంతరం ఒమన్ బాధిత కుటుంబీకులు శుక్రవారం జగిత్యాల కలెక్టరేట్‌కు తరలివచ్చారు.

'పీపీ రావు' ఆధునికీరణకు 2.65 కోట్లు

ఆసిఫాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండల పరిధిలోని కల్వాడ వద్ద నిర్మించిన పాల్వాయి పురుషోత్తమరావు ప్రాజెక్టు ఆధునికీకరణ పనులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించి జీవో ఆర్‌టి నెం.723 ద్వారా రూ.2.65 కోట్లకు పరిపాలనాపరమైన ఆమోద ముద్రవేసింది. ఈ ప్రాజెక్టు నిర్మించిన నాటినుంచి పెండింగ్‌లో ఉంటూ వస్తున్న ఎడమ కాలువ డి-3ని ప్రస్తుతం ఉన్న రెండు కిలోమీటర్ల నుంచి 5.36 కిలోమీటర్లకు పొడిగించేందుకు కూడా మార్గం సుగమం అయింది. ఇంతకుముందు ఈ కాలువ పొడిగింపునకు అటవీశాఖ అనుమతులు లేకపోవడంతో ఇన్నాళ్లు కాలువ నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా అటవీ క్లియరెన్స్ రావడంతో కాలువ పొడిగింపుతో పాటు లైనింగ్, స్ట్రక్చరల్ రిపేర్స్ వంటి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ఈ నిధులు విడుదల చేసింది. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. తద్వారా వచ్చే ఏడాది ముగిసే లోపు ఈ ప్రాజెక్టు కింద మొత్తం 11,150 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించనున్నారు. కొత్తగా చేపట్టనున్న నాలుగు కిలోమీటర్ల కాలువ పూర్తయితే దహెగాం, మంచిర్యాల జిల్లా వేమనపల్లి, భీమిని మండలాలకు సాగునీరందుతుందని నీటి పారుదల శాఖ ఇంజనీర్లు వెల్లడించారు.



తిరుమల శ్రీవారి కోసం ఏరువాడ జోడుపంచెలు నేస్తున్న చేనేత కార్మికులు

శ్రీవారికి గద్వాల జోడు పంచెలు

గద్వాల: తన కీర్తనలతో తిరుమల వేంకటేశ్వరుడిని అన్నమయ్య సేవిస్తే, గద్వాల చేనేత కార్మికులు తమ కళానైపుణ్యంతో ఏరువాడ జోడు పంచెలను తయారు చేసి తమ భక్తి ప్రపత్తులను చాటుకుంటున్నారు. తిరుమల తిరుపతిలో ఏటా జరిగే నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారి మూలవిరాట్టుకు తొలిరోజు ఏరువాడ జోడు పంచెలను అలంకరించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సంప్రదాయానికి గద్వాల సంస్థానాధీశుల కాలంలో అంకురార్పణ జరిగింది. సంస్థానాలు అంతరించినా ఇప్పటికీ జోడుపంచెల తయారీని కొనసాగిస్తున్నారు. ఐదుగురు చేనేత కార్మికులు నియమ నిష్ఠలతో మండల కాలం పాటు నామాల మగ్గంపై పంచెల తయారీని శ్రావణ మాసం మొదటి వారంలో ప్రారంభించారు. 28న తిరుమలలోని ఆలయ జేఈవోకు ఈ ఏరువాడ జోడు పంచెలను అందజేయనున్నారు.

వాన కోసం పొర్లు దండాలు

జడ్చర్ల: బాగా వానలు పడుతాయని రైతన్నలు కోటి ఆశలతో పంటలు వేసింద్రు. ముఖం చూపించినట్లే చూపించి వాన మాయమైంది. పంటలు ఎండుతున్నయ్.. అన్నదాత ఆశలు ఆవిరవుతుండడంతో ఆ యువకుడు చలించిపోయిండు. నోటికాడికి ఇంత మెతుకు పోవాలంటే బాగా వానలు పడాలని దేవుడికి పొర్లుదండాలు పెట్టి సాహసం చేసిండు మహబూబ్‌నగర్ జిల్లా బాదేపల్లికి చెందిన రవితేజ. పట్టణంలోని పాతబజార్ సమీపంలోని 160 మీటర్ల ఎత్తులో ఉన్న పెద్దగుట్టపై వెలిసిన శ్రీరంగనాయకస్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేసి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న శివాలయం దాకా పొర్లుదండాలు పెట్టాడు.



పొర్లుదండాల ప్రదక్షిణ చేపట్టిన రవితేజ

సర్టిఫికెట్లు ఇవ్వలేదని తహసీల్ కార్యాలయానికి తాళం

మర్పల్లి: అధికారులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సకాలంలో ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కొందరు విద్యార్థులు, యువకులు శుక్రవారం వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేశారు. అనంతరం కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో గడువులోపే కుల, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని తహసీల్దార్ శ్రీనివాస్ విద్యార్థులకు హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.



తాళం వేసి ఆందోళన చేస్తున్న విద్యార్థులు, నిరుద్యోగులు

నేరెళ్ల ఘటనపై నివేదిక ఇవ్వండి

- **డీజీపీకి కేంద్ర మానవ హక్కుల సంఘం ఆదేశం**
- **ఎస్పీ సహా 17 మందిని సస్పెండ్ చేయాలి: బాధితులు**
- **న్యాయం కోసం ఎక్కడికైనా వెళ్తాం: అఖిలపక్షం**

న్యూఢిల్లీ/వేములవాడ/హైదరాబాద్: నేరెళ్ల ఘటనపై నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వాలని డీజీపీని కేంద్ర మానవ హక్కుల సంఘం ఆదేశించింది. ఎస్సీ, ఓబీసీలకు చెంది న 8 మందిని నిర్బంధించి చిత్రహింసలకు గురి చేశారన్న వార్తలపై పోలీసులు సరిగ్గా స్పందించ కపోవడాన్ని తప్పుబట్టింది. కాగా, తమను చిత్రహింసలకు గురిచేసిన ఎస్పీ విశ్వజిత్ కంపాటి సహా 17 మంది పోలీసులను సస్పెండ్ చేయాలని నేరెళ్ల బాధితులు డిమాండ్ చేశారు. వేములవాడలో చికిత్స పొందుతున్న బాధితులు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ పోలీసులు పెట్టిన చిత్రహింసలతో తాము ఇప్పటికీ నడవలేకపోతున్నామన్నారు. తమపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని, పునరావాసం కల్పించాలని కోరారు. మరోవైపు నేరెళ్ల ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన ప్రతి పోలీస్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలంటూ డీజీపీ అనురాగ్ శర్మకు వినతిపత్రం ఇచ్చామని అఖిలపక్ష నేతలు తెలిపారు. బాధ్యులైన సిబ్బందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేసినట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క తెలిపారు. బాధితులకు న్యాయం చేసేందుకు గవర్నర్, రాష్ట్రపతి, ఉన్నత న్యాయస్థానం వరకు వెళ్తామని టీటీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి అన్నారు. ఈ ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. పోలీసు ఉన్నతాధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం టీఆర్‌ఎస్ డిమాండ్ చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న నేరెళ్ల బాధితులు

ఎండు గంజాయి పట్టివేత

- **ఆరుగురు సాగుదారులు అరెస్టు**



వరంగల్ అర్బన్ క్రైం: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో కొత్తగా ఏర్పాటు చేసిన నార్కోటిక్స్ విభాగం అధికారులు రూ. 5 లక్షల విలువ చేసే ఎండు గంజాయిని పట్టుకున్నట్టు పోలీసు కమిషనర్ జి. సుధీర్‌బాబు వెల్లడించారు. శుక్రవారం సీపీ విలేకరులతో మాట్లాడుతూ బానోతు సక్రూ, మెరుగు గణేష్, ధారవత్ వీరన్న, ముద్దం చిన్నమల్లు, కూకట్ల ఐలయ్య, బుచ్చిరెడ్డిలు గత ఖరీఫ్ సీజన్‌లో పత్తి, మిరప పంటలో మిశ్రమపంటగా గంజాయిని సాగు చేశారని తెలిపారు. నార్కోటిక్స్ అధికారులు గంజాయిని, సాగుచేసే నిందితులను అరెస్టు చేసినట్టు చెప్పా రు. మొత్తంగా 101 కిలోల గంజాయిని పట్టుకున్నట్టు వెల్లడించారు.

వారసత్వ గోశాల ఏర్పాటు చేయండి

- **కేంద్ర మంత్రి హర్షవర్ధన్‌కు జోగురామన్న విజ్ఞప్తి**


న్యూఢిల్లీ, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): వారసత్వ గోశాలను ఆదిలాబాద్ జిల్లాలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రి జోగురామన్న కేంద్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి హర్షవర్ధన్‌ని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో ఆయన్ని కలసి విజ్ఞప్తి చేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన తరువాత ఉన్న గోశాలలు ఏపీకి వెళ్లాయని, ప్రస్తుతం తెలంగాణలో జరి, తూర్పు అనే రెండు రకాల జాతులను మెక్సికోలో జరిగిన కాగ్13లో గుర్తించారని ఈ నేపథ్యంలో తెలంగాణలో దీన్ని ఏర్పాటు అవసరాన్ని మంత్రికి వివరించినట్లు చెప్పారు. దీంట్లో కేంద్రం వాటా రూ.125కోట్లు ఉండగా మిగిలిన రూ.65కోట్లు రాష్ట్రం, స్థానిక ఎన్జీవోలు భరిస్తాయని చెప్పారు. దీనితోపాటు టీఎస్‌కాస్ట్‌కి కూడా కేటాయించిన రూ.3కోట్ల బడ్జెట్‌లో ఇప్పటి వరకు రూ.75లక్షలు మాత్రమే విడుదల చేశారని, మిగిలనవి కూడా విడుదల చేయాలని కోరామన్నారు. మరోవైపు పార్లమెంట్‌లో చట్టం చేసిన కంపానిధులుకు సంబంధించి రాష్ట్ర వాటాను కూడా సాధ్యమైనంత త్వరగా ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్లు వివరించారు. మొత్తం అన్ని అంశాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని, త్వరలో అన్ని నిధులు విడుదల చేస్తామని తెలిపినట్లు చెప్పారు.

19.88 లక్షల పశువులకు కృత్రిమ సెమెన్

- **పశుగణాభివృద్ధి, పాడి వృద్ధి ప్రధాన లక్ష్యం**

హైదరాబాద్: వచ్చే మూడేళ్లలో రైతుఆదాయాన్ని రెట్టింపు చేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం బృహత్తర ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. పశుగణాభివృద్ధి ద్వారా పాడిని గణనీయంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గర్భధారణకు అనువైన పశువులు దేశ వ్యాప్తంగా 13.05 కోట్లు ఉండగా, వాటిలో 10 కోట్ల పశువులకు ఈ ఏడాది కృత్రిమ సెమెన్ డోసులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం అన్నిరాష్ట్రాలకు టార్గెట్ నిర్దేశించింది. తెలుగు రాష్ట్రాలకు ఈ ఏడాది 79.85 లక్షల డోసులు లక్ష్యం కాగా, అందులో తెలంగాణ వాటా 19.88 లక్షల డోస్‌లు. గోకుల్ మిషన్‌కింద కేంద్రం ఈ కార్యక్రమం చేపట్టింది.గతంలో కేంద్రంటు ఇటువంటి కార్యక్రమాలు చేపట్టింది.

ధార్మిక పరిషత్ ఏర్పాటు చేయాలి



సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అర్చక సమాఖ్య సభ్యులు

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ధార్మిక పరిషత్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ అర్చక సమాఖ్య సభ్యులు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావును విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం కేసీఆర్‌కు సమాఖ్య సభ్యులు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులు, వేదపండితులను కొందరు అవినీతి అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆలయాల పరిపాలన సౌలభ్యం కోసం ఆధ్యాత్మిక వేత్తలతో ధార్మిక పరిషత్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సీఎంను కోరినట్లు అర్చక సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ అర్చక సంక్షేమ నిధిని అర్చకుల సంక్షేమానికి వినియోగించాలని విజ్ఞప్తి చేసినట్లు ఉపేంద్రశర్మ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్ పేట
నిజామాబాద్ శనివారం 12 ఆగస్టు 2017

ప్రో కబడ్డీలో నేటి మ్యాచులు

స్టార్ స్పోర్ట్స్ 2: టైటాన్స్ X యూపీ యోధా రాత్రి 8.గం

మా మూవీస్: గుజరాత్ X ఢిల్లీ రాత్రి 9.గం

9 ఈ మ్యాచ్‌లో భారత్ నెగ్గితే లంకపై అత్యధికంగా 9 విజయాలు సాధించిన జట్టుగా పాకిస్థాన్‌ను అధిగమిస్తుంది.

1 ఈ సీజన్‌లో పుజారా అత్యధిక స్కోరర్. అతను 76.63 సగటుతో 843 పరుగులు చేశాడు. కరుణరత్నె 43.85 సగటుతో 614 పరుగులు చేసి నాలుగో స్థానంలో ఉన్నాడు.

18 గత మూడేళ్లుగా శ్రీలంకలో జరిగిన మ్యాచ్‌ల్లో ఒక్క డ్రా కూడా కాలేదు. 18 మ్యాచ్‌ల్లో ఫలితం తేలింది.

బోల్ట్ ఆఖరి రేస్..!

4 x100 రిలే నేడు ● మ. 3:25కి హీట్స్

రాత్రి 2:20కి ఫైనల్ ● స్టార్‌స్పోర్ట్స్ సెలెక్ట్-2లో



లండన్: స్ప్రింట్ కింగ్ ఉసేన్ బోల్ట్ ఆఖరాటకు సమయం ఆసన్నమైంది. లండన్ వేదికగా జరుగుతున్న వరల్డ్ అథ్లెటిక్స్‌తో కెరీర్‌కు వీడ్కోలు పలకనున్న జమైకా చిరుత.. ఆఖరి పరుగుకు సిద్ధమయ్యాడు. శనివారం జరిగే పురుషుల 4 x100 రిలేతో బోల్ట్ తనకు ప్రాణపదమైన ట్రాక్‌కు గుడ్‌బై చెప్పనున్నాడు. ఈ మెగా ఈవెంట్‌లో 11 స్వర్ణాలు నెగ్గిన బోల్ట్ నేతృత్వంలోని జమైకా టీమ్ శనివారం మధ్యాహ్నం 3:25 గంటలకు జరిగే హీట్స్‌లో పోటీపడనుంది. ఈ జట్టు ఫైనల్‌కు అర్హత సాధిస్తే శనివారం అర్ధరాత్రి.. అంటే భారత కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున 2:20కి మొదలవుతుంది. ఈ రేస్‌లో విజయం సాధిస్తే బోల్ట్ ఖాతాలో 12వ స్వర్ణం చేరుతుంది.



వింటర్‌లో జహీర్, సాగరికల పెళ్లి

ముంబై: ప్రేమపక్షులు జహీర్‌ఖాన్, బాలీవుడ్ నటి సాగరిక ఘట్గే వచ్చే చలికాలంలో ఓ ఇంటివారు కానున్నారు. అయితే తేదీ నిర్ణయం కాలేదు. ఈ సంవత్సరాంతంలో తామిద్దరం పెళ్లి చేసుకోనున్నట్టు సాగరిక వెల్లడించింది. 38 ఏళ్ల టీమిండియా మాజీ పేసర్ జహీర్, సాగరికల ఎంగేజ్‌మెంట్ గత ఏప్రిల్‌లో జరిగిన సంగతి తెలిసిందే.

అడుగేస్తే చరిత్రే...

సోనీ సిక్స్ టెన్-3లలో ఉ.10 నుంచి

● విదేశాల్లో తొలి క్లీన్‌స్వీప్‌పై భారత్ గురి

● పరువు కోసం శ్రీలంక పోరాటం ● నేటి నుంచే మూడో టెస్టు



కోహ్లీ

తొలి టెస్టులో బ్యాటింగ్ పిచ్‌పై లంకను మట్టి కరిపించాం... మలిపోరులో స్పిన్ వికెట్‌పై ప్రత్యర్థిని చిత్తు చేసేశాం.. ఇప్పుడు మూడో మ్యాచ్ కోసం పచ్చిక స్వాగతం పలుకుతోంది..! పేస్‌తోనూ లంకేయులను కొట్టేస్తే.. ఓ పనైపోతుంది..! విదేశీ గడ్డపై మూడు టెస్టుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన జట్టుగా కోహ్లీసేన చరిత్ర సృష్టిస్తుంది..! మరి, రెండేళ్లుగా విజయాలనే శ్వాసగా మలుచుకున్న భారత జైత్రయాత్రను అడ్డుకునే దమ్ము ఆతిథ్య జట్టుకు ఉందా..! సిరీస్ ఎలాగూ పోయింది.. కనీసం ఆఖరాటలో గెలిచి సొంతగడ్డపై పరువైనా కాపాడుకుంటుందా..!

జట్లు (అంచనా)

భారత్: ధవన్, రాహుల్, పుజారా, కోహ్లీ (కెప్టెన్), రహానె, అశ్విన్, సాహా (కీపర్), హార్దిక్/కుల్దీప్, భువనేశ్వర్, ఉమేష్, షమి.

శ్రీలంక: తరంగ, కరుణరత్నె, కుశాల్ మెండిస్, చాందిమల్ (కెప్టెన్), మాథ్యూస్, డిక్‌వెలా (కీపర్), డిసిల్వ, దిల్‌రువాన్ పెరీర, చమీర/లక్షణ్, ఫెర్నాండో, లాహిరు కుమార.

పిచ్/వాతావరణం

పల్లెకెలె పిచ్ ఫాస్ట్ బౌలర్లకు అనుకూలిస్తుంది. మంచి పేస్‌తోపాటు బౌన్స్ లభిస్తుంది. ఈ మ్యాచ్‌కు వాన ముప్పు ఉంది. మ్యాచ్ రోజుల్లో ఎంతో కొంత వర్షం కురిసే అవకాశం ఉంది.


కాండీ: విరాట్ కోహ్లీ నేతృత్వంలోని టీమిండియా చరిత్ర ముంగిట నిలిచింది. విదేశాల్లో మూడు టెస్టుల సిరీస్‌ను తొలిసారి వైట్‌వాష్ చేసిన జట్టుగా నిలిచేందుకు మరో విజ యం దూరంలో ఉంది. ఇప్పటికే 2-0తో సిరీస్ నెగ్గి జోరు మీదున్న కోహ్లీసేన.. సొంతగడ్డపై పేలవ ఆటతీరుతో నిరాశపరుస్తున్న లంకతో శనివారం మొదలయ్యే మూడో, చివరి టెస్టులో గెలిచి రికార్డు సృష్టించాలని భావిస్తోంది. నెంబర్ వన్ హోదాలో శ్రీలంక గడ్డపై అడుగుపెట్టిన భారత్.. తొలి రెండు టెస్టుల్లో అసాధారణ ప్రదర్శన చేసింది. గాలెలో 304 పరుగులతో, కొలంబోలో ఇన్నింగ్స్ 53 పరుగుల తేడాతో ఘన విజయాలు సొంతం చేసుకొని తిరుగులేని ఫామ్‌లో ఉంది. మరోవైపు ప్రస్తుతం సంధి దశలో ఉన్న లంక వరుస వైఫల్యాలతో కొట్టు మిట్టాడుతోంది. కనీసం ఈ మ్యాచ్‌లో అయినా గెలిచి పరువు నిలబెట్టుకోవాలని ఆరాట పడుతోంది. అందుకోసం పల్లెకెలె మైదానంలో పచ్చికతో కూడిన వికెట్‌ను సిద్ధం చేసుకున్న శ్రీలంక పేస్‌తో భారత్‌ను కొట్టాలని భావిస్తోంది.

భారత్ ముగ్గురు పేసర్లతో...: తొలి రెండు మ్యాచ్‌ల్లో భారత్ అమోఘంగా రాణించింది. ఓపెనర్ల నుంచి తొమ్మిదో నెంబర్ వరకూ బ్యాట్స్‌మన్ అందరూ అద్భుత ఫామ్‌లో ఉన్నా రు. ముఖ్యంగా ఈ సీజన్‌లో అత్యధిక పరుగుల వీరుడు పుజారా లంకపై చెలరేగిపోతున్నాడు. ఈ మ్యాచ్‌లోనూ పుజారా శతకం చేస్తే.. విదేశాల్లో మూడు టెస్టుల సిరీస్‌లో మూడు సెంచరీలు చేసిన భారత తొలి క్రికెటర్‌గా నిలుస్తాడు. బ్యాట్స్‌మెన్ మరోసారి సమష్టి ప్రదర్శన చేస్తే క్లీన్‌స్వీప్ చేయడం కోహ్లీసేనకు పెద్ద కష్టమేమీ కాదు. పిచ్ స్వభావం దృష్ట్యా జడేజా స్థానాన్ని భువనేశ్వర్‌తో భర్తీ చేసే ఆలోచనలో ఉన్నాడు కోహ్లీ. హార్దిక్‌కు బదులు రెండో స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ తుది జట్టులోకి రావొచ్చు. ఇక, తొలి రెండు మ్యాచ్‌ల్లో ఘోర పరాజయాలతో లంక ఆత్మస్థయిర్యం దెబ్బతిన్నది. కొలంబోలో సెంచరీలు చేసిన కరుణరత్నె, కుశాల్ మెండిస్‌పై జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. గాయపడ్డ స్టార్ పేసర్ నువాన్ ప్రదీప్, ఏస్ స్పిన్నర్ రంగన హెరాత్ స్థానాల్లో యువ పేసర్లు కుమార, ఫెర్నాండోలను రంగంలోకి దింపుతోంది. మరి, పేస్ పిచ్‌ను, సీమర్లను నమ్ముకొని బరిలోకి దిగుతున్న శ్రీలంక ఏ మాత్రం పోటీ ఇస్తుందో చూడాలి.



లంక సారథి చాందిమల్

వీరికి..బాస్కెట్‌బాల్ కావాల్సి వచ్చిందా ?



డ్యురాంట్

న్యూఢిల్లీ: కెవిన్ డ్యురాంట్.. అమెరికా మేటి బాస్కెట్‌బాల్ ఆటగాడు. గోల్డెన్ స్టేట్ వారియర్స్‌కు ప్రాతినిధ్యం వహించే ఇతడు..ఆ జట్టుకు ఎన్‌బీఏ టైటిల్ సాధించిపెట్టాడు. అంతేకాదు..ఆ జట్టు విజేతగా నిలిచిన ఫైనల్లో కెవిన్ అత్యంత విలువైన ఆటగాడి అవార్డు అందుకున్నాడు. ఇటీవల భారత్‌లో పర్యటించిన అతడు న్యూఢిల్లీలో 3,459 మంది చిన్నారులకు బాస్కెట్‌బాల్ ఓనమాలు నేర్పాడు. ఇది అతిపెద్ద 'బాస్కెట్‌బాల్ క్లాస్'గా గిన్నిస్‌బుక్‌లోకెక్కింది. తన ఫౌండేషన్ తరపున రెండు బంతులనూ నిర్వాహకులకు అందజేశాడు. అనంతరం అతడు తాజ్‌మహల్‌ను సందర్శించాడు. తన భారత పర్యటన ప్రత్యేకమైనదిగా పేర్కొన్న డ్యురాంట్.. ఇక్కడి పరిస్థితులపై ఆశ్చర్యం ప్రకటించాడు. 'ఇండియా పర్యటన అనూహ్యంగా జరిగింది. ఇండియా అంటే ఏదో గొప్పగా అనుకున్నా. కానీ దిగాక తెలిసింది ఇక్కడ నాగరికత, ప్రజల జీవన విధానం ఎంత నాటుగా ఉందో' అని చెప్పాడు. విజ్ఞానం విషయంలో భారత్ 20 ఏళ్లు వెనక ఉందని కెవిన్ అభిప్రాయపడ్డాడు. నాగరికత అంతగా తెలియని ఇక్కడి ప్రజలకు బాస్కెట్‌బాల్ ఆట నేర్చుకోవాలనుకోవడం ఆశ్చర్యం కలిగించిందని వ్యాఖ్యానించాడు. 'తాజ్‌మహల్‌కు వెళ్లే దారి పొడవునా ఆవులు కనిపించాయి. ఇక కోతులైతే ఎక్కడపడితే అక్కడే. రోడ్లపక్కన వందలాదిమంది ప్రజలు నడుస్తుండడం గమనించాను. లక్షలాది కార్లు. మొత్తంగా నాగరికత అంతగా అబ్బని ఈ సమూహాలకు బాస్కెట్‌బాల్ ఆట కావాల్సి వచ్చింది' అని కెవిన్ పేర్కొన్నాడు.

నడాల్‌కు షాక్

● షపోవలోవ్ సంచలన విజయం

● మాంట్రియల్ మాస్టర్స్ టోర్నీ



షపోవలోవ్

మాంట్రియల్ (కెనడా): ఏటీపీ మాంట్రియల్ మాస్టర్స్ టెన్నిస్ టోర్నీలో స్పెయిన్ దిగ్గజం రఫెల్ నడాల్ అనామక ఆటగాడి చేతిలో ఓటమి ఎదుర్కొన్నాడు. ప్రీ క్వార్టర్స్‌లో నడాల్‌కు కెనడా టీనేజర్ డెనిస్ షపోవలోవ్ దిమ్మదిరిగే షాకిచ్చి సంచలనం సృష్టించాడు. గురువారం రాత్రి జరిగిన రౌండ్-16 పోరులో వైల్డ్‌కార్డ్ ఎంట్రీ షపోవలోవ్ 3-6, 6-4, 7-6 (7/4)తో మూడు సెట్లలో టాప్ సీడ్ నడాల్‌పై అద్భుత విజయం సాధించాడు.

ఆనంద్ ఎనిమిదో రౌండ్ డ్రా

సెయింట్ లూయిస్ (అమెరికా): సింక్‌ఫీల్డ్ కప్ ఎనిమిదో రౌండ్‌ను భారత గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ డ్రాగా ముగించాడు. తెల్లపావులతో తలపడిన ఆనంద్.. ఫ్రాన్స్‌కు చెందిన మాగ్జిమ్ వాషియర్ లగ్రావ్‌తో ఈ రౌండ్‌ను 30 ఎత్తుల్లో డ్రా చేసుకున్నాడు.

గుజరాత్ జోరు

● యు ముంబాపై అలవోక విజయం



అహ్మదాబాద్: ప్రో కబడ్డీ లీగ్ ఐదో అంచెలో అరంగేట్రం జట్టు గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ అదరగొడుతోంది. సొంతగడ్డపై జరిగిన తమ తొలి మ్యాచ్‌లో కెప్టెన్ సుఖేష్ హెగ్డే, రోహిత్ గుల్లా, సచిన్ తిరుగులేని ప్రదర్శన చేయడంతో యు ముంబాతో శుక్రవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 39-21తో అద్భుత విజయం సాధించింది. జోన్-ఎ పోరులో గుజరాత్‌కిది రెండో విజయం కాగా.. పటిష్ఠమైన ముంబాకిది రెండో ఓటమి. రోహిత్ (9), సచిన్ (8), అబోజర్ మిగాని (5) గుజరాత్ విజయంలో కీలకపాత్ర పోషించారు. ఆరంభం నుంచే ముంబా డిఫెన్స్‌ను ఛేదించిన సుఖేష్ సేన రెండో నిమిషంలోనే 2-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 6-0తో ఆధిక్యంలో ఉన్న దశలో రైడ్‌కు వెళ్లిన సచిన్ రెండు పాయింట్లు తెచ్చాడు. ఆ వెంటనే ముంబై రైడర్‌ను పట్టేసిన గుజరాత్ ప్రత్యర్థిని ఆరో నిమిషంలోనే ఆలౌట్ చేసి 9-1తో ఆధిక్యంలో నిలిచింది. ముంబా కెప్టెన్ అనూప్ కుమార్ వైఫల్యం కూడా ఫలితంపై ప్రభావం చూపింది. రోహిత్, సచిన్ రైడింగ్‌లో రాణించడంతో తొలి అర్ధభాగం ముగిసేసరికి గుజరాత్ 20-6తో స్పష్టమైన ఆధిక్యం సాధించింది. బ్రేక్ తర్వాత కూడా గుజరాత్ జోరు తగ్గలేదు.



గులియెవ్ (200మీ)

2007 తర్వాత జమైకా చిరుత ఉసేన్ బోల్ట్ లేకుండా జరిగిన 200 మీటర్ల రేస్..! దీంతో ఈ పరుగుపై సర్వత్రా ఆసక్తి..! బోల్ట్ తర్వాత ఈ స్థానం దక్కేదెవరికి..! ఉసేన్ వారసుడెవరు..! అంటే.. దక్షిణాఫ్రికా యువ సంచలనం వేన్ వాన్ నీకెర్క్‌పైనే అందరి దృష్టీ నెలకొంది. బోల్ట్ స్థానాన్ని భర్తీ చేసే సత్తా అతనికే ఉందంటూ క్రీడా పండితులు విశ్లేషించారు. కానీ.. రేసు మొదలైన సెకన్ల వ్యవధిలో అంచనాలన్నీ తారుమారయ్యాయి. నీకెర్క్ ఆశలపై నీళ్లు కుమ్మరిస్తూ టర్కీకి చెందిన రామిల్ గులియెవ్ 200 మీటర్ల విజేతగా నిలిచాడు. పురుషుల ట్రిపుల్ జంప్‌లో డిఫెండింగ్ చాంపియన్ క్రిస్టియన్ టేలర్ స్వర్ణం నెగ్గగా.. మహిళల 400 మీ. హర్డిల్స్‌లో కార్టర్ గోల్డ్ సాధించింది.

గోల్డెన్ గులియెవ్!

● టర్కీ రన్నర్ సంచలనం

● టేలర్‌కు 'ట్రిపుల్' స్వర్ణం

లండన్: పురుషుల 200 మీటర్ల ఫైనల్లో టర్కీకి చెందిన రామిల్ గులియెవ్ స్వర్ణం సాధించి అథ్లెటిక్ సామ్రాజ్యాన్ని అబ్బురపరిచాడు. క్రీడా పండితులు బోల్ట్ వారసుడిగా భావిస్తున్న సఫారీ స్టార్ రన్నర్ వేడ్ వాన్ నీకెర్క్‌కు షాకిచ్చిన గులియెవ్ ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో సరికొత్త రికార్డు సృష్టించాడు. గురువారం రాత్రి ఇక్కడ ఉత్కంఠగా సాగిన ఫైనల్లో గులియెవ్ 20.09 సెకన్లలోనే రేసును పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచాడు. తద్వారా ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్స్‌లో టర్కీ తరఫున తొలి స్వర్ణం నెగ్గిన ఆటగాడిగా తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించాడు. కాగా వరల్డ్ చాంపియన్‌షిప్స్ 400మీ., 200 మీ. విభాగాల్లో స్వర్ణాలు నెగ్గి మైకేల్ జాన్సన్ తర్వాత ఈ ఘనత సాధించిన తొలి అథ్లెట్‌గా రికార్డు నెలకొల్పాలని చూసిన నీకెర్క్ ఆశ నెరవేరలేదు. 1995లో మైకేల్ ఈ రెండు విభాగాల్లోనూ గోల్డ్ సాధించాడు. రేసుకు ముందు హాట్ టాపిక్‌గా మారిన ఇస్సాక్ మక్వాలా (బోత్సువానా) ఆరో స్థానంతో నిరాశపరిచాడు.

టేలర్‌కు 'ట్రిపుల్' గోల్డ్

పురుషుల ట్రిపుల్ జంప్‌లో అమెరికా అథ్లెట్ క్రిస్టియన్ టేలర్ ముచ్చటగా మూడో స్వర్ణం సాధించాడు. ఫైనల్లో టేలర్ 17.68 మీటర్లు దూకి గోల్డ్ అందుకున్నాడు. 2012, 2016 ఒలింపిక్స్‌లోనూ స్వర్ణం కొల్లగొట్టిన టేలర్ వరల్డ్ చాంపియన్‌షిప్స్ ట్రిపుల్ జంప్‌లో పసిడి నెగ్గడం గెలవడం ఇది మూడోసారి. కాగా.. అమెరికాకే చెందిన రియో విల్ క్లే 17.63మీ. రెండో స్థానంలో నిలిచాడు.



కోరి కార్టర్

400 మీ. హర్డిల్స్‌లో కార్టర్‌కు స్వర్ణం

మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో అమెరికా స్టార్ కోరి కార్టర్ స్వర్ణం సాధించింది. ఫైనల్లో కార్టర్ 53.07 సెకన్లతో రేసును పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచింది. అమెరికా అథ్లెట్ దలైలా మహమ్మద్ 53.50 సె.తో రజతం అందుకుంది. ట్రేసీ (జమైకా) 53.74 సె.తో మూడో స్థానం సాధించింది.



దేవిందర్

జావెలిన్ ఫైనల్లో దేవిందర్

జావెలిన్ త్రోలో పతకంపై ఆశలు రేపిన యువ సంచలనం నీరజ్ చోప్రా తీవ్రంగా నిరాశపరిచాడు. నీరజ్ అర్హత పోటీల్లోనే నిష్క్రమించగా.. దేవిందర్ సింగ్ కాంగ్ మాత్రం అంచనాలకు మించి రాణించి ఫైనల్లో అడుగుపెట్టాడు. క్వాలిఫికేషన్ రౌండ్ గ్రూప్-బి పోరులో జావెలిన్‌ను 84.22 మీటర్లు విసిరిన దేవిందర్ ఫైనల్‌కు అర్హత సాధించాడు.




దేవుడి కంటే ఎక్కువేంకాదు ?

న్యూఢిల్లీ: 'బీసీసీఐ దేవుడికంటే ఎక్కువేం కాదు' అని పేస్ బౌలర్ శ్రీశాంత్ ఆగ్రహించాడు. తనపై విధించిన జీవితకాల నిషేధాన్ని కేరళ హైకోర్టు కొట్టివేస్తూ తీర్పు ఇచ్చినా..బోర్డు దానిపై డివిజన్ బెంచ్‌కు అప్పీలు చేయాలని నిర్ణయించడంపై అతడు తీవ్రంగా స్పందించాడు. 'బీసీసీఐని నేను బిచ్చమడగడంలేదు. నా బతుకుదెరువును మళ్లీ ఇమ్మంటున్నాను. ఇది నా హక్కు. అయినా మీరు భగవంతుడి కంటే ఎక్కువేం కాదు' అని ట్విట్టర్‌లో వ్యాఖ్యానించాడు.

భారత్ మరో ఓటమి

న్యూఢిల్లీ: యూరప్ పర్యటనలో భారత పురుషుల హాకీ జట్టు వరుసగా రెండో పరాజయం చవి చూసింది. భారత్ 1-3తో ఆతిథ్య బెల్జియం చేతిలో ఓడింది. ఖురేషి భారత్ తరపున గోల్ చేశాడు.



కిమ్ గురిలో 'గ్వామ్'

అమెరికాకు వ్యూహాత్మకంగా కీలకం

అక్కడే నౌకా, వైమానిక దళ స్థావరాలు

ఒకవైపు 'అగ్రదేశం' అమెరికా! మరోవైపు... బుల్లి 'సామ్రాజ్యం' ఉత్తర కొరియా! అమెరికా ప్రపంచానికి 'పెద్దన్న'! ఆ అమెరికానే బెదిరించే దేశం ఉత్తర కొరియా! 'ఇక మాటల్లేవ్. యుద్ధమే! గ్వామ్ దీవంపై విరుచుకుపడతాం' అని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌చెప్పేశారు. 'ఈ నెలలోనే దాడి' అని తేల్చేశారు. గ్వామ్ దీవం ఎక్కడుంది? అది ఏమిటి? అమెరికాకు ఎలా ముఖ్యం? ఇవీ నేటి ప్రశ్నలు...

ఇలా కీలకం...

పసిఫిక్ మహా సముద్రంలో... జపాన్, ఉత్తర కొరియా, దక్షిణ కొరియా, ఫిలిప్పీన్స్, ఆస్ట్రేలియా మధ్యలో ఉన్న గ్వామ్ ద్వీపం వ్యూహాత్మకంగా కీలకమైనది. అందుకే... అమెరికా ఇక్కడ భారీ సైనిక స్థావరాలు నిర్వహిస్తోంది. ఇక్కడ 6 వేల మందికిపైగా సైనికులతో... వైమానిక, నౌకాదళ స్థావరాలు ఏర్పాటు చేసింది. అంతేకాదు... అణ్వస్త్రాలనూ, వాటిని ప్రయోగించగల వ్యవస్థలను సిద్ధంగా ఉంచింది. గ్వామ్ భూభాగంలో 30 శాతం అమెరికా ఆధీనంలోనే ఉందం టే... దీనికి ఉన్న ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవచ్చు. అమెరికా విమానాలు ఇక్కడి ఆండర్సన్ ఎయిర్‌ఫోర్స్ బేస్ నుంచే ఈ ప్రాంతంలో తిరుగాడుతుంటాయి. వెరసి... తన ప్రధాన భూభాగం నుంచి 11,500 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్వామ్ నుంచి అమెరికా అనేక దేశాలను తన 'ఆయుధ' పరిధిలోకి తెచ్చుకోగలుగుతోంది. అందుకే రక్షణపరంగా గ్వామ్ అత్యంత కీలకమైనది.

దాడి సాధ్యమేనా?

గ్వామ్‌పై గురిపెట్టగల క్షిపణులు ఉత్తర కొరియా వద్ద ఎప్పటి నుంచో ఉన్నాయి. అయితే... గతనెలలో తొలిసారిగా ఖండాతర క్షిపణిని హోస్వాంగ్-14ను విజయవంతంగా ప్రయోగించినట్లు కిమ్ ప్రకటించారు. దీంతో అమెరికాలోని అలస్కా, శాండియాగోనూ దెబ్బ తీయగలమని తెలిపారు. 'ముందస్తుగా'గా గ్వామ్‌పై దాడికి దిగుతామని హెచ్చరించారు.

ఇదీ గ్వామ్..

పసిఫిక్ సముద్రంలోని సుందర ద్వీపం గ్వామ్. ఉత్తర కొరియా నుంచి సుమారు 3వేల కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. దీని విస్తీర్ణం 210 చదరపు కిలోమీటర్లు. అంటే... గ్రేటర్ హైదరాబాద్‌లో దాదాపు మూడో వంతు! అమెరికాలో భాగమైనప్పటికీ ఆ దేశ ప్రధాన భూభాగానికి అత్యంత దూరంలో ఉన్న ద్వీపం ఇదే. గ్వామ్ జనాభా సుమారు 1.60 లక్షలు. వీరు పేరుకే అమెరికా పౌరులు. కానీ... అధ్యక్ష ఎన్నికల్లో వీరికి ఓటు వేసే హక్కు ఉండదు. ఈ ద్వీపం సుమారు 400 ఏళ్లపాటు స్పెయిన్, జపాన్ ఆధీనంలో ఉండేది. 1944లో జపాన్‌ను యుద్ధంలో ఓడించి... గ్వామ్‌ను అమెరికా సొంతం చేసుకుంది.

కనుసైగ చేస్తే చాలు!

- ఉత్తరకొరియాపై దాడికి సైన్యం సిద్ధం: ట్రంప్



వాషింగ్టన్, ఆగస్టు 11: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజా ట్వీట్.. ఉత్తరకొరియాతో ఉద్రిక్తత స్థాయిని మరింత పెంచారు. కనుసైగ చేస్తే చాలు.. కొరియాపై అమెరికా సైన్యం దాడి చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. 'కొరియాపై సైనికదాడికి ఏర్పాట్లు జరిగిపోయాయి. ఒకవేళ కొరియా తెలివితక్కువగా వ్యవహరిస్తే.. సైనిక చర్యలు తప్పవు' అన్నారు. అయితే ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ సరైన దారిలో నడుస్తారని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు. ట్రంప్, కిమ్‌ల మధ్య మాటల యుద్ధం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇరువురు నేతలు సంయమనం పాటించాలని చైనా విజ్ఞప్తి చేసింది. గ్వామ్ దీవిపై క్షిపణి దాడికి సిద్ధంగా ఉన్నామని ఉత్తరకొరియా ప్రకటించిన నేపథ్యంలో... ఒకవేళ అదే జరిగితే తీవ్రపరిణామాలు తప్పవని ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. కాగా, దక్షిణ చైనా సముద్ర జలాల్లోకి అమెరికా యుద్ధ నౌక 'యూఎస్‌ఎస్ జాన్ ఎస్ మెకైన్' ప్రవేశించడంపై చైనా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.

రాజ్యాంగ పదవుల్లో సామాన్యులు

ఇది మన ప్రజాస్వామ్య గొప్పదనం.. స్వతంత్ర భారతంలో జన్మించిన తొలి ఉప రాష్ట్రపతి వెంకయ్యే


వెంకయ్యను తోడ్కొని వస్తున్న ప్రధాని మోదీ

- రాజ్యసభలో వెంకయ్యకు స్వాగతం పలికిన మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): "స్వతంత్ర భారతదేశంలో జన్మించిన తొలి ఉప రాష్ట్రపతి వెంకయ్యే! పార్లమెంటు సభ్యుడిగా ఆయనకు అపారమైన అనుభవం ఉంది. పార్లమెంటరీ కార్యకలాపాలపై పూర్తి అవగాహన ఉంది. క్రియాశీల నేతగా, పార్లమెంటేరియన్‌గా ఆయన గడించిన అపారమైన అనుభవం మాకు మార్గదర్శకం" అని ప్రధాని మోదీ కొనియాడారు. తొలిసారి సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన వారితో రాజ్యాంగ పదవులు నిండిపోయాయని, ఇది ప్రజాస్వామ్య గొప్పదనమని కొనియాడారు. అనేక ఏళ్లు ప్రజల్లో ఉన్న వ్యక్తి ఉప రాష్ట్రపతి కావడం ఇదే తొలిసారన్నారు. వెంకయ్య రాజ్యసభ చైర్మన్ హోదాలో శుక్రవారం తొలిసారిగా సభాపతి స్థానంలో ఆశీనులయ్యారు. సభ్యులంతా ఆయనకు స్వాగతం పలికారు. తొలుత ప్రధాని శుభాకాంక్షలు తెలుపుతూ ప్రసంగించారు. "రైతు బిడ్డ వెంకయ్య.. సోషలిస్టు నేత జయప్రకాశ్ నారాయణ్ ఇచ్చిన పిలుపుతో విద్యార్థి ఉద్యమంలో పాల్గొన్నారు. అక్కడి నుంచి వెనుదిరిగి చూడకుండా ప్రయాణించి ఇప్పుడు దేశ రెండో అతి పెద్ద రాజ్యాంగ పదవిలో కూర్చున్నారు. ఎప్పుడూ రైతులు, గ్రామాలు, పేదల గురించే ఆలోచించేవారు. పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నా కేబినెట్ సమావేశాల్లో ఎక్కువగా గ్రామాలు, రైతుల గురించే మాట్లాడేవారు" అని అన్నారు. ఆయన ఆలోచనల్లో నుంచి పుట్టిన 'ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన'తో ఎన్నో గ్రామాలకు కనెక్టివిటీ అందిందన్నారు. "వెంకయ్య తెలుగులో సూపర్ ఫాస్ట్‌గా ప్రసంగిస్తారు. హిందీలో ప్రసంగిస్తున్నప్పుడు తెలుగు పదాలు కూడా వాడతారు. అయినా ప్రసంగంలో స్పష్టత ఉంటుంది. ప్రాసలు అల్లడంలో వెంకయ్య దిట్ట. న్యాయవాది న్యాయమూర్తి అయితే ఎలానో.. చాలా ఏళ్లపాటు రాజ్యసభలో ఉన్న ఆయన ముందు కొంత కాలం ఇబ్బందిపడతారు" అని చమత్కరించారు. వెంకయ్యతో తనకు 50 ఏళ్ల అనుబంధం ఉందని, రాజకీయ రంగంలో చాలా కష్టపడి ఆయనీ స్థాయికి చేరుకున్నారని ఆర్థిక మంత్రి జైట్లీ కొనియాడారు. పార్లమెంటరీ వ్యవహారాలపై వెంకయ్యకు అపారమైన అనుభవం ఉందని, సభను సజావుగా నడపడానికి ఆయన దాన్ని ఉపయోగిస్తారని ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్ ఆశాభావం వ్యక్తం చేశారు.

నాలుగు పీఠాల్లోనూ కమలనాథులు

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తొలిసారిగా దేశంలోని నాలుగు కీలక రాజ్యాంగ పదవుల్లో బీజేపీ నేతలే కొలువుదీరారు. రాష్ట్రపతిగా రామ్‌నాథ్ కోవింద్, ఉప రాష్ట్రపతిగా వెంకయ్య నాయుడు, ప్రధాన మంత్రిగా మోదీ, లోక్‌సభ స్పీకర్‌గా కొనసాగుతున్న సుమిత్రా మహాజన్ బీజేపీ నేతలే. వీరికి ఆరెస్సెస్ నేపథ్యం కూడా ఉండడం గమనార్హం. వీరంతా వారసత్వాలు ఏమీ లేకుండా జవసత్వంతో ఉన్నత స్థానాలకు చేరిన సామాన్యులు కావడం మరో విశేషం.



వెంకయ్య ఓఎస్డీగా సత్యకుమార్

న్యూఢిల్లీ, ఆగస్టు(ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు కార్యదర్శివర్గం(సెక్రటేరియట్)లో తొలి నియామకం జరిగింది. ఓఎస్డీగా వై సత్యకుమార్‌ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సత్యకుమార్ ఏబీవీపీ కార్యకర్తగా విద్యార్థి రాజకీయాలలో చురుకైన పాత్ర పోషించారు. 24 ఏళ్ల క్రితం వెంకయ్యనాయుడు ఉమ్మడి ఏపీ బీజేపీ శాఖ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు ఆయనతో సాన్నిహిత్యం కలిగింది. అప్పటినుంచి ఆయనకు కార్యదర్శిగా ఉంటూ వచ్చారు. వెంకయ్య కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉండగా అదనపు కార్యదర్శిగా, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నప్పుడు మంత్రికి ఓఎస్డీగా సత్యకుమార్ బాధ్యతలు నిర్వర్తించారు. తొలిసారిగా ఆలిండియా సర్వీసుకు చెందని వ్యక్తి ఓఎస్డీగా సత్య నియామకం జరగడం విశేషం.



నేను వెళ్తున్నా.. ఆయన వస్తున్నారు

- సీతారాం ఏచూరి

న్యూఢిల్లీ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వెంకయ్య రాజ్యసభ చైర్మన్ అయ్యారని, తాను రాజ్యసభ నుంచి రిటైర్ అవుతున్నానని, 'నేను వెళ్తున్నా.. ఆయన వస్తున్నారు' అని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. సభలో ఇదే తన చివరి ప్రసంగమన్నారు. శుక్రవారం రాజ్యసభలో వెంకయ్యకు స్వాగతం పలికిన ఆయన మాట్లాడారు. వెంకయ్యతో తనకు 40 ఏళ్ల పరిచయముందన్నారు. సభలో లేవనెత్తే అంశాలకు న్యాయం చేయాలని వెంకయ్యను కోరారు.

రాజ్యాంగ పీఠంపై మనోడు!

- ఉప రాష్ట్రపతిగా వెంకయ్య ప్రమాణ స్వీకారం
- ఈ పదవి చేపట్టిన రెండో తెలుగు వాడు
- అడ్వాణీకి నమస్కారం.. సోనియా గైర్హాజరు



న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తెలుగువాడు మరోసారి కేంద్రంలో ప్రతిష్ఠాత్మక పదవిని అలంకరించాడు. మన తెలుగు బిడ్డ రాజ్యాంగపరంగా దేశంలోనే రెండో అత్యున్నత పదవిని అధిష్ఠించాడు. ఉపాపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు భారత 15వ ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శుక్రవారం ఉదయం 10.15 గంటలకు హిందీలో ఆయనతో ప్రమాణం స్వీకారం చేయించారు. రాష్ట్రపతి భవన్‌లోని దర్బార్ హాల్‌లో అత్యంత అట్టహాసంగా జరిగిన ఈ వేడుకకు అతిరథ మహారథులంతా హాజరయ్యారు. ఉప రాష్ట్రపతిగా రిజిస్టర్‌లో సంతకం చేసిన వెంకయ్య.. ప్రధాని మోదీ, అమిత్ షా, బీజేపీ కురువృద్ధులు అడ్వాణీ, మురళీ మనోహర్ జోషి వద్దకు వెళ్లి నమస్కరించారు. అందరితో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ తర్వాత ఉపరాష్ట్రపతిగా తెలుగువాడు ఈ పదవికి ఎంపిక కావడం ఇదే తొలిసారి. అలాగే, వెంకయ్య ఈ పదవిని చేపట్టిన 13వ వ్యక్తి. ప్రమాణ స్వీకారానికి ముందు రాజ్‌ఘాట్‌కు వెళ్లి మహాత్మాగాంధీ సమాధి వద్ద వెంకయ్య అంజలి ఘటించారు. అనంతరం రాజ్యసభకు వెళ్లి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు, బీహార్, ఢిల్లీ ముఖ్యమంత్రులు నితీశ్ కుమార్, కేజ్రీవాల్, బీజేపీ ముఖ్యమంత్రులు ఫడణవీస్, శివరాజ్‌సింగ్ చౌహాన్, రమణ్ సింగ్, వసుంధరా రాజే, యోగి ఆదిత్యనాథ్, మనోహర్ పారీకర్, మనోహర్‌లాల్ ఖట్టర్, సోనోవాల్, సుప్రీం కోర్టు జస్టిస్ ఎన్‌వీ రమణ, గవర్నర్ నరసింహన్, ఎంపీలు గులాంనబీ ఆజాద్, రాజీవ్ శుక్లా, కేశవరావు, జితేందర్ రెడ్డి, పన్నీర్ సెల్వం, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు లక్ష్మణ్, కిషన్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, మాజీ ఎంపీ శివాజీ, మంద కృష్ణ మాదిగ హాజరయ్యారు. కాగా, ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ హాజరు కాలేదు.

- రాజ్యసభ సభాపతి స్థానంలో కూర్చోవడానికి వచ్చిన వెంకయ్యకు ఎంపీలు బల్లలు చరిచి స్వాగతం పలికారు.
- 'నాయుడు' అంటే... 'నౌ ఆల్ ఇండియా డియరెస్ట్ అంపైర్' అని తృణమూల్ ఎంపీ డెరిక్ ఒబ్రీన్ అభివర్ణించారు.
- తెలుగులో మాట్లాడాలని సీపీఎం ఎంపీ సీతారాం ఏచూరిని కాంగ్రెస్ ఎంపీ రేణుకాచౌదరి గద్దించారు. దాంతో కాసేపు ఆయన తెలుగులో మాట్లాడారు.
- వెంకయ్య తెలుగు బిడ్డ మాత్రమే కాదని, హిందుస్థాన్ బిడ్డ అని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు.

వాదించండి.. విభేదించండి.. బహిష్కరించకండి!

- చర్చల ద్వారానే ప్రజా సమస్యలకు పరిష్కారం
- రాజ్యసభ చైర్మన్‌గా వెంకయ్య తొలి ప్రసంగం

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): "ప్రజాస్వామ్యంలో చర్చల ద్వారానే ప్రజా సమస్యలకు పరిష్కారం కనుక్కోవాలి. అధికార పక్షంతో విభేదించినా, వాదించినా అంతిమ ప్రయోజనం ప్రజా సంక్షేమమే కావాలి. వాదించండి. చర్చించండి. వివిధ అంశాలపై నిర్ణయాలు తీసుకోండి. కానీ, అంతరాయాలు కల్పించవద్దు. సభను బహిష్కరించవద్దు" అని రాజ్యసభ చైర్మన్‌గా వెంకయ్య నాయుడు తనదైన శైలిలో సభ్యులకు హితవు పలికారు. ఉప రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత రాజ్యసభ చైర్మన్‌గా పదవీ బాధ్యతలను చేపట్టిన వెంకయ్య తొలి ప్రసంగం సభికులందర్నీ ఆకట్టుకుంది. సభ్యులు తమకు కల్పించిన సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే ఇంకా ఎక్కువ రోజులు సభను జరిపేలా ప్రభుత్వాన్ని కోరతానని చెప్పారు. "1998లో నేను తొలిసారిగా రాజ్యసభలోకి అడుగు పెట్టినప్పుడు ఇదే సభకు చైర్మన్ అవుతానని కలలో కూడా ఊహించలేదు. ఎటువంటి రాజకీయ వారసత్వం లేని నాలాంటి సామాన్యులను కూడా అందలం ఎక్కించగల ఘనత పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ఉంది" అని వ్యాఖ్యానించారు. రాజ్యసభ ఔన్నత్యాన్ని పెంపొందించేందుకు ప్రతి సభ్యుడూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. "ప్రపంచంలో ఆర్థికంగా అత్యంత వేగంగా ఎదుగుతున్న అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌ను బలీయమైన దేశంగా నిలబెట్టేందుకు సమర్థ చట్టాలు అవసరం. మానవ, సహజ వనరులను సమర్థంగా ఉపయోగించుకోగలిగితే త్వరితగతిన అభివృద్ధిని సాధించగలం" అని వివరించారు. తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తున్నామా? లేదా? అని పార్లమెంటు సభ్యులు ఆత్మ విమర్శ చేసుకోవాలని చెప్పారు. సభలను అడ్డుకోవడమే తమ ప్రథమ కర్తవ్యమన్న ధోరణి ప్రమాదకరమని హెచ్చరించారు.

అర్థవంతమైన చర్చలకే ప్రాధాన్యం ఇవ్వాలి

సభలో జరిగే అర్థవంతమైన చర్చలను ప్రోత్సహించేలా పత్రికలు కథనాలు ప్రచురించాలని వెంకయ్య సూచించారు. వ్యవసాయ రంగంపై గతంలో తాను చేసిన ప్రసంగాన్ని స్వామినాథన్ వంటి నిపుణులు అభినందిస్తే మరుసటి రోజు పత్రికల్లో ఒక్క ముక్క కూడా రాయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పత్రికలు తమ ప్రాధాన్యాలను మార్చుకుంటే సభలో సభ్యుల తీరు మారే అవకాశముందని అభిప్రాయపడ్డారు.



వెంకయ్య కంటతడి

రాజ్యసభ చైర్మన్‌గా ప్రసంగిస్తున్న సమయంలో వెంకయ్య నాయుడు తల్లి దండ్రులను గుర్తు చేసుకుని కంటతడి పెట్టుకున్నారు. తనకు చిన్న వయసులోనే తల్లిదండ్రులు పోయారని చెప్పారు. తన చిన్న తనాన్ని గుర్తు చేసుకున్నారు. చిన్నతనం నుంచి తాను పార్టీనే తల్లిలా భావిస్తున్నానని చెప్పారు.

ప్రమాణస్వీకారానంతరం సంతకం చేస్తున్న వెంకయ్యనాయుడు

మీ సంగతి 2019లో చూస్తా..

- బీజేపీ ఎంపీలకు మోదీ హెచ్చరిక
- సభకు గైర్హాజరవడంపై ఆగ్రహం

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): "మీరు పార్లమెంటుకు ఎందుకు ఎన్నికయ్యారు? సభకు హాజరు కావడానికా లేక సంతకం చేసి ఇళ్లకు వెళ్లి విశ్రాంతి తీసుకోవడానికా? మీలాగే పార్టీలో సేవ చేసిన వారు చాలామంది ఉన్నారు. వారందర్నీ కాదని మీకు సీట్లు ఇచ్చి గెలిపిస్తే పార్లమెంటుకు సరిగ్గా హాజరు కాకపోవడం శోచనీయం. మీ ఇష్టం వచ్చినట్లు మీరు ప్రవర్తిస్తే 2019లో మా ఇష్టం వచ్చినట్లు మేము సీట్లు ఇవ్వాల్సి ఉంటుంది" అని ప్రధాని మోదీ బీజేపీ ఎంపీలకు హెచ్చరిక జారీ చేశారు. గురువారం నిర్వహించిన బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని కన్నెర్ర చేశారు. ఎంపీల తీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా రాజ్యసభలో అడుగుపెడుతున్నారని, ఇకపై ఎంపీల ఆటలు సాగవన్న అర్థం వచ్చేలా మాట్లాడిన ప్రధాని.. రాబోయే ఎన్నికల్లో ఎంపీల పని తీరు ఆధారంగానే సీట్ల కేటాయింపు ఉంటుందని తేల్చి చెప్పారు.

పీఎఫ్ ఖాతా నంబరు ఇక శాశ్వతం

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ఉద్యోగులకు శుభవార్త. వారు ఉద్యోగం మారినా, భవిష్యనిధి (పీఎఫ్) ఖాతా నంబరు అలాగే కొనసాగనుంది. దీని వల్ల ఉద్యోగి సంస్థ మారినా, కొత్తగా మళ్లీ పీఎఫ్ ఖాతాను ప్రారంభించాల్సిన అవసరం ఉండదు. వచ్చే నెల నుంచి ఈ విధానం అమలులోకి రానుందని చీఫ్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ వీపీ జాయ్ వెల్లడించారు. పీఎఫ్ ఖాతాలు శాశ్వతంగా కొనసాగేలా విధానాన్ని అమలు చేయనున్నామన్నారు. ఉద్యోగులు మధ్యలో తమ ఖాతాలు రద్దు చేసుకోవడం సరికాదని, అందుకే శాశ్వత నంబరు విధానాన్ని అమలు చేస్తున్నామని జాయ్ చెప్పారు. పీఎఫ్ ఖాతాకు ఆధార్ తప్పనిసరి చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగి సంస్థ మారితే, మూడు రోజుల్లో అతడి ఖాతా కొత్త సంస్థకు బదిలీ అయ్యేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

దేనికైనా రెడీ!

- చైనాను ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధం
- సరిహద్దుల్లో భారీగా బలగాల మోహరింపు
- సిక్కిం, అరుణాచల్‌లో 45 వేల మంది సైనికులు
- ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొంటాం: జైట్లీ



న్యూఢిల్లీ, ఆగస్టు 11: భారత సైన్యం అప్రమత్తమైంది. డోక్లాంపై చైనా ఎలాంటి కవ్వింపు చర్యలకు దిగినా దీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధమైంది. అందులో భాగంగా శుక్రవారం వ్యూహాత్మకంగా కీలక అడుగు వేసింది. సిక్కిం నుంచి అరుణాచల్ ప్రదేశ్ వరకు 1400 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న భారత్, చైనా సరిహద్దు పొడవునా పెద్ద ఎత్తున సైనిక బలగాలను మోహరించింది. భద్రతా దళాలకు జారీ చేసే 'హెచ్చరిక స్థాయి'ని పెంచింది. భారత్, చైనా సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితులను అధ్యయనం చేసిన తర్వాత, చైనా దూకుడును పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీనియర్ సైనికాధికారి ఒకరు తెలిపారు. డోక్లాంకు కొద్ది దూరంలో ఉన్న సుక్నాలో భారత సైన్యానికి చెందిన 33 కార్ప్స్ ప్రధాన కేంద్రం ఉంది. అరుణాచల్‌లో 3 కార్ప్స్, అసోంలో 4 కార్ప్స్ ప్రధాన కేంద్రాలున్నాయి. సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్‌ల్లో భారత్, చైనా సరిహద్దు రక్షణ బాధ్యతలను ఈ మూడింటికి అప్పగించారు. 33 కార్ప్స్‌ను మాత్రం ప్రత్యేకంగా డోక్లాం పరిసర ప్రాంతాల్లోనే మోహరించినట్లు సమాచారం. సిక్కిం, అరుణాచల్ సరిహద్దుల్లో సుమారు 45 వేల మంది భారత సైనికులు మోహరించినట్లు రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. అయితే, డోక్లాంలో ఎలాంటి అదనపు బలగాలను మోహరించలేదని ఓ సైనికాధికారి తెలిపారు. కాగా, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకైనా భారత సైన్యం సిద్ధంగా ఉందని కేంద్ర రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ లోక్‌సభలో స్పష్టం చేశారు. డోక్లాం పేరును ప్రస్తావించకుండా ఆయనీ వ్యాఖ్యలు చేశారు. మరోవైపు భారత విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ భూటాన్ విదేశాంగ మంత్రి డామ్చో డోర్జీతో శుక్రవారం భేటీ అయ్యా రు. కాగా, దక్షిణ చైనా సముద్రంపై క్రమేణా పట్టు బిగిస్తున్న చైనా తాజాగా తన దృష్టిని హిం దూ మహాసముద్రంపై సారించింది. అందులో భాగంగా తన నావికాదళాన్ని బలోపేతం చేసుకొనేందుకు బడ్జెట్ కేటాయింపుల్లో అధికభాగం కేటాయిస్తోంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.